సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 20

శుక్రవారం 12-4-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



వృద్ధి అంచనా పెంచిన ఏడీబీ

2024–25కి 6.7 శాతం నుంచి 7 శాతానికి అప్. - 13లో



ముంబై ఫటాఫట్...

197 పరుగుల లక్ష్యాన్ని 15.3 ఓవర్లలో ఛేదన. మెరిసిన బుమ్రా, ఇషాన్, సూర్య. - 13లో



ఉగ్రవాదులకు చావుదెబ్బ

కేంద్రంలో తమ ప్రభుత్వం ఉండటంతో ఉగ్రవాదులు చావుదెబ్బ తిన్నారని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో



వారి బాధలు ఎవరికీ పట్టట్లేదు

రైతులు, నిరుద్యోగులు, మహిళల బాధలను మోదీ సర్కార్ పట్టించుకోవట్లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు.

- వివరాలు 6లో



స్పైవేర్ దాడులు జరగొచ్చు

భారత్‌లో మరోమారు పెగాసస్ తరహా స్పైవేర్ దాడులు జరగవచ్చని యూజర్లను యాపిల్ సంస్థ హెచ్చరించింది.

- వివరాలు 6లో



వియత్నాం 'రియల్' దిగ్గజానికి ఉరి

బ్యాంక్‌ను రూ. లక్ష కోట్లకుపైగా మోసగించినందుకు వియత్నాం రియల్ ఎస్టేట్ మహిళా దిగ్గజం మైలాన్‌కు కోర్టు ఉరిశిక్ష విధించింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

వ్యవస్థలన్నీ రేవంత్ గుప్పిట్లో



రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన గుప్పిట్లో పెట్టుకున్నారని బీఆర్ఎస్ విమర్శించింది. ప్రజాస్వామిక తెలంగాణ పేరిట అధికారంలోకి వచ్చిన రేవంత్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

- వివరాలు 2లో


నగదు అక్రమ రవాణాపైనా సిట్ నజర్!



గత ఎన్నికల సందర్భంగా పోలీసు వాహనాల్లో అక్రమంగా నగదు తరలింపు విషయం ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు సందర్భంగా వెలుగు చూడటంతో హైదరాబాద్ పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు.

- వివరాలు 14లో

అసైన్డ్ భూమిని ఎలా కొట్టేయాలనుకున్నారు?



హైదరాబాద్ శివార్లలోని బుద్వేల్‌లో ఉన్న 26 ఎకరాల అసైన్ భూమిని కాజేసిన కేసులో నిందితుడైన టీడీపీ నేత, మాజీ పోలీసు అధికారి మాండ్ర శివానందరెడ్డిని సీసీఎస్ పోలీసులు లోతుగా విచారించారు.

- వివరాలు 5లో

తెలుగులోనూ పేపర్ ఇవ్వండి



నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగా ఆర్ట్ టీచర్ పోస్టులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో తిరిగి పరీక్ష నిర్వహించాలని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టీఆర్ఈఐఆర్‌బీ)ని హైకోర్టు ఆదేశించింది.

- వివరాలు 14లో

ఇదండీ సంగతి



ఇల్లంతా ఊడ్చి పెడితే ఓటేస్తానని 'హామీ' ఇచ్చానులే!



యాసంగి.. దిగులుబడి

తగ్గనున్న ధాన్యం దిగుబడి.. ఈసారి 1.06 కోట్ల టన్నుల్లోపే వచ్చే అవకాశం

వ్యవసాయశాఖ రెండో ముందస్తు అంచనాల నివేదికలో వెల్లడి

- గత యాసంగితో పోలిస్తే 14 లక్షల టన్నులు తగ్గుదల
- వేరుశనగ కూడా 65 వేల టన్నుల మేర తగ్గే చాన్స్
- గణనీయంగా తగ్గనున్న మిగతా పంటల దిగుబడి
- సాగునీరు లేకపోవడం.. పంట విస్తీర్ణం తగ్గటం.. కరువు పరిస్థితులే కారణం
- దిగుబడి తగ్గే నేపథ్యంలో సన్నాలకు డిమాండ్..
- పొలాల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తున్న మిల్లర్లు, వ్యాపారులు.. ఈసారి బియ్యం ధరలు మరింత పెరగొచ్చంటున్న మార్కెట్ వర్గాలు

సాక్షి, హైదరాబాద్: యాసంగిలో వరి దిగుబడి గణనీయంగా తగ్గిపోనుంది. సాగు విస్తీర్ణం తగ్గడం.. కీలక సమయంలో సాగునీరు అందుబాటులో లేక ఎండిపోవడం, అకాల వర్షాలు, వడగళ్ల నష్టం వంటివి దీనికి కారణమవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి.. రైతులు తీవ్రంగా నష్టపోయారు కూడా. ఈ నేపథ్యంలో యాసంగికి సంబంధించిన రెండో ముందస్తు అంచనాల నివేదికను వ్యవసాయశాఖ తాజాగా విడుదల చేసింది. గత యాసంగిలో వరి దిగుబడి 1.20 కోట్ల మిగతా 2వ పేజీలో ▶



పంటను పశువులకే వదిలేసి...

వేలేరు: హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచరకు చెందిన రైతు కొయ్యడ బొందయ్య రెండున్నర ఎకరాల్లో వరి వేశాడు. ఇరవై రోజుల నుంచి నీళ్లు లేక వరి పంట అంతా ఎండిపోయింది. చేసేదేం లేక వరి పంటను ఇలా పశువులకు వదిలేశాడు.



రైతులను మోసం చేస్తే సహించేది లేదు..

- ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది.. 'ఎక్స్'లో సీఎం రేవంత్
- అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- జనగామ ఘటనలో ముగ్గురు ట్రేడర్లపై కేసు.. ఓ అధికారికి సర్కారు నోటీసు

2లో

కవితను అరెస్టు చేసిన సీబీఐ..

ప్రత్యేక కోర్టులో సవాల్ చేసిన కవిత

రెగ్యులర్ కోర్టుకు వెళ్లాలన్న న్యాయమూర్తి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సీబీఐ అరెస్టు చేసింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పటికే ఆమెను అరెస్టు చేయగా జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా తాము కవితను అరెస్టు చేసినట్లు గురువారం మధ్యాహ్నం ఆమె కుటుంబ సభ్యులకు సీబీఐ అధికారులు తెలిపారు. దీంతో కవిత అరెస్టును సవాల్ చేస్తూ ఆమె తరపు న్యాయవాది నితీష్ రాణా.. రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. గురువారం రంజాన్ సెలవు నేపథ్యంలో ప్రత్యేక న్యాయమూర్తి మనోజ్‌కుమార్ ముందు ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అరెస్టు చేయడం సరికాదన్నారు. ముందుగా చెప్పాలంటూ కోర్టు ఆదేశాలు ఉన్నాయని గుర్తు చేశారు. దీంతో మద్యం కుంభకోణం కేసును తాను గతంలో విచారించలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. అత్యవసర కేసులు మాత్రమే ప్రస్తుతం పరిశీలిస్తామని చెప్పారు. దీనిని శుక్రవారం రెగ్యులర్ కోర్టు ముందు ప్రస్తావించాలని సూచించారు. అనంతరం రాణా మీడియాతో మాట్లాడుతూ.. కవిత అరెస్టు అన్యాయమని, ఎలాంటి నోటీసు లేకుండా అరెస్టు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఇదే విషయం శుక్రవారం రెగ్యులర్ కోర్టు ముందు ప్రస్తావిస్తామని చెప్పారు.

కస్టడీ కోరనున్న సీబీఐ!

రౌస్ అవెన్యూ కోర్టు అనుమతితో సీబీఐ శనివారం కవితను తీహార్ జైలులో ప్రశ్నించిన విషయం విదితమే. మాజీ ఆడిటర్ బుచ్చిబాబుతో వాట్సాప్ చాట్‌లు, భూ ఒప్పందానికి సంబంధించిన అంశాలపై కవితను ప్రశ్నించినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. తాజాగా ఆమెను అరెస్టు చేసిన నేపథ్యంలో విచారణ నిమిత్తం కస్టడీకి ఇవ్వాల్సిందిగా సీబీఐ శుక్రవారం ప్రత్యేక కోర్టును కోరనున్నట్లు తెలిసింది.

సమ్మర్.. కాస్త కూల్!

- రాష్ట్రంలో ఒక్కసారిగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- చాలాచోట్ల సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీల మేర తగ్గుదల
- ఆదిలాబాద్‌లో ఏకంగా 9.6 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు
- సరిహద్దులో ఉపరితల ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావం
- శుక్ర, శనివారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే చాన్స్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఒక్కసారిగా ఎండలు తగ్గాయి. కొన్నిరోజుల పాటు భారీగా నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పతనమయ్యాయి. వడగాడ్పుల తీవ్రత సైతం తగ్గడంతో ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. దాదాపు పదిరోజులుగా రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదవుతూ వచ్చాయి. ఒకవైపు అత్యధిక ఉష్ణోగ్రతలు.. మరోవైపు ఉక్కపోత.. వీటికి తోడు వడగాడ్పుల ప్రభావంతో రాష్ట్ర ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ముున్ముందు వేసవి తీవ్రతను తలుచుకుని ఆందోళనకు గురయ్యారు. కానీ బుధవారం నుంచి వాతావరణం చల్లబడటం ప్రారంభించింది. బుధవారం రాత్రి చల్లటి మిగతా 5వ పేజీలో ▶



గురువారం రంజాన్ సందర్భంగా హైదరాబాద్ చార్మినార్ వద్ద మక్కా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

దర్శకరత్న పేరుతో అవార్డులు..

తమ్మారెడ్డి భరద్వాజ వెల్లడి



'దర్శకరత్న దాసరి నారాయణరావుగారి 77వ జయంతి వేడుకలను మే 5న నిర్వహించనున్నాం. గురువుగారికి నివాళులు అర్పిస్తూ... అభినవ దర్శక రత్న, అభినయ రత్న, నిర్మాణ రత్న వంటి పురస్కారాలు ప్రదానం చేయనున్నాం' అని దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. - 12లో

రేపు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

- రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ముగ్గురు ఎంపీ అభ్యర్థుల ఖరారుకు చాన్స్
- తమ కుటుంబ సభ్యులకు ఖమ్మం సీటు కోసం డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల ఒత్తిడి
- రేసులో మాజీ మంత్రి మండవ, మరికొందరు ఉన్నట్లు ప్రచారం
- అధిష్టానం పెద్దలను కలవనున్న సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న మూడు ఎంపీ టికెట్ల కేటాయింపుపై కాంగ్రెస్ అధిష్టానం శనివారం ఓ నిర్ణయానికి రానుంది. ఢిల్లీలో జరగనున్న పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో అభ్యర్థులను ఖరారు చేయనుంది. టీపీసీసీ చీఫ్ రేవంత్ ఈ భేటీ కోసం ఢిల్లీకి వెళ్లారు. పార్టీ అగ్రనేతలను కలిసి.. ఆయా నియోజకవర్గాల పరిస్థితులు, అభ్యర్థుల ఎంపికపై చేసిన కసరత్తును వివరించనున్నారు. సీఈసీ సమావేశానికి ముందే ఏఐసీసీ చీఫ్ ఖర్గే, రాహుల్‌లతో రేవంత్ భేటీ కానున్నట్టు తెలిసింది. భువనగిరిలో పార్టీ నిర్వహించే బహిరంగ సభకు రావాలని అగ్రనేతలను రేవంత్ ఆహ్వానించనున్నట్టు సమాచారం.

మూడు స్థానాలపై ఉత్కంఠ

రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలకుగాను 14 మంది అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికే ప్రకటించింది. ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ సీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి మిగతా 5వ పేజీలో ▶

దిద్దుబాటుపై గులాబీదళం గురి

- వలసలతో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడంపై బీఆర్ఎస్ నజర్.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిస్థితి మదింపు
- సుమారు 48 అసెంబ్లీ సెగ్మెంట్లలో పలువురు పార్టీకి దూరం
- తాత్కాలిక ఇన్‌చార్జీలు, సమన్వయ కమిటీలతో దిద్దుబాటు
- ప్రచార పర్వం, గెలుపు అవకాశాలపై ప్రభావం పడకుండా జాగ్రత్తలు



సాక్షి, హైదరాబాద్: పార్టీ నుంచి వలసలు కొనసాగుతుండటంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు బీఆర్ఎస్ ప్రాధాన్యత ఇస్తోంది. నేతలు వీడిన చోట జరిగే నష్టాన్ని వీలైనంత మేర పూడ్చి లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని గాడిన పెట్టడంపై దృష్టి పెడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వలసల కారణంగా నెలకొన్న పరిస్థితిని మదింపు చేస్తోంది. కీలక నేతలు పార్టీని వీడిన చోట సమన్వయకర్తల నియామకంతో కేడర్‌ను ఏకతాటి పైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు నైరాశ్యంలో కూరుకుపోకుండా వారిలో ఉత్సాహాన్ని నింపి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగస్వాములను చేసేలా ప్రణాళికను అమలు చేస్తోంది.

150 మందికి పైగానే దూరం!

గడిచిన ఏడాది కాలంగా 48 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలువురు కీలక నేతలు పార్టీకి దూరమయ్యారు. సిట్టింగ్ ఎంపీలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మిగతా 5వ పేజీలో ▶

బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి



- రూ. 20 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ ప్రకటించాలి
- ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి
- పూలే జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన జ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే పేరిట రూ. 20 వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ పెట్టాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీల ఓట్లు దండుకొనేందుకే కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందని విమర్శించారు. వచ్చే బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని, ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, మిగతా 2వ పేజీలో ▶

రేవంత్ నాయకత్వంలో ఒక్కటిగా ఉన్నాం



- మరోసారి కూడా సీఎం రేవంత్‌రెడ్డే
- మాలో గ్రూపులు లేవు.. ఏక్‌నాథ్‌షిండేలు లేరు
- రాబోయే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం
- హరీశ్‌రావు, మహేశ్వర్‌రెడ్డివి విజ్ఞత లేని మాటలు
- బీఆర్ఎస్, బీజేపీల పనైపోయింది
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు

రామగిరి (నల్లగొండ): తెలంగాణలో రాబోయే పదేళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తమ పార్టీలో గ్రూపుల్లేవనీ, ఏక్‌నాథ్ షిండేలూ లేరని వ్యాఖ్యానించారు. రంజాన్ పండుగ సందర్భంగా గురువారం నల్లగొండ పట్టణంలోని ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనల సందర్భంగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలసి మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. ఎవరెన్ని మాటలు చెప్పినా రేవంత్‌రెడ్డి ఇంకోసారి సీఎంగా కొనసాగుతారన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో 125 సీట్లను మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్, ఎంఐఎం మధ్య పొత్తు కుదిరింది



- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కొత్త నాటకానికి తెరతీశాయి
- ఈ రెండు పార్టీలు అధికారం.. ఓట్ల కోసం ఎంతకైనా దిగజారుతాయి
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య పొత్తు కుదిరిందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చెప్పారు. మొన్నటివరకు రాహుల్‌గాంధీని తిట్టిన ఒవైసీ బ్రదర్స్..ఇప్పుడు ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కొత్త నాటకానికి తెరతీశాయన్నారు. ఈ రెండూ మజ్లిస్‌కు కొమ్ము కాసేవేనని..ఈ పార్టీలు అధికారం, ఓట్ల కోసం ఎంతకైనా దిగజారుతాయని, దీనిని ప్రజలు గ్రహించాలని కోరారు. ఈ మూడింటి డీఎన్ఏ ఒకటేనని.. హిందూ వ్యతిరేకవైఖరే ఈ పార్టీల విధానమని ఆరోపించారు. బీజేపీని అడ్డుకునేందుకు మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

త్వరలో హరీశ్‌రావు జైలుకెళ్లడం ఖాయం

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



సిద్దిపేటజోన్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి త్వరలో జైలుకెళ్లడం ఖాయమని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోమటిచెరువు వద్ద మార్నింగ్ వాకింగ్ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోకాపేట భూముల విక్రయంలో భారీగా అక్రమాలు జరిగాయని, విచారణ చేపడితే నిజాలు నిగ్గుతేలుతాయని, ఈ క్రమంలో హరీశ్‌రావు, వెంకట్రామిరెడ్డి జైలుకెళ్లడం ఖాయమని రఘునందన్ అన్నారు. జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామిరెడ్డి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి అనుమతి లేకుండా ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం నిర్వహించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సమావేశంలో పాల్గొన్న 106 మంది ఉద్యోగులు సస్పెండయిన ఘటన తనకు బాధ కలిగిస్తోందన్నారు. ఉద్యోగుల మీద చర్యలు తీసుకున్న అధికారులు ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మీద ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని, ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ఎందుకు ప్రకటించడంలేదని ప్రశ్నించారు.

17 ఎంపీ సీట్లలో మహిళా శక్తి సమ్మేళనాలు

మహిళా మోర్చాకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూచన

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో మహిళా శక్తి సమ్మేళనాలను నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ సూచించారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన మహిళా ఓటర్లను ప్రత్యేకంగా కలిసి మోదీ ప్రభుత్వ పథకాలను తెలియజేసి వారికి బీజేపీపై విశ్వాసం కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి మండల, డివిజన్ల స్థాయిలలో మహిళా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, ఆశా వర్కర్స్, అంగన్వాడీ టీచర్లతో మహిళా సమ్మేళనాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ఆయా వర్గాల వారికి, మహిళా గ్రూపులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా మోర్చా పదాధికారులు, నాయకులు తమకు అప్పగించిన విధులు, బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలని తెలిపారు. గురువారం బీజేపీ కార్యాలయంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి అధ్యక్షతన జరిగిన మహిళా మోర్చా పదాధికారులు, పార్లమెంటరీ మహిళా కన్వీనర్లు, కో కన్వీనర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమా వేశంలో పార్టీ సీనియర్ నేత చింతల రామచంద్రారెడ్డి, మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూలుకు బీఆర్‌ఎస్ సమన్వయకర్తలు

ఏడు అసెంబ్లీ స్థానాలకు నియామకం



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, నాయకత్వం ఇచ్చే మార్గదర్శకాలను కేడర్‌కు చేరవేయడమే లక్ష్యంగా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా బీఆర్ ఎస్ పార్టీ సమన్వయకర్తలను నియ మిస్తోంది. ఇప్పటికే మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లకు సమన్వయకర్తలను నియమించారు. తాజాగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ గురువా రం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. వాల్యా నాయక్ (నాగర్‌కర్నూలు), ఇంతియాజ్ అహ్మద్ (గద్వా ల), దేవర మల్లప్ప (ఆలంపూర్), చాడ కిషన్‌రెడ్డి (కల్వకుర్తి), బైకాని శ్రీనివాస్ యాదవ్ (వనపర్తి), నవీన్‌కుమార్ రెడ్డి (అచ్చంపేట), డాక్టర్ ఆంజనేయగౌడ్ (కొల్లాపూర్) నియమించిన వారిలో ఉన్నారు.

యాసంగి.. దిగులుబడి

▶ మొదటి పేజీ తరువాయి

టన్నులుకాగా.. ఈసారి 1.06 కోట్ల టన్నులకు తగ్గుతుందని.. అంటే 14 లక్షల టన్నుల మేర తగ్గుదల ఉంటుందని అంచనా వేసింది. అలాగే మొక్కజొన్న గత యాసంగిలో 17.20 లక్షల టన్నుల దిగుబడి వస్తే.. ఈసారి 15.37 లక్షల టన్నులే వస్తుందని అంచనా. దీని దిగుబడి 1.83 లక్షల టన్నుల మేర తగ్గిపోనుంది. వేరుశనగ కూడా గత యాసంగిలోని 2.32 లక్షల టన్నుల కంటే 59వేల టన్నులు తగ్గి.. ఈసారి 1.73 లక్షల టన్నులకే పరిమితం కానుంది. ఇక గత యాసంగిలో మొత్తం నూనె గింజల ఉత్పత్తి 2.70 లక్షల టన్నులుకాగా.. ఇప్పుడు 61వేల టన్నులు తక్కువగా 2.09 లక్షల టన్నులకు పడిపోనుంది. మొత్తంగా యాసంగిలో కీలక పంటల దిగుబడులన్నీ తగ్గనున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

గత ఏడాది సాగు రికార్డులు..

2022-23 వానాకాలం, యాసంగి సీజన్ల పంటల సాగు విస్తీర్ణంలో తెలంగాణ చరిత్రలోనే ఆల్‌టైం రికార్డు నమోదైంది. ఆ రెండు సీజన్లలో కలిపి ఏకంగా 2.08 కోట్ల ఎకరాల్లో పంటల సాగు నమోదైంది. ఆ ఏడాది వానాకాలంలో 1.36 కోట్ల ఎకరాల్లో సాగుకాగా.. యాసంగిలో 72.59 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. రాష్ట్ర ఏర్పాటు నాటి సాగు విస్తీర్ణంతో పోలిస్తే.. అది రెండింతలకు దగ్గరగా రావడం గమనార్హం. 2014-15లో రాష్ట్రంలో రెండు సీజన్లు కలిపి 1.31 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవగా.. 2020-21 నాటికి 2.03 కోట్ల ఎకరాలకు, 2022-23 నాటికి 2.08 కోట్ల ఎకరాలకు చేరాయి. కానీ ఈసారి రెండు సీజన్లు కలిపి 1.93 కోట్ల ఎకరాలకే సాగు పరిమితమైంది. 2022-23 వరకు వరి సాగులో రికార్డుల మోత మోగింది. 2014-15లో రెండు సీజన్లకు కలిపి 35 లక్షల ఎకరాల్లోనే వరి సాగవగా.. 2022-23 నాటికి ఏకంగా 1.22 కోట్ల ఎకరాలకు పెరగడం విశేషం. అదే ఇప్పుడు 2023-24లో వరి సాగు 1.14 కోట్ల ఎకరాలకే పరిమితమైందని వ్యవసాయశాఖ నివేదిక స్పష్టం చేసింది.

సన్న బియ్యం ధరలు పెరిగే చాన్స్

మేలు రకం సన్న బియ్యానికి ఖరీఫ్ సీజన్‌లోనే క్వింటాల్ రూ.6,000 వరకు ధర పలికింది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో జైశ్రీరాం, హెచ్ఎంటీ, బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్, తెలంగాణ సోనా రకాలకు.. నాణ్యతను బట్టి రూ.6,500 నుంచి రూ.8,500 వరకు ధర పలుకుతోంది. యాసంగిలో తగ్గిన దిగుబడి, బియ్యం కొరత కారణంగా ఈసారి బియ్యం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. బియ్యం ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించినా.. మార్కెట్లో ధరలు తగ్గడం లేదని, ఇప్పుడు తగ్గిన దిగుబడితో మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నాయి.

సన్న బియ్యానికి డిమాండ్

యాసంగిలో ధాన్యం దిగుబడి తగ్గనున్న నేపథ్యంలో రోజువారీ ఆహారంగా తీసుకునే సన్న బియ్యానికి డిమాండ్ పెరగనుంది. దీన్ని గుర్తించిన మిల్లర్లు, వ్యాపారులు పొలాల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం సేకరణకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లోనే కొంత మేర ధాన్యం ఆ కేంద్రాలకు వస్తోంది. సన్నబియ్యం పండించే నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం లేదు.

పొలాల వద్దకే మిల్లర్లు, వ్యాపారులు

రాష్ట్రవ్యాప్తంగా కోటి టన్నుల మేర ధాన్యం దిగుబడి వస్తే.. అందులో 7 లక్షల నుంచి 10 లక్షల టన్నుల మేర సన్నధాన్యం ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా. దీంతో సన్నరకాలను మిల్లర్లు, వ్యాపారులు రైతుల కల్లాల నుంచే కొనుగోలు చేసుకొని పోతున్నారు. రాష్ట్ర మిల్లర్లు, వ్యాపారులతో పాటు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఏపీలకు చెందిన వ్యాపారులు వచ్చి క్వింటాలుకు రూ.2,300 నుంచి రూ.3,000 వరకు చెల్లించి పచ్చి ధాన్యాన్ని కొంటున్నారు. కాస్త మెరుగైన ధరే కావడంతో.. రైతులు కూడా విక్రయిస్తున్నారు.

నిజామాబాద్ జిల్లాలో గంగ, కావేరి సన్న రకాలను 2.30 లక్షల ఎకరాల్లో, కామారెడ్డి జిల్లాలో 63 వేల ఎకరాల్లో సాగు చేశారు. మహబూబ్‌నగర్‌లో కృష్ణా తీరం వెంట సన్నాలను పండించారు. ఇక్కడి రైతులు పండించిన సన్న ధాన్యాన్ని మిల్లర్లే కొనేస్తుండటంతో కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. దొడ్డు రకాల ధాన్యమే కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. ఈ సీజన్‌లో 70 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకున్నా.. దిగుబడి తగ్గడంతో 50 లక్షల టన్నులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని వ్యవసాయ వర్గాలు చెప్తున్నాయి.

పొట్టదశలో ఎండిన వరి

మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో రైతు బంటు లక్ష్మయ్యకు చెందిన పొలంలో ఎండిపోయిన వరి ఇది. లక్ష్మయ్య తనకున్న మూడెకరాల భూమిలో వరి వేశాడు. బోరు వట్టిపోయి నీరు లేక వరి పంట మొత్తం ఎండిపోయింది.



తొమ్మిదెకరాల్లో.. ఒక్క ఎకరమూ మిగల్లేదు..



పెద్దవూర: నల్లగొండ జిల్లా జయరాంతండాలో ఎండిపోయిన వరి పొలం ఇది. ఈ తండాకు చెందిన రైతు రమావత్ కీమా తనకున్న ఆరెకరాలతో పాటు మరో మూడెకరాలను కౌలుకు తీసుకుని యాసంగిలో వరి సాగుచేశాడు. మూడు బోర్లు ఉన్నా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. మరో బోర్ వేయించినా లాభం లేకపోయింది. మొత్తం తొమ్మిదెకరాల్లో వరి ఎండిపోయింది. దీంతో ఆ వరి కోయించి మోపులు కట్టి పశువులకు గ్రాసంగా వేస్తున్నాడు.

రేవంత్‌ది ఒకే మాట.. నా వంతు ఎంత అనే!



సీఎంను కలిసి ఏ పని అడిగినా అదే ప్రశ్న

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆరోపణ
- ఓ డీల్‌లో రూ.300 కోట్లు తీసుకుని ఢిల్లీకి పంపించిన మాట వాస్తవమా కాదా?
- గత ప్రభుత్వ లొసుగులు తెలుసుకుని సెటిల్మెంట్లు చేస్తున్నారు

సాక్షి, హైదరాబాద్: అవినీతికి పాల్పడ్డ వారిని కటకటాల వెనక్కి పంపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవానికి ఎవరైనా రేవంతూ అని మాట్లాడిస్తే తన వంతు ఎంత అని అడుగుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎంను కలిసేందుకు వెళ్లిన వాళ్లు కూడా రేవంత్‌ని నీ రేటెంతరెడ్డి అని అడుగుతున్నారంట అని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆధారాలు ముందు పెట్టుకొని సెటిల్మెంట్లు చేస్తున్నారంటూ ఆరోపణలు గుప్పించారు. గురువారం పార్టీ కార్యాలయంలో మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న లోలోపల సెటిల్మెంట్లు ఇప్పుడు బయటకు వస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన దాని కంటే కూడా కాంగ్రెస్ హయాంలోనే అవినీతి, అరాచకాలు ఎక్కువ జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ అవినీతి అక్రమాలపై నాలుగు నెలలు దాటినా ఒక్కదాని మీద ఎంక్వైరీ పూర్తి అవ్వలేదన్నారు. గతంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికితీసి సెటిల్మెంట్‌లు చేస్తున్నారని, ఆ క్రమంలోనే కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పజెప్పడం లేదని నిందించారు.

రాహుల్ ట్యాక్స్ వసూలు ఎలాగంటే..

రాహుల్‌గాంధీ ట్యాక్స్ వసూలుకు సంబంధించి అనుసరిస్తున్న ఒక విధానాన్ని తాను బయట పెడుతున్నానని మహేశ్వర్‌రెడ్డి వివరించారు. "గత ప్రభుత్వం ఓ సంస్థకు నగరం నడిబొడ్డున రూ.1,500 కోట్ల విలువైన 15 ఎకరాల భూమిని 30 ఏళ్ల లీజుకు (నెలకు ఎకరానికి రూ.2లక్షల లీజ్‌కు) ఇస్తే దానిని కాంగ్రెస్ సర్కార్ వచ్చాక రద్దు చేసి అది ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టింది. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ మరో జీవో ద్వారా అదే భూమిని అదే సంస్థకు రేవంత్‌రెడ్డి కేటాయించారు." అని ఆరోపించారు ఇందులో భాగంగా రూ.300 కోట్లు తీసుకుని ఢిల్లీకి పంపించిన మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే వీటికి సంబంధించిన అంశాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ భూమికి సంబంధించే ఇంత కుంభకోణం చేస్తే.. కాళేశ్వరం, ధరణిల్లో ఇంకా ఎంత కుంభకోణం చేస్తారోనని అనుమానం వ్యక్తం చేశారు.

మరో రెండు రోజుల్లో ఇంకో అవినీతి బయటపెడతా

మరో రెండు రోజుల్లో మరో అవినీతి అంశంపై ఆధారాలతో సహా మీడియా ముందుకి వస్తానని మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. మహేశ్వర్ రెడ్డికి ఆధారాలు ఎక్కడి నుంచి వస్తున్నాయన్న భయంతో సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయం ఆరో ఫ్లోర్‌లోకి ఎవరినీ రానివ్వకుండా సెక్యూరిటీ పెంచారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా సెక్రటేరియట్ సెకండ్ ఫ్లోర్ సెక్యూరిటీ పెంచి ఎవరినీ అనుమతించడం లేదన్న సమాచారం తనకు అందిందన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇంటికి రేవంత్ వెళ్లడంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి భయం పట్టుకుందన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు రైతు వ్యతిరేక పార్టీలు

మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: 'కాంగ్రెస్, బీజేపీలు రైతు వ్యతిరేక పార్టీలు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసింది. బీజేపీ నల్ల చట్టాలను తీసుకువచ్చింది'అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ కేసీఆర్ రైతు నేస్తం అని, ఆయన చెప్పినవి, చెప్పనవి కూడా చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ చెప్పినవే చేయడం లేదని, అందుకే ఆ పార్టీపై చీటింగ్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్ద కోడూరులో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయిందని, ఆ పార్టీని నమ్మి మోసపోయామని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. రూ.90 వేలకోట్ల ఖర్చుతో కేసీఆర్ విద్యుత్ వ్యవస్థను బాగు చేశారన్నారు. కేసీఆర్ పాలనలో పదేళ్లు కరువే లేదన్నారు. కాంగ్రెస్ అడుగుపెట్టింది.. మళ్లీ కరువొచ్చిందన్నారు. మళ్లీ బోర్లలో పూడిక తీసుడు.. కరెంటు మోటార్లు కాలుడు మొదలైందని విమర్శించారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వాళ్లకు చురక పెడితేనే దారికొస్తారన్నారు. సమావేశం అనంతరం కార్యకర్తలకు హరీశ్‌రావు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.



పెద్దకోడూరులో కార్యకర్తలకు భోజనం వడ్డిస్తున్న హరీశ్‌రావు

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

సదర్మాట్ నీటిని విడుదల చేయాలని ఆందోళన

కడెం(ఖానాపూర్): రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు నీరందించాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు ఆందోళన చేపట్టారు. నిర్మల్ జిల్లాలోని సదర్మాట్ కాలువకు నీటిని విడుదల చేయాలని కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు నచ్చన్‌ఎల్లాపూర్ వద్ద నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై గురువారం బైఠాయించారు. వారం రోజులుగా సదర్మాట్ కాలువకు నీటిని విడుదల చేయకపోవడంతో కడెం మండలంలోని లింగాపూర్, మాసాయిపేట్, నచ్చన్‌ఎల్లాపూర్, పెద్దూర్‌తండా, చిట్యాల్, ధర్మాజీపేట్, తదితర గ్రామాల్లోని సుమారు 13 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

రైతులు ఆందోళన చెందవద్దు: ఎమ్మెల్యే వెడ్మ

సదర్మాట్ రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, కాలువ నీళ్లు వస్తాయని రైతులు ఆందోళన చెందవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హామీ ఇచ్చారు. సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు నీటిని విడుదల చేయాలని ఈఎన్‌సీ నుంచి ఎస్ఈకి గురువారమే ఆదేశాలు వచ్చాయని ఆయన వెల్లడించారు.



నచ్చన్‌ఎల్లాపూర్ వద్ద రహదారిపై బైఠాయించిన రైతులు

అంజన్న సాక్షిగా అబద్ధాలు చెబుతారా?

- ఆరు గ్యారంటీలు ఎంతమందికి ఇచ్చారో చెప్పే దమ్ముందా?
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్
- ఈనెల 21న ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్ టౌన్: ఆరు గ్యారంటీలను అమలు చేశామని అంటున్న కాంగ్రెస్ నేతలు కొండగట్టు అంజన్న సాక్షిగా వచ్చి అబద్ధాలు ఆడారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కొండగట్టు అంజన్న చాలా పవర్ ఫుల్ అని, ఆయన సన్నిధిలో అబద్ధాలాడిన, దొంగ హామీలిచ్చిన కేసీఆర్, ఆయన కుమార్తె కవితకు ఏ గతి పట్టిందో కాంగ్రెస్ నేతలకూ అదే గతి పడుతుందని హెచ్చరించారు. 'ఆరు గ్యారంటీలను అమలు చేశామంటున్న ఆ కాంగ్రెస్ నేతను అడుగుతున్నా.. మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఎంతమందికి ఇచ్చారు..? రైతులు, కౌలు రైతులకు రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఎంతమందికి అందించారు..? ధాన్యం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చారా..? తరుగు లేకుండా ధాన్యాన్ని సర్కారే కొనుగోలు చేస్తామన్నారు.. చేశారా..? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో గురువారం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ మండలాల అధ్యక్షులు, ఇన్‌చార్జిలతో బండి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుమ్మక్కై కనయ్.. రెండుపార్టీలు కలిసి నన్ను ఓడించడానికి కుట్ర చేస్తున్నాయి.'' అని ఆరోపించారు. ప్రజలకు కాంగ్రెస్ మంచి చేస్తే పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. ఈ నెల 21న వేలాదిమందితో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు బండి ప్రకటించారు.

రైతులను మోసం చేస్తే సహించేది లేదు

ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది.. 'ఎక్స్'లో సీఎం రేవంత్

- అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తే ఊరుకోబోమని హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్/ జనగామ: రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఎవరు మోసం చేసేందుకు ప్రయత్నించినా చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లలో విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. జనగామ మార్కెట్ యార్డులో రైతుల ఆందోళన అంశంపై సీఎం 'ఎక్స్' వేదికగా స్పందించారు. వ్యవసాయ మార్కెట్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ''రైతుల కష్టాన్ని ఎవరైనా మార్కెట్ కమిటీ అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై తక్కువ చేసే ప్రయత్నం చేస్తే సహించేది లేదు. జనగామ వ్యవసాయ మార్కెట్లో జరిగిన ఘటనపై సకాలంలో స్పందించి రైతులను మోసం చేయడానికి ప్రయత్నించిన నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించాం. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించిన అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు నా అభినందనలు. అధికారులందరూ ధాన్యం కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను'' అని పేర్కొన్నారు.

ముగ్గురు ట్రేడర్లపై కేసులు

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్ అయి ధాన్యానికి తక్కువ ధర చెల్లిస్తున్నారంటూ రైతులు బుధవారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్.. మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌ను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరణ తీసుకున్నాక కార్యదర్శిపై చర్యలు చేపడతామన్నారు. మరోవైపు జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ నరేంద్ర ఫిర్యాదు మేరకు ముగ్గురు ట్రేడర్లపై కేసు నమోదు చేసినట్టు సీఐ రఘు పతిరెడ్డి తెలిపారు. ప్రైవేటు మార్కెట్‌లో ధాన్యానికి రూ.1,800కన్నా ఎక్కువ ధర ఇవ్వాలని అధికారులు ఆదేశించినా.. వ్యాపారులు కేవలం రూ.30 పెంచి కొనుగోలు చేస్తున్నట్టు రైతులు ఆరోపించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం వ్యవసాయ మార్కెట్‌లో పర్యటించారు. ధాన్యం ధర తగ్గించి కొనుగోలు చేస్తే ఊరుకునేది లేదన్నారు.

అన్ని వ్యవస్థలు రేవంత్ గుప్పిట్లోనే

స్పీకర్ ఆఫీసును సీఎం ప్రభావితం చేస్తున్నారు : బీఆర్‌ఎస్ నేతల ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న వివేకానంద. చిత్రంలో కౌశిక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన గుప్పిట్లో పెట్టుకున్నారని బీఆర్‌ఎస్ విమర్శించింది. ప్రజాస్వామిక తెలంగాణ పేరిట అధికారంలోకి వచ్చిన రేవంత్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు కేపీ.వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, కోవాలక్ష్మి, నేతలు జీవన్‌రెడ్డి, పి.శశిధర్‌రెడ్డి గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు.

- ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించడంలో స్పీకర్ చేస్తున్న జాప్యంపై తాము హైకోర్టులో వేసిన పిటిషన్ సోమవారం విచారణకు వస్తుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వెల్లడించారు. పార్టీ మారిన ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ ఇచ్చేందుకు వెళితే అసెంబ్లీ కార్యదర్శి బాత్‌రూంలో దాక్కున్నారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల ఇళ్ల ముందు చావు డప్పు కొడతామని, ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట ఉపఎన్నికలు వస్తాయని వెల్లడించారు.
- బీఆర్‌ఎస్ తరపున ఎన్నికై పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని తాము కోరుతున్నా స్పీకర్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రభావితం చేస్తున్నారని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద విమర్శించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన స్పీకర్ తాము అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వడం లేదన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని కోరుతూ పిటిషన్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నా అందుబాటులోకి రావడం లేదని చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ తమకు సమయం ఇవ్వక పోవడంతో రిజిస్టర్ పోస్టులో పిటిషన్లు పంపినట్టు వెల్లడించారు. 'హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నా అక్కడ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ వెంటనే అనర్హత వేటు వేశారు. దీనిని తెలంగాణ స్పీకర్ కూడా ఆదర్శంగా తీసుకోవాలి. పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని చెప్పిన రేవంత్ ఎవరిని కొట్టాలో చెప్పాలి. అభద్రతాభావంతో ఉన్న రేవంత్ కొడంగల్ ఓటర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు' అని ఎమ్మెల్యే వివేకానంద ఆగ్రహం వ్యక్తం చేశారు.
- 26 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని మంత్రి ఉత్తమ్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే కోవా లక్ష్మి ఆరోపించారు. ప్రజాపాలన చేతకాని కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందన్నారు.

బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి

▶ మొదటి పేజీ తరువాయి

బీసీలకు మండలానికో అంతర్జాతీయ స్థాయి గురుకులాల ఏర్పాటు వంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మరో మూడేళ్లలో జరగనున్న పూలే ద్విశతాబ్ది ఉత్సవాల నాటికి హైదరాబాద్‌లో ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ మేరకు అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని, బీసీలకు ఇచ్చిన హామీలను నోటి మాటలకు పరిమితం చేయకుండా కాంగ్రెస్ ఆచరించి చూపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మాటల్లో కాదు.. చేతల్లో చూపించాం

బీసీల అభివృద్ధి, సంక్షేమంతోపాటు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వారికి రాజకీయ అవకాశాల కోసం బీఆర్‌ఎస్ మాత్రమే పాటుపడుతోందని కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలకు ఎక్కువ స్థానాలు ఇవ్వడంతోపాటు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీలకు సగం సీట్లు కేటాయించామని చెప్పారు. 75 ఏళ్ల దేశ చరిత్రలో బీసీల అభ్యున్నతిని మాటల్లో కాకుండా చేతల్లో ఆచరించి చూపామని.. పూలే ఆలోచనా విధానంలో భాగంగా వెయ్యికిపైగా గురుకులాలను ఏర్పాటు చేశామని వివరించారు. నేత, యాదవ, ముదిరాజ్, గౌడ సామాజికవర్గాల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టామని... అత్యంత వెనుకబడిన తరగతుల అభ్యున్నతి లక్ష్యంగా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. బీసీలను స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్న కాంగ్రెస్‌పై బడుగు, బలహీనవర్గాలు ఆగ్రహంతో ఉన్నాయని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. గత పదేళ్లలో సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు కేసీఆర్ అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేశారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య చెప్పారు.

రేవంత్ నాయకత్వంలో ఒక్కటిగా ఉన్నాం

▶ మొదటి పేజీ తరువాయి

గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో ఐదు గ్రూపులు ఉన్నాయంటూ హరీశ్‌రావు, మహేశ్వర్‌రెడ్డి విజ్ఞత లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సీనియర్ నాయకుల సలహాలతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక్కటిగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాను చనిపోయే వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని స్పష్టం చేశారు.

ఇంకోసారి అలా మాట్లాడొద్దు

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విషయాల గురించి కానీ, గ్రూపులు ఉన్నాయని కానీ ఇంకోసారి మాట్లాడొద్దని హరీశ్‌రావు, మహేశ్వర్ రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి హెచ్చరించారు. అలానే అకారణ విషయాల్లో తన పేరు ప్రస్తావించొద్దని సూచించారు. ప్రభుత్వాన్ని పడగొడతామని చెబుతున్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు అయినా గెలవాలని సవాల్ విసిరారు.

షిండేల సృష్టి బీజేపీ పనే

కాంగ్రెస్‌లో ఏక్‌నాథ్ షిండేలు ఉన్నారని మహేశ్వర్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందనీ... మహారాష్ట్రలో అధికారం కోసం ఏక్‌నాథ్ షిండేలను సృష్టించిన ఘనత బీజేపీదేనని ఆయన నిందించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను దించి కిషన్‌రెడ్డిని ఎందుకు మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో కులమతాల మధ్య ఘర్షణలు పెట్టి 370 నుంచి 400 ఎంపీ సీట్లు గెలవాలని బీజేపీ కలలు కంటోందని ఆయన ఎద్దేవా చేశారు. నల్లగొండ ఎంపీగా కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



నల్లగొండలోని ఈద్గా వద్ద ముస్లిం మతపెద్దతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి తదితరులు

14న హైదరాబాద్‌లో 'మేమంతా సిద్ధం' ఆత్మీయ సమ్మేళనం

వైఎస్సార్‌సీపీ అభిమానులు, పార్టీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు.. పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌సీపీ అభిమానులు, పార్టీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన హైదరాబాద్‌లో 'మేమంతా సిద్ధం'పేరిట ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొండా జయవర్ధనరెడ్డి, డీవీపీ సత్యనారాయణరెడ్డి, వి.సాంబశివరెడ్డి తదితరులు తెలిపారు. కూకట్‌పల్లి మెట్రోస్టేషన్ సమీపంలోని పిల్లర్ నంబర్ ఏ847 దగ్గర ఉన్న ఎస్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో 14వ తేదీ ఉదయం 10 గంటలకు ఈ సమ్మేళనం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొననున్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఎం. గురుమూర్తి, అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ వై.శివరామిరెడ్డి, తమతం కల్పలత, మేరిగ మురళీధర్, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కాకాని గోవర్ధన్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, అనంతవెంకట రామిరెడ్డి, మేరుగ నాగార్జున తదితరులు హాజరుకానున్నారు. ఈ మేరకు గురువారం 'మేమంతా సిద్ధం' వైఎస్సార్‌సీపీ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వై. ఈశ్వరప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అభిమానులు, పార్టీ ఐటీ విభాగం ప్రతినిధులు కె.విజయ భాస్కర్‌రెడ్డి, ఎస్వీ సుబ్రమణ్యంరెడ్డి, ఎల్.రఘురామిరెడ్డి, భాన రాఘవ రెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కె.రాజశేఖరరెడ్డి, మల్లు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా వలంటీర్లపై జనసేన గూండాగిరి

- కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి దాష్టీకం
- బర్త్‌డే వేడుకలు చేసుకుంటున్న మహిళా వలంటీర్లపై దౌర్జన్యం
- కుర్చీలు విరగ్గొట్టి భయభ్రాంతులకు గురి చేసిన వైనం
- బయట నుంచి తలుపుల గొళ్లేలు పెట్టిన జనసేన నేతలు



ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జిపై దౌర్జన్యం చేస్తున్న జనసేన అభ్యర్థి నానాజీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ రాజకీయ నాయకులందరినీ గుండాలు, రౌడీలంటూ నోరు పారేసుకుంటుంటారు. కానీ, ఆయన పార్టీ అభ్యర్థులు, నాయకులు మహిళా వలంటీర్ల పైన కూడా దౌర్జన్యానికి దిగి, గృహ నిర్బంధానికి పాల్పడ్డారు. కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ సహా ఆ పార్టీ నాయకులు గురువారం సాగించిన గూండాగిరీతో మహిళా వలంటీర్లు బెంబేలెత్తిపోయారు. ఓ మహిళా వలంటీరు పుట్టిన రోజు వేడుకలు చేసుకుటుండగా ఆ భవనంలోకి చొరబడటమే కాకుండా, ఆమెతో పాటు వేడుకలకు వచ్చిన మిగతా మహిళా వలంటీర్లపై దౌర్జన్యం చేసి, కుర్చీలు విరగ్గొట్టి, వారిని గృహ నిర్బంధం చేసి భయభ్రాంతులకు గురి చేశారు. భయంతో మహిళలు కేకలు వేసినా, గర్భిణి ఉందని మొత్తుకున్నా ఖాతరు చేయలేదు. గంటన్నర పాటు మహిళలు ప్రాణాలు అరచేత పట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. ప్రాణ భయంతో పోలీసులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి ఆ మహిళలను విడిపించారు.

స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మహిళా వలంటీరు మొయ్యా దుర్గా భవాని కాకినాడ రూరల్ నియోజకవర్గం వినాయక కేఫ్ సమీపంలోని ఓ భవనంలో గురువారం ముందస్తు పుట్టినరోజు వేడుకలు చేసుకున్నారు. ఈ వేడుకలకు ఆమె స్నేహితురాళ్లైన పలువురు మహిళా వలంటీర్లు హాజరయ్యారు. పుట్టిన రోజు కేకు, కూల్ డ్రింక్‌లు సిద్ధం చేసుకున్నారు. ఇంతలోనే హఠాత్తుగా 30 మందిని వెంట బెట్టుకుని కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అక్కడకు వచ్చారు. ఇక్కడ పార్టీ సమావేశం పెట్టుకుంటున్నారంటూ పెద్దగా కేకలు వేస్తూ వారిపై విరుచుకుపడ్డారు. పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటున్నామని చెబుతున్నా వినకుండా తలుపులు తన్నుకుంటూ లోపలకు వెళ్లి వీరంగం సృష్టించారు. దీంతో మహిళా వలంటీర్లు భయాందోళనలకు గురయ్యారు. తమతో పాటు గర్భిణి ఉన్నారని, ఆమె భయపడిపోతున్నారని, కేకలు వేయవద్దని బతిమిలాడారు. అయినా వారు వినలేదు. నానా రచ్చ చేసి, వలంటీర్లు కూర్చున్న కుర్చీలను ధ్వంసం చేశారు. మహిళా వలంటీర్లు లోపల ఉండగానే నానాజీ కనుసైగలతో ఆ పార్టీ కార్యకర్తలు గది తలుపులు మూసేసి గొళ్లేలు పెట్టేసి, భవనం కింది భాగంలోకి వెళ్లిపోయారు. మహిళా వలంటీర్లు కిటికీల వద్దకు వచ్చి తలుపులు తీయాలని, ఊపిరి ఆడటంలేదని ఎంతసేపు అర్థించినా వినిపించుకోలేదు. జనసేన నాయకుల విధ్వంసంతో గర్భిణినున్న చిట్టమ్మ గదిలోనే సొమ్మసిల్లి పడిపోవడంతో అంతా భయకంపితులయ్యారు. వారిలో ఒక వలంటీరు తన మొబైల్ ఫోను ద్వారా కాకినాడ డీఎస్పీ హనుమంతరావుకు సమాచారం అందించింది. దీంతో సర్పవరం సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ అక్కడకు చేరుకున్నాయి. పోలీసులు తలుపులు తెరిచి మహిళా వలంటీర్లను విడిపించారు. అక్కడ రాజకీయ పార్టీ సమావేశం జరుగుతోందంటూ పంతం నానాజీ పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆ కార్యాలయంలో రాజకీయ పార్టీకి సంబంధించి ఎటువంటి ఆధారాలూ లేవని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి బీబీబీ రాజు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని వీడియో తీశామని, అన్ని వివరాలు రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్‌కు నివేదిస్తామని రాజు తెలిపారు.

భయంతో వణికిపోయాం



ఒకేసారి మూకుమ్మడిగా వచ్చి పడి దౌర్జన్యానికి పాల్పడ్డారు. నాకు ఏడో నెల. గర్భిణి అని కూడా కనీసం జాలి, కరుణ కూడా లేకుండా గదిలో నిర్బంధించి తీవ్ర భయభ్రాంతులకు గురి చేశారు. ఏం జరుగుతుందోనని భయంతో వణికిపోయాం. తీవ్ర ఆందోళనతో సొమ్మసిల్లి పడిపోయాను. – నున్న చిట్టమ్మ, రమణయ్యపేట, కాకినాడ రూరల్

ప్రభం'జనం'.. మేమంతా సిద్ధం

నిబద్ధత, నిజాయితీతో పని చేసిన ఏపీ సీఎం వైఎస్ జగన్‌కు జన నీరాజనం

వలంటీర్లపై చంద్రబాబుది కపట ప్రేమే

- నిన్నటి వరకు వలంటీర్లను తూలనాడింది చంద్రబాబే
- తిరిగి జన్మభూమి కమిటీలను తేవాలన్నదే ఆయన ధ్యేయం
- ఆ కమిటీల్లో సభ్యులనే వలంటీర్లను చేయాలనుకుంటున్నారు.. ఇది జరగని పని
- మార్గదర్శిపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం
- బాబును గద్దెనెక్కించేందుకు రామోజీ దిగజారిపోయారు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపిక శాస్త్రీయంగా జరిగింది.. మార్పులు ఉండవు: సజ్జల

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఓ విధానమూ లేదు... నినాదమూ లేదు

ఆరోపణలే అజెండా!

2014-19 మధ్య తాను చేసిందేమీ లేక... చంద్రబాబు దుష్ప్రచారం

విధ్వంస పాలన, రాష్ట్రాన్ని నాశనం చేశారు... అంటూ రోజా అరుపులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు చేసిన మంచి ఒక్కటీ లేకపోవడంతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నేతలకు ప్రజల్లోకి వెళ్లేందుకు మొహం చెల్లడంలేదు. నాడు కూడా కూటమికి నేతృత్వం వహించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 650కిపైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక కనీసం పది శాతం హామీలను కూడా అమలు చేయకుండా దారుణంగా వంచించడంతో ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ ఎన్ని వాగ్దానాలు గుప్పించినా ప్రజలు నమ్మని పరిస్థితి నెలకొంది. దీంతో అజెండా లేని కూటమి నేతలు పచ్చి అబద్ధాలు వల్లిస్తూ సీఎం వైఎస్ జగన్‌పై బురద చల్లడమే ఏకైక లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో హామీల్లో 99 శాతం అమలు చేయడంతోపాటు కూటమి దోపిడీతో 2019 మే 29 నాటికి వెంటిలేటర్‌పైకి చేరిన రాష్ట్రాన్ని సుపరిపాలనతో శరవేగంగా పునర్నిర్మిస్తున్న సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత రోజురోజుకూ పెరుగుతోంది. నిన్న వరుసగా సిద్ధం సభలు, నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్రతో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని పసిగట్టిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి ఉనికి చాటుకోవడం, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న టీడీపీ మనుగడ కోసమే బురద జల్లుతున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను వికేంద్రీకరించిన సీఎం జగన్ ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దకే అందించే నూతన ఒరవడికి దేశంలో తొలిసారిగా నాంది పలికారు. ప్రజాభిమానం పొందిన వలంటీర్లపై మొన్నటి వరకు తూలనాడిన చంద్రబాబు ఇప్పుడు తనకు మాత్రమే సాధ్యమైన 'యూ' టర్న్ తీసుకుని ఆ వ్యవస్థను కొనసాగిస్తామని ప్రకటించడం ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వానికి కితాబిచ్చారు. అదే సమయంలో జన్మభూమి కమిటీల పేరెత్తేందుకు కూడా చంద్రబాబు సాహసించలేకపోతున్నారు. ఆ మాటెత్తితే ప్రజలు ఈడ్చి కొడతారేమోననే భయమే అందుకు కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

నాడు మోసమే ఒరవడిగా..

విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జట్టు కట్టిన చంద్రబాబు 650కిపైగా హామీలిచ్చి కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చారు. బాబు నేతృత్వంలో 2014 జూన్ 8న కొలువుదీరిన కూటమి ప్రభుత్వం మోసమే ఒరవడిగా పాలన సాగించింది. చంద్రబాబు, మోదీ, పవన్ కళ్యాణ్ ఫోటోలతో, చంద్రబాబు సంతకం చేసి మరీ ఇంటింటికీ లేఖలు పంపి ఇచ్చిన ప్రధాన హామీల్లో రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేయకుండా వంచించారు. రూ.14,205 కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేయకుండా అక్కచెల్లెమ్మలకు బాబు దగా చేశారు. ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతిగా నెలకు రూ.2 వేలు చొప్పున ఇస్తామని నమ్మబలికి యువతను మోసగించారు. బీసీ సబ్ ప్లాన్ కింద ఏడాదికి రూ.పది వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు వ్యయం చేస్తామంటూ బలహీన వర్గాలకు వెన్నుపోటు పొడిచారు. అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం, పక్కా ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఏ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వకుండా వంచించారు. పవర్ లూమ్స్, చేనేత రుణాలు మాఫీ చేయకుండా మోసం చేశారు.

అడుగడుగునా అక్రమాలే..

సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని దేవతల రాజధానిని తలదన్నే రీతిలో అమరావతిని నిర్మిస్తానంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఓత్ ఆఫ్ సీక్రసీకి తిలోదకాలు ఇచ్చి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారు. కారు చౌకగా రైతుల భూములు కాజేసి రూ.లక్షల కోట్లు కొట్టేశారు. తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణంలో అవినీతికి పాల్పడటంతోపాటు స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును సింగపూర్ ప్రైవేట్ కంపెనీల కన్సార్షియంకు కట్టబెట్టి మరో రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారు. అక్రమార్జనతో అమరావతిలో విధ్వంసం సృష్టించారు. ఉచిత ఇసుక పేరుతో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి లాంటి నదులు, వాగులు, వంకలను అడ్డగోలుగా తవ్వేసి భారీ ధరలకు విక్రయించి రూ.వేల కోట్లు కొల్లగొట్టారు. కేవలం రూ.17,368 కోట్లతో పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మినహా జలయజ్ఞం ప్రాజెక్టులను పూర్తి చేస్తానని బీరాలు పలికి రూ.68 వేల కోట్లు తగలేసినా ఒక్కటీ పూర్తి చేయలేకపోయారు. కేంద్రమే నిర్మించాల్సిన పోలవరాన్ని కమీషన్ల దాహంతో దక్కించుకున్న చంద్రబాబు నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారు. కాఫర్ డ్యామ్ ఖాళీల గుండా గోదావరి అధిక ఉధ్ధృతితో ప్రవహించడంతో డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైంది. కమీషన్ల కక్కుర్తితో పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అప్పట్లో చేసిన వ్యాఖ్యలే టీడీపీ కూటమి అరాచక పాలనకు నిదర్శనం.

ఖజానాను ఊడ్చేసి..

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దోపిడీ, ఎడాపెడా అప్పులతో 2019 మే 29 నాటికి రాష్ట్రాన్ని దివాలా తీయించింది. అప్పటికి ప్రభుత్వ ఖజానాలో కేవలం రూ. వంద కోట్లే మిగిలాయని నాటి ఆర్థిక మంత్రి యనమల స్వయంగా ప్రకటించడమే అందుకు నిదర్శనం. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా మళ్లీ అధికారంలోకి రావాలనే ఎత్తుగడలో భాగంగా బీజేపీ, జనసేనతో విడిపోయిన చంద్రబాబు 2019 ఎన్నికల్లో మూడు పార్టీలు వేర్వేరుగా పోటీ చేసేలా పథకం వేశారు. అయితే కూటమి అరాచకాలకు తగిన శాస్తి చేస్తూ 2019 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి చారిత్రక విజయాన్ని కట్టబెట్టారు.

రాష్ట్రానికి జవసత్వాలు..

కూటమి ప్రభుత్వం వెంటిలేటర్‌పైకి చేర్చిన రాష్ట్రానికి గత 58 నెలలుగా సుపరిపాలనతో సీఎం వైఎస్ జగన్ జవజీవాలు కల్పించి శరవేగంగా పునర్నిర్మిస్తున్నారు. కూటమి సర్కార్ హయాంలో 2014–19 మధ్య అప్పులు 169 శాతం పెరిగితే 2019–24 మధ్య అప్పులు 58 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం. ఎన్నికల్లో హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం జగన్ దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో 87 శాతం కుటుంబాల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు నేరుగా జమ చేశారు. 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇంటి స్థలాలు లాంటి నాన్ డీబీటీల రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో పేదరికం క్రమేణా తగ్గుతోంది. రాష్ట్రంలో పేదరికం 2015–16 నాటికి 11.77 శాతం ఉండగా 2022–23 నాటికి 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం. టీడీపీ హయాంలో ఐదేళ్లలో కేవలం 32 వేల ఉద్యోగాలను మాత్రమే ఇవ్వగా సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక కొత్తగా 2.31 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించి యువతకు బాసటగా నిలవడం గమనార్హం.

ఒంటరిగా ఎదుర్కోలేకనే మళ్లీ..

సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం బలంగా నాటుకుపోయింది. 2019 తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ ఇదే విషయం వెల్లడైంది. వరుస ఓటములతో వెంటిలేటర్‌పైకి చేరి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న టీడీపీ మనుగడ కోసం చంద్రబాబు మరోసారి జనసేన, బీజేపీతో జట్టు కట్టారు. 2014లో అధికారంలోకి వచ్చి మోసం చేసిన కూటమే మళ్లీ ఇప్పుడు తెరపైకి రావడంతో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టీడీపీ–జనసేన ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సభతోపాటు మూడు పార్టీలు ఉమ్మడిగా ఏకంగా ప్రధాని మోదీని తీసుకొచ్చి చిలకలూరిపేటలో నిర్వహించిన సభకు సైతం ప్రజలు మొహం చాటేశారు. అవకాశవాద పొత్తులను తిప్పికొట్టారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి కలిసి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల స్పందన కరువైంది. మరోవైపు సీఎం వైఎస్ జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు ప్రతిచోటా బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో ఘోర పరాజయం తప్పదని నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయిన కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పచ్చి అబద్ధాలు వల్లెవేస్తూ సీఎం జగన్‌పై బురద చల్లుతున్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా..

కమీషన్ల దాహంతో చంద్రబాబు విధ్వంసం సృష్టించిన పోలవరం ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ గాడిలో పెట్టి ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నారు. స్పిల్ వే, స్పిల్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11 నాటికే గోదావరి వరదను స్పిల్ వే మీదుగా మళ్లించారు. కుడి, ఎడమ కాలువ అనుసంధానాలను పూర్తి చేశారు. డయాఫ్రమ్ వాల్‌పై కేంద్రం నిర్ణయాన్ని వెల్లడించడమే తరువాయి శరవేగంగా ప్రధాన డ్యామ్‌ను పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా అడుగులు వేస్తున్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను కొనసాగించి సంగం, నెల్లూరు బ్యారేజీలు, లక్కవరం ఎత్తిపోతల, అవుకు టన్నెల్, వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ, కుప్పం బ్రాంచ్ కెనాల్‌లను పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. పారదర్శకమైన పారిశ్రామిక విధానంతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీని దేశంలో ఏటా అగ్రస్థానంలో నిలిపారు. నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, పది ఇండస్ట్రియల్ నోడ్స్‌తో పారిశ్రామికాభివృద్ధిని పరుగులెత్తిస్తున్నారు. పారిశ్రామిక వృద్ధి రేటులో దేశంలో రాష్ట్రం 2018–19 నాటికి 3.2 శాతంతో 22వ స్థానంలో ఉండగా 2021–22 నాటికి 12.8 శాతం వృద్ధి రేటుతో మూడో స్థానానికి ఎగబాకడమే అందుకు నిదర్శనం. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి తలసరి ఆదాయం భారీగా పెరిగింది. రాష్ట్రంలో 2018–19లో తలసరి ఆదాయం రూ.1,54,031 ఉంటే 2022–23 నాటికి రూ.2,19,518కు చేరుకోవడం గమనార్హం.

షర్మిల.. బాబును మించిన ఊసరవెల్లి

చంద్రబాబు లాంటి రాక్షసులతో చేతులు కలిపింది

- ఆయనలాంటి విషసర్పాలకు పాలుపోస్తావా?
- వైఎస్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఊరుకోం
- ఎక్కడికక్కడ నిన్ను నిలదీస్తాం
- ఆమె చంద్రబాబు స్క్రిప్ట్‌నే వల్లె వేస్తోంది
- తెలంగాణలో కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగించింది
- ఇప్పుడు ఇక్కడికొచ్చి రాజకీయం చేస్తోంది
- షర్మిలపై వైఎస్సార్‌టీపీ ఫౌండర్, వైఎస్సార్ వీరాభిమాని కొండా రాఘవరెడ్డి ఫైర్



సాక్షి ప్రతినిధి, కడప: 'చంద్రబాబు లాంటి రాక్షసులతో చేతులు కలిపావు.. వైఎస్ కుటుంబాన్ని రోడ్డున పడేయాలని చూస్తున్నావు.. ఏం ఆశించి ఇదంతా చేస్తున్నావు? సమైక్యాంధ్రలో ఊసరవెల్లి ఎవరంటే చంద్రబాబు అని ఠక్కున చెప్తారు.. కానీ, ఇప్పుడు అంతకుమించిన ఊసరవెల్లిగా కీర్తి గడిస్తున్నావు. వైఎస్సార్ పేరు చెప్పుకుని ప్రచారం చేసుకుంటూ వైఎస్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోం. వైఎస్సార్ వీరాభిమానులుగా మేం సహించలేం'.. అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలపై వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఫౌండర్, వైఎస్సార్ వీరాభిమాని కొండా రాఘవరెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ రాజారెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలది ఆదర్శనీయమైన కుటుంబమన్నారు. వారెంతో మందికి మేలుచేశారని.. కానీ, ఆ కుటుంబం నుంచి వచ్చిన షర్మిల మానసిక పరిస్థితేంటో అర్థంకావడం లేదన్నారు. ఆమె ఏడున్నరేళ్ల తర్వాత తెలంగాణకు వచ్చి వైఎస్సార్ తెలంగాణ పార్టీ పెట్టినప్పుడు మా వైఎస్సార్ బిడ్డ వచ్చిందని సంతోషపడ్డామని ఆయన తెలిపారు. 'షర్మిల అక్కడ ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసింది.. ఆడ బిడ్డను కాదు, ఈడ బిడ్డనే అంది.. నా మెట్టినిల్లు తెలంగాణ అంది, పాదయాత్ర చేసింది.. 119 సీట్లలో పోటీచేస్తానంది.. పాలేరు నుంచి పోటీచేస్తానంటివి, మట్టి పట్టుకుంటివి.. ఎన్నికలకు ముందు పార్టీని మూసేసింద'ని రాఘవరెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఉన్న వైఎస్సార్ అభిమానులు, ప్రజలు దారుణంగా మోసానికి గురయ్యారన్నారు. అసలు తెలంగాణలో ఆమెను నమ్మి 300 కుటుంబాలు రోడ్డు పాలైయ్యాయని తెలిపారు. ఆమె ఏపీకి వచ్చి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన ధ్యేయమంటూ కల్లబొల్లి మాటలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

షర్మిల నోట చంద్రబాబు స్క్రిప్ట్..

చంద్రబాబు ఏ ఆరోపణలైతే చేస్తారో అవే ఆరోపణలు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ చేస్తారు. ఇప్పుడు షర్మిల కూడా చంద్రబాబు స్క్రిప్ట్‌ను వల్లెవేస్తోంది. వైఎస్సార్ కుటుంబాన్ని అన్ని విధాలా రోడ్డున పడేయడానికి చంద్రబాబు, పవన్ కుట్రలు పన్నుతుంటే అందులో నువ్వు భాగస్వామ్యం కావడం మంచిది కాదు. నీకు తోడు వైఎస్ వివేకా కుమార్తె సునీతను వెంటబెట్టుకొని సీఎం జగన్‌పై అసత్య ప్రచారం చేయడం పద్ధతేనా? సీతమ్మ లాంటి మీ అమ్మ విజయమ్మపై వివేకా మీసం మెలేసి, తొడగొట్టినప్పుడు షర్మిల ఏం చేసింది? అన్నకు రాఖీ కట్టే ఒక చెల్లిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేమం కోరకుండా, చంద్రబాబు లాంటి విషసర్పాలకు పాలుపోస్తావా.. ఏం ఆశించి ఇదంతా చేస్తున్నావు? ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని హంతకుడు అని అంటావా? అలా అయితే 55 రోజుల పాటు జైల్లో ఉన్న చంద్రబాబు హంతకుడు కాదా? అసలు వివేకా ఎవరి ప్రభుత్వంలో మరణించారో నీకు తెలీదా?

ఏ ముఖ్యమంత్రి కొడుకూ ఇలా పోరాడి సీఎం కాలేదు..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన పరిపాలనలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారు. ప్రధానంగా మైనార్టీలకు దేశంలో ఎక్కడాలేని విధంగా 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనదే. ఈ ఘనత వైఎస్సార్‌దే.. కాంగ్రెస్ పార్టీది కాదు. ఇక మహానేత మరణానంతరం కాంగ్రెస్ చర్యలతో కాంగ్రెస్‌లో ఇమడలేక వైఎస్సార్‌సీపీ పార్టీని స్థాపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కష్టాలను అనుభవించారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కొడుకూ ఇలా పోరాడి సీఎం కాలేదు. సీఎం కాగానే ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి సీఎం ఉండడం ఆంధ్రప్రదేశ్ ప్రజల అదృష్టం.

మొరుసుపల్లి షర్మిలగా ప్రజల ముందుకెళ్లు..

ఇక షర్మిల ప్రజల ముందుకు మొరుసుపల్లి షర్మిలగా వెళ్లి ఏమైనా ఆరోపణలు చేయి.. మాకెలాంటి అభ్యంతరం లేదు. వైఎస్సార్ బిడ్డ అంటూనే వైఎస్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే మాలాంటి వీరాభిమానులు ఎక్కడికక్కడ నీ చర్యలను నిలదీస్తాం. కడప పార్లమెంట్ పరిధిలో ప్రతి గడపకు వెళ్లి నీ కుట్ర, కుతంత్రాలను వివరిస్తాం.

“భూమిలోకి ప్రవేశించేది మరియు దాని నుండి బయటికి వచ్చేది మరియు ఆకాశం నుండి దిగేది మరియు దానిలోకి పైకి ఎక్కిపోయేది, అంతా ఆయనకు బాగా తెలుసు. మరియు ఆయన అపార కరుణాప్రదాత, క్షమాశీలుడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 12 ఏప్రిల్ 2024

మన చదువుకు కీర్తి కిరీటం!


అంతర్జాతీయంగా మన ఉన్నత విద్యారంగం వెలుగులీనుతున్న వైనాన్ని వరసగా మూడో ఏడాది కూడా క్యూఎస్ (క్వాక్వరెలీ సైమండ్స్) జాబితా నిరూపించింది. బుధవారం ప్రకటించిన ఆ జాబితాలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ) దేశంలోనే ప్రథమ స్థానం సంపాదించింది. అంతర్జాతీయంగా అభివృద్ధి అధ్యయనాల విభాగంలో 20వ ర్యాంకు సాధించి తనకెవరూ సాటిలేరని నిరూపించింది. వామపక్ష భావజాలం బలంగావున్న విద్యాసంస్థగా ముద్ర వున్న జేఎన్‌యూ ప్రతియేటా విద్యాప్రమాణాల విషయంలో తన సత్తా చాటుతూనే వస్తోంది. ఇక అహ్మదాబాద్ ఐఐఎం 25వ ర్యాంకు, బెంగళూరు, కలకత్తా ఐఐఎంలు 50వ స్థానంలోనూ వున్నాయి. డేటా సైన్స్‌లో, పెట్రోలియం ఇంజనీరింగ్‌లో గువాహటి ఐఐటీ క్యూఎస్ జాబితాలో చోటు సంపాదించుకుంది. పరిశోధనా రంగంలో మన దేశం నాలుగో స్థానంలో వుండటం ఈసారి చెప్పుకోదగిన అంశం. ఈ విషయంలో మనం బ్రిటన్‌ను అధిగమించటం గమనించదగ్గది. ఒకప్పుడు మన పరిశోధనలకు పెద్ద విలువుండేది కాదు. రెండేళ్లుగా ఈ ధోరణి మారడం మంచి పరిణామం.

క్యూఎస్ ర్యాంకుల జాబితా అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైనది. 96 దేశాల్లోని 1,559 విశ్వవిద్యాలయాల తీరుతెన్నులు 55 శాస్త్రాల్లో ఎలావున్నవో అధ్యయనం చేసి ఈ ర్యాంకులు నిర్ణయిస్తారు. ఇందుకు క్యూఎస్ పెట్టుకున్న కొలమానాలు ఆసక్తికరమైనవి. దేశంలోని విద్యాసంస్థలు వాటిని గమనిస్తే మన విద్యావ్యవస్థ ఎంతోకొంత మెరుగుపడుతుంది. విద్యా విషయక కార్యక్రమాల్లో, పరిశోధనల్లో ఒక విశ్వవిద్యాలయం పనితీరు ఎలావున్నదో అంతర్జాతీయంగా భిన్న రంగాల్లో నిష్ణాతులైనవారి అభిప్రాయాలు తీసుకుంటారు. అలాగే ఫలానా యూనివర్సిటీనుంచి వచ్చే పట్టభద్రుల్లో నైపుణ్యాలూ, సామర్థ్యమూ ఎలావున్నాయో వివిధ కంపెనీలనూ, సంస్థలనూ అడిగి తెలుసుకుంటారు. అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి, చదువు విషయంలో విద్యార్థులకు అందుతున్న మద్దతు వగైరాలు ఆరా తీస్తారు. అధ్యాపకుల ప్రమాణాలతోపాటు అధ్యాపకవర్గంలో వైవిధ్యత చూస్తారు. అంతర్జాతీయ నేపథ్యంవున్న అధ్యాపకులు, విద్యార్థులు ఎందరున్నారన్నది లెక్కేస్తారు. శాస్త్ర సాంకేతిక విద్యలో, తత్వశాస్త్ర విద్వత్తులో మన ప్రతిభావ్యుత్పత్తులు సాటిలేనివన్న ఖ్యాతి వుండేది. ఐటీరంగంలో మనవాళ్ల బుద్ధికుశలత వారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన దాఖలాలు కనబడుతూనే వున్నాయి. అయితే అంతర్జాతీయ ర్యాంకింగ్‌ల విషయంలో మన విశ్వవిద్యాలయాలు వెనకబడివుండేవి. ఆ కొలమానాలు, అందుకనుసరించే పద్ధతులు సక్రమంగా వుండవనీ, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదనీ కొందరు విద్యావేత్తలు అనేవారు. మనకు ఇష్టం వున్నా లేకున్నా ఆ ప్రమాణాలు అందుకోవటం తప్పదు. ఎందుకంటే ప్రపంచం నలుమూలలా వుండే విద్యార్థులు ఉన్నత విద్య కోసం మన గడప తొక్కాలంటే అది తప్పనిసరి. వివిధ దేశాల్లోని విద్యాసంస్థలందించే విద్య ఎలావున్నదో తులనాత్మక అధ్యయనం చేయటంవల్ల ఎవరు ఏ రంగంలో ముందంజలో వున్నారన్న సమాచారం వెల్లడవుతుంది. అది పై చదువులకెళ్లే విద్యార్థులకు మాత్రమే కాదు... పరిశోధకులకూ ప్రయోజనకారిగా వుంటుంది. అలాగే అంతర్జాతీయంగా ఎవరి భాగస్వామ్యం పొందితే మన విశ్వవిద్యాలయాల ప్రమాణాలు మెరుగుపడతాయో విధాన నిర్ణేతలు నిర్ధారించుకుంటారు. అయితే సంపన్న, వర్ధమాన దేశాల విశ్వవిద్యాలయాల మధ్య పోటీ పెట్టడం ఎంత మాత్రమూ సరైంది కాదన్న వాదనలు ఎప్పటినుంచో వున్నాయి. పరిశోధనలకూ లేదా పరికల్పనలకూ సంపన్న దేశాల్లో ప్రభుత్వాలనుంచీ, ప్రైవేటు వ్యక్తులనుంచీ నిధుల రూపంలో అందే ప్రోత్సాహం అంతా ఇంతా కాదు. ఇక్కడ అది చాలా అరుదు. మన విశ్వవిద్యాలయాలు వెనకబడి వుండటానికి అదొక కారణం. ఇక ఇతర విశ్వవిద్యాలయాల గురించి మాట్లాడుకోవాలి. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని తొలి యూపీఏ ఏలుబడిలో 2005లో దోహాలో జరిగిన డబ్ల్యూటీఓ–గాట్స్ సంభాషణల్లో సూత్రప్రాయంగా అంగీకరించిన పర్యవసానంగా ఇతర రంగాలతోపాటు విద్య కూడా ఖరీదైన వ్యవహారంగా మారింది. విదేశీ వర్సిటీలకు మన దేశం తలుపులు తెరిచింది. 2017లో నైరోబీలో జరిగిన డబ్ల్యూటీఓ సమావేశంలో ఎన్‌డీఏ సర్కారు సంతకం చేశాక 62 ఉన్నత విద్యాసంస్థలకు ‘ఆర్థిక స్వయంప్రతిపత్తి’ మొదలైంది. ఇది పరిమిత స్థాయిలోనైనా ప్రభుత్వ రంగ ఉన్నత విద్యా సంస్థలను ప్రైవేటీకరించటమే. పర్యవసానంగా ఉన్నత విద్యను అందుకోవటం నిరుపేద వర్గాలకు కష్టమవుతోంది. దానికితోడు అధ్యాపక నియామకాల్లోనూ, మౌలిక సదుపాయాలు కల్పించటంలోనూ ప్రభుత్వాలనుంచి మద్దతు కొరవడుతోంది. ఏతావాతా చాలా విశ్వవిద్యాలయాలు గత వైభవ చిహ్నాలుగా మిగిలాయి. ఇప్పుడు ఉన్నత శ్రేణి ర్యాంకులు పొందిన విద్యాసంస్థలకు దీటుగా ఇతర సంస్థలను కూడా తీర్చిదిద్దకపోతే, అన్ని వర్గాలకూ అందుబాటులోకి రాకపోతే ‘స్కిల్ ఇండియా’ వంటివి నినాదప్రాయమవుతాయని పాలకులు గుర్తించాలి.

ఉన్నత విద్యను అందుకోవాలనుకునే పేద వర్గాల పిల్లలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తోంది. ఈ విధానం కింద దేశంలోనే కాదు... అంతర్జాతీయ అగ్రశ్రేణి సంస్థల్లో సీటు సంపాదించుకునేవారికి సైతం భారీ మొత్తాల్లో ఫీజులు చెల్లించటానికి సిద్ధపడుతోంది. వారు చదువుకునే కాలంలో అయ్యే వ్యక్తిగత ఖర్చు కూడా భరిస్తోంది. ఈ మాదిరి విధానం ఇతర రాష్ట్రాల్లో లేదు. క్యూఎస్ ర్యాంకుల జాబితా ఇలాంటి అంశాలపై పాలకులు దృష్టి సారించేలా చేయగలిగితే, లోపాలను సరిదిద్దగలిగితే అది మన విద్యా, వైజ్ఞానిక రంగాలను అత్యున్నత స్థాయికి చేరుస్తుంది.

ఫర్ డెమాక్రసీ? అగేనెస్ట్ డెమాక్రసీ?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

‘సిటిజెన్స్ ఫర్ డెమాక్రసీ’ ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, ముఖ్యంగా ఈ ఎన్నికల్లో కాపాడటానికి పుట్టినట్టు కనిపిస్తుంది. ఈ సంస్థ చేసిన అతి గొప్ప పని ముసలివాళ్ళకు, గుడ్డివాళ్ళకు, కుంటివాళ్ళకు ఇంటి దగ్గరే పింఛన్లను అందించే కార్యక్రమాన్ని ఆపించడం. ఇందుకోసం ముందు కోర్టుకు పోయింది. తరువాత ఎన్నికల కమిషన్ వద్దకు పోయి ఆపించింది. ఎందుకు? జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నియమించిన 2,50,000 మంది వలంటీర్లు ఫించన్ల పంపిణీ ద్వారా ఓటును ప్రభావితం చేస్తారని. ఇదో కొత్త వాదన, వింత వాదన. ఈ అప్రజాస్వామిక సంస్థ చెయ్యబట్టి 30కి పైగా ముసలివాళ్ళు చనిపోయారని వార్తలు వస్తున్నాయి. ఇంత దారుణానికి ఒడిగట్టిన ఈ సంస్థను ప్రజలు గౌరవిస్తారా?

వైసీపీ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో వలంటీర్లను కాంట్రాక్టు ఉద్యోగ పద్ధతిలో నియమించింది. వారినందరినీ ఉద్యోగాల నుండి తీసేసే అధికారం ఈసీకి కూడా లేదు. వలంటీర్లు చేసే అతిమానవత్వపు పని ముసలోళ్ళకు, కుంటోళ్ళకు, గుడ్డోళ్ళకు ఒకటో తారీఖు నాడు పెన్షన్ డబ్బు వాళ్ళ ఇంటి వద్ద అందించడం. అదికాక వీళ్లు ఇంకా చాలా పనులు తమ క్లస్టర్స్ (దాదాపు 50 కుటుంబాలు)లో చేస్తారు. దాదాపు నాలుగున్నర సంవత్సరాలకు పైగా ఆ కుటుంబాలతో, ఆ ముసలి వారితో, రోగస్థులతో సంబంధంలో ఉండి వారి మెప్పును పొందిన వలంటీర్లను ఎన్నికలయ్యే వరకు వారిని కలిసి మాట్లాడకుండా ఎలా ఆపుతారు?

అంతేకాదు, ప్రభుత్వ వెల్ఫేర్ స్కీముల కిందికొచ్చే ప్రజలు ఏ రాష్ట్రంలోనైనా మెజారిటీ. అటువంటి కుటుంబాలన్నిటితో ఈ వలంటీర్లు చాలా ఇతర స్కీముల ద్వారా కూడా కలుస్తారు కదా. ఆరోగ్య సంబంధ స్కీములు, గర్భిణీ స్త్రీలకు సంబంధించిన అవసరాలు, స్కూలు పిల్లలకు ఉన్న అవసరాలు, రేషనుకు సంబంధించిన అవసరాలు అన్నీ వాళ్లు ఇంటింటికి తీరుస్తున్నారు. ఈ క్రమంలో వాళ్ళకు చెడ్డ పేరొస్తే తప్ప, మంచి పేరుతో, సహాయ సహకార సంబంధాలలో వలంటీర్లు ఉంటే వారి సంబంధాల్ని సిటిజెన్స్ ఫర్ డెమాక్రసీ గానీ, ఈసీగానీ ఎలా ఆపుతాయి? ఈ పనిని ఈ సంస్థ డెమాక్రసీకి అనుకూలంగా కాదు చేసింది; డెమాక్రసీ వ్యతిరేక బుద్ధితో చేసినట్లు అర్థమౌతూనే ఉంది. ఈ వలంటీర్లు ఆయా గ్రామాల వారే, వాడల వారే. పట్టణాల్లో కూడా వాళ్ళు పనులు చేసే కుటుంబాలకు తెలిసిన వారే. వీళ్ళు నిత్య సంబంధాలు ముసలోళ్ళకు, కుంటోళ్ళకు, గుడ్డోళ్ళకు ఫించను ఇవ్వకుండా ఆపితే ఆగుతాయా?

అప్పుడు ఈ సంస్థ ఏమి చెయ్యాలి? ఈ వలంటీర్ల ఉద్యోగాలు పీకించి గ్రామ బహిష్కరణ చేయించాలి. అప్పుడు వీళ్ళు నిజమైన సిటిజెన్స్ ఫర్ డెమాక్రసీ పని చేసినట్టు! కానీ అది వారి నుంచి కాదు కనుక ఈ ఒక్క డిమాండ్ సాధించారు. ఈ పని చేసింది ప్రజాస్వామ్యం కోసమా, ప్రతిపక్షాల కోసమా?

అసలు ఈ సంస్థ ఏర్పడిన విధానం, దాని లక్ష్యం, అది సాధించిన ఘనతలను చూద్దాం. ఇది 2023 అక్టోబర్‌లో విజయవాడలో ఏర్పడింది. మాజీ ఏపీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ (రిటైర్డ్ ఐఏఎస్) జనరల్ సెక్రటరీగా ఏర్పడింది. మాజీ ఛీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం (రిటైర్డ్ ఐఏఎస్) ఇందులో ముఖ్యంగా పని చేస్తున్నారు. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోనే డెమాక్రసీని కాపాడటానికి, ముఖ్యంగా ఈ ఎన్నికల్లో కాపాడటానికి పుట్టినట్టు కనిపిస్తుంది. ఈ ఇద్దరికీ పౌరహక్కుల గురించి ఎన్నడూ మాట్లాడిన చరిత్ర లేదు. ఆదివాసుల్లోగానీ, దళితుల్లోగానీ వీరికి అభిమానులు ఉన్నట్లు ఎక్కడా కనిపించదు.



ఇంతకుముందు ఐఏఎస్ అధికారులు పదవుల్లో ఉండగా, దిగిపోయాక కూడా ప్రజల హక్కుల కోసం పని చేసినవాళ్ళు ఉన్నారు. మన ఉమ్మడి రాష్ట్రంలో ఎస్ఆర్ శంకరన్, కాకి మాధవరావు చాలా కాలం ఇటువంటి పని చేశారు. ఆదివాసుల కోసం బీడీ శర్మ చాలా పనిచేశారు. శంకరన్ రిటైర్ అయ్యాక కమిటీ ఆఫ్ కన్సర్న్‌డ్ సిటిజన్స్ అనే సంస్థ పెట్టి బీద ప్రజల కోసం, పౌర హక్కుల రక్షణ కోసం చాలా పనిచేశారు. ఆయన మరణానంతరం దళిత సంఘాలు ఈనాటికీ ఆయన సంస్మరణ సభలు జరుపుతాయి. కాకి మాధవరావు ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్‌లో చాలా చురుకుగా పనిచేశారు. బీడీ శర్మ ఆదివాసుల హక్కుల కోసం తన జీవిత కాలమంతా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు.

అందుకు భిన్నంగా రమేష్ కుమార్, సుబ్రహ్మణ్యం... చంద్రబాబు నాయుడి ఏజెంట్లుగా వ్యవహరించారని స్పష్టంగా అర్థమౌతూనే ఉంది. దానివల్ల ఎవరి హక్కులు భంగమయ్యాయి? అతి బీద, ముసలి, కుంటి, గుడ్డి వారి హక్కులు భంగమయ్యాయి. చాలా బాధాకరమైన విషయమేమంటే ఈ అప్రజాస్వామిక సంస్థ చెయ్యబట్టి 30కి పైగా ముసలివాళ్ళు చనిపోయారని వార్తలు వస్తున్నాయి. ఇంత దారుణానికి ఒడిగట్టిన సిటిజెన్స్ ఫర్ డెమాక్రసీ అనే పేరు గల సంస్థను ప్రజలు గౌరవిస్తారా?

ఇప్పుడు పరిస్థితి చూడండి. అదే చంద్రబాబు నాయుడు నేను వలంటరీ వ్యవస్థను కొనసాగిస్తాను; వాళ్ళందరికీ నెలకు 10 వేలు ఇస్తానంటున్నాడు ఎందుకు? మొత్తం ప్రజానీకంలో ఆయన ఆట బొమ్మలైన మాజీ ఐఏఎస్ అధికారులు చేసిన పనివల్ల మొత్తం కూటమి ఓట్లు గల్లంతయ్యే పరిస్థితి వచ్చింది. ఈ కూటమి కూడా ఒక ఉమ్మడి మానిఫెస్టోను ప్రకటించలేదు. ఎవరిది వాళ్ళు మానిఫెస్టోగా రాసుకున్నారు. కానీ రేపు అధికారమొస్తే ముగ్గురు మంత్రి మండలిలో ఉండి పరిపాలించాలి. చంద్రబాబు ఇప్పుడు ఇచ్చే హామీలు బీజేపీ, జనసేనవి కావు కదా! వాళ్ళెందుకు అంగీకరిస్తారు? ఆయన పబ్లిక్ మీటింగుల్లో ఇష్టమొచ్చినట్లు వాగ్దానాలు చేస్తున్నాడు.

మరో వాగ్దానం చూడండి. ఆయన అధికారంలోకి వస్తే ప్రతి స్త్రీకి సంవత్సరానికి 15 వేలు ఇస్తాడట. ఇంట్లో ఎంతమంది స్త్రీలు ఉంటే అన్ని పదిహేను వేలు ఇస్తాడట. ఇద్దరుంటే 30 వేలు, ముగ్గురుంటే 45 వేలు అంటున్నాడు. ఈ పైసల పంపకాన్ని బీజేపీ ఒప్పుకుంటుందా! అందుకు మోదీ సరే అన్నాడా? చంద్రబాబు హామీలు జగన్ హామీలలా కాదే. జగన్ అన్నీ స్వయంగా తన పార్టీలో నిర్ణయించగలడు. కానీ బాబు ఇప్పుడు అలా చెయ్యలేడే. బీజేపీ ఒక జాతీయ పార్టీ. దానికి 30 వేల ఎకరాల్లో వేల కోట్లు పెట్టి రాజధాని కట్టడమే అంగీకారం కాదు. ఇప్పుడు ఆంధ్రలో వలంటరీ వ్యవస్థను అంగీకరిస్తే దేశమంతా అటువంటి డిమాండ్లు వచ్చే అవకాశముంది. కనుక బాబు బోగస్ వాగ్దానాలు ఇస్తున్నాడు. ఆయన అయోమయంలో మాట్లాడుతున్నాడు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు దేశంలో చాలా అంశాలను ప్రభావితం చేస్తాయి. ప్రశాంత్ కిశోర్ డబ్బులతో ఎన్నికల రిజల్ట్ ప్రిడిక్షన్స్ చేస్తూ స్వంత పార్టీ పెట్టి బిహార్‌లో ఏ మాత్రం గుర్తింపు లేని నాయకుడుగా మిగిలిపోయి ఇప్పుడు మళ్ళీ పాత అవతారమెత్తుతున్నాడు. ఏపీ ఎన్నికలు అతన్ని దేశంలోనే ఎవరూ నమ్మకుండా చేసే అవకాశముంది. విదేశాల్లో ఇంగ్లిష్ మీడియంలో చదువుకొని వచ్చిన ఈ బ్రాహ్మణ మేధావి ఇంగ్లిష్ మీడియం విద్యా ప్రభావంగానీ, సంక్షేమ పథకాల ప్రభావంగానీ ఎన్నికల్లో ఉండదని ఊకదంపుడు బ్రాహ్మణ వాదం చేస్తున్నాడు. బడులు కాకుండా, గుడులు కడితే ప్రజలు ఓట్లేస్తారని వీరి సిద్ధాంతం. రిటైర్డ్ ఐఏఎస్‌లు పౌరహక్కుల నాయకుల అవతారమెత్తి ముసలోళ్ళను, కుంటోళ్లను, గుడ్డోళ్ళను ముంచితే వారి నాయకుడు చంద్రబాబు వలంటీర్లను, అమరావతి రైతులను అంతు లేని ఆశలతో ముంచుదామని చూస్తున్నాడు. కానీ ప్రజలు నమ్మే పరిస్థితి కనిపిస్తలేదు. ఎలా నమ్ముతారు? జగన్ వెల్ఫేర్ కార్యక్రమాల వల్ల రాష్ట్రం అప్పుల పాలైంది; అభివృద్ధి అంటే సింగపూర్ వంటి రాజధాని కట్టలేదు; అద్దంలా మెరిసే రోడ్లు వెయ్యలేదు అంటూనే ఇప్పుడు జగన్‌ను మించిన హామీలిస్తున్నాడు.

ఆయన ఇచ్చే హామీల గురించి పవన్ కల్యాణ్ గానీ, పురందేశ్వరిగానీ ఏమీ మాట్లాడటం లేదు. అంటే ఆ పార్టీలు ఈ వాగ్దానా లను అంగీకరించవనే కదా అర్థం. ఎన్నికలు ఇంకో నెల రోజులు ఉండగా, ఈ మూడు పార్టీల పరేషాన్ చూస్తే చూసేవారికే జాలేస్తుంది. మరీ చంద్రబాబు అయితే ఓడిపోతే ఎట్లా, ఎట్లా అనే భయం ముఖంలో కనిపిస్తుంది. ఇవి ఆఖరి ఎన్నికలని ఆయన భయమే చెబుతుంది. ఏమౌతుందో ఏపీ ప్రజలే నిర్ణయిస్తారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

మొఘలుల ఈద్



మొత్తానికి నేను ఒక మొఘల్ చక్రవర్తి ఈద్ జరుపుకొంటున్న చిత్రాన్ని చూశాను(పెయింటింగ్ షేర్ చేశారు). బెర్లిన్ మ్యూజియం ఆఫ్ ఇస్లామిక్ ఆర్ట్స్‌లో. ఇందులో ఉన్నది జహంగీర్. 1615–25 మధ్య కాలానిది. కాకపోతే వాళ్లు చేస్తున్నది ఈద్ ఉల్ ఫితర్(రమజాన్) కాదు, ఈద్ అల్ అజహా (బక్రీద్). చాలావారకు మొఘల్ చక్రవర్తులు హోలీ జరుపుకోవడం చూశాను; కొన్ని మినియేచర్స్‌లో యువరాజులు, యువరాణులు దీపావళి జరపడం చూశాను.

– రాణా సఫ్వీ, రచయిత్రి

ఆహార వైవిధ్యం



దీపావళి రోజు అల్పాహారంగా ఇడ్లీ, మటన్ కూర తినే సంప్రదాయం తమిళనాడులో ఉంది. ఉత్తర మలబార్‌లో ఓనమ్ వంటకాల్లో చేప, చికెన్ ఉంటాయి. చాలామంది కన్నడిగులు హోసా తొడకు(ఉగాది తర్వాతి రోజు) నాడు చికెన్ తింటారు. కాబట్టి, ఆహార అలవాట్లను బట్టి జనాల మీద తీర్పులు ఇవ్వకూడదు. భారత్ వైవిధ్యభరిత దేశం.

– అద్వైద్, క్రానికలర్

వ్యూహకర్త



నేను బీజేపీతో తీవ్రంగా విభేదిస్తాను. కానీ రాజకీయంగా మన వైరి పక్షాల నుంచి కూడా మనం చాలా నేర్చుకోవచ్చు. ప్రధానమంత్రి ఇందులో మాస్టర్. ముఖ్యంగా ఆయన గేమింగ్ కమ్యూనిటీని కలవడం, అదీ ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను కలిశాక కలవడం నిజంగా బాగుంది.

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

దా‘రుణం’



2014లో ఇండియా రుణం: 49 లక్షల కోట్ల రూపాయలు. 2024లో ఇండియా రుణం: 205 లక్షల కోట్ల రూపాయలు. మోదీ ప్రభుత్వ హయాంలో రుణం విపరీతంగా పెరిగింది. కానీ మోదీ అనుకూల మీడియా దీన్ని ఎప్పుడూ చూపదు.

– ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

రికార్డు లావాదేవీలు



చాలామంది మిస్సయిన ఒక వార్త: మార్చ్ 2024లో యూపీఐ ద్వారా రికార్డు స్థాయిలో జరిగిన లావాదేవీల సంఖ్య 13.4 బిలియన్లు. (ఫిబ్రవరిలో వీటి సంఖ్య 12 బిలియన్లు.)

– తుషార్ గుప్తా, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

బహుముఖ ప్రజ్ఞాశాలి

మిర్యాలగూడలో ముగ్గురు వ్యక్తులు సైన్ బోర్డులు రాసేవారు. ఒకరు రాసిన బోర్డులు నన్ను నిలబెట్టేవి. ఎవరది? సుదర్శన్! సంతకం, కింద గీత, రెండు పువ్వులు. నేను పని నేర్చుకుంటే, సొంతంగా షాప్ పెడితే ఇతనితోనే బోర్డు రాయించుకోవాలని నిశ్చయించుకున్నాను. ఆర్మేచర్ – బ్యాటరీ బొమ్మలతో ‘కృష్ణ ఆటో ఎలెక్ట్రికల్ వర్క్స్’ బోర్డును సుదర్శన్ ప్రేమగా రాశారు, 1973లో. ఆయన నటుడు కూడా. కొన్ని నాటకాలలో స్త్రీ వేషం ధరించారు. మిర్యాలగూడ శ్రీనివాస టాకీస్‌లో అప్‌స్టెయిర్ దారిలో తాను వేసిన ఉమర్ ఖయ్యాం, రాధ కృష్ణుల చిత్రాలు ప్రేక్షకులను కాసేపు నిలబెట్టేవి. నాగార్జున బ్రాన్ ఆయిల్ మిల్ కోసం సుదర్శన్ వేసిన ఆచార్య నాగార్జునుని బృహద్ చిత్రం సాగర్ రోడ్‌లో ప్రయాణించే వారిని ముగ్ధులను చేసేది. నేటి ప్రముఖ ఆర్టిస్టులు చిత్ర, నర్సిం తదితరులు సుదర్శన్ శిష్యులే.



నందికొండ (హిల్ కాలనీ) జూనియర్ కాలేజీలో డ్రాయింగ్ టీచర్‌గా సుదర్శన్ ఉద్యోగస్థుడు కావడం సాహితీ అభిమానులు చేసుకున్న అదృష్టం. గురజాడ, శ్రీశ్రీ, రావిశాస్త్రి జయంతి – వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించేవారు. ప్రియదర్శిని అనే ఫోటో స్టూడియో పెట్టి ఔత్సాహికులను ఫోటోగ్రాఫర్స్‌గా తీర్చిదిద్దారు. జర్నలిస్టుగా నాగార్జున సాగర్ గురించి, బౌద్ధ పర్యాటకుల గురించి అమూల్యమైన వ్యాసాలు రాశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన సాంస్కృతిక సైనికుడు.

ప్రముఖ ఫిల్మ్ మేకర్ బి. నర్సింగ్ రావు ఆత్మీయతను పొందిన సుదర్శన్ దాదాపు వారి అన్ని సినిమాలకు తనవంతు సేవలు అందించారు. ‘దాసి’ కాస్ట్యూమ్ డిజైనర్‌గా సుదర్శన్ రాష్ట్రపతి అవార్డు పొందారు. లలిత కళల పరమార్థం కరడు కట్టిన మనస్సులను మృదువు పరచడం. లలిత కళలన్నిటిలో తనదైన ప్రత్యేకత కలిగిన సుదర్శన్ చిరంజీవి.

– పున్నా కృష్ణ మూర్తి । 76809 50863

(నేడు మిర్యాలగూడలో ‘దాసి’ సుదర్శన్ సంస్మరణ సభ)

బాబు ప్రచార ప్రగల్భాలు–వాస్తవాలు

అభిప్రాయం



డా॥ జి. నవీన్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు కేవలం నెల రోజులు మాత్రమే మిగిలాయి. దీనితో, వాతవరణం లానే ప్రచార పర్వం కూడా వేడెక్కింది. ఒక వైపు జగన్ ‘మేమంతా సిద్ధం’ సభల జన సునామీ ఉధృతి రోజు రోజుకీ పెరిగిపోతుంటే, మరో వైపు ‘ప్రజాగళం’ పేరుతో చంద్రబాబు నాయుడు కూడా రాష్ట్రాన్ని చుట్టి వస్తున్నారు. ఇప్పటికే విశ్వసనీయత పలుమార్లు కోల్పోయిన చంద్రబాబు ఎన్నికల సభల్లో చేస్తున్న అనేక సత్యదూరమైన ప్రకటనల్లో కొన్నింటిని ఇక్కడ చర్చించాలి.

కొవ్వూరు సభలో ఆయన ‘తమ్ముళ్ళూ, నేనెప్పుడైనా విద్యుత్ ఛార్జీలు పెంచానా?’ అని అడగడం చూస్తుంటే ప్రజల మేధస్సుపై ఆయనకు ఇంత చిన్న చూపు ఏంటి అని అనిపిస్తోంది. 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా ఉంటూ దేశంలోనే ఆనాటికి రికార్డు స్థాయిలో కరెంట్ చార్జీలు అకస్మాత్తుగా పెంచితే లక్షల మంది ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లు ఎక్కి ధర్నాలు, దీక్షలు చేపట్టిన ఘట్టం ఆయన మరిచినంత తేలిగ్గా జనం మరుస్తారా? ఆ నిరసన స్వరాలను ఉక్కు పాదంతో తొక్కి పోలీసు కాల్పులు జరిపించి ముగ్గురి విలువయిన ప్రాణాలను పొట్టన పెట్టుకున్న వైనం ఇప్పటికీ ‘బషీర్బాగ్ ఉదంతం’గా మన కళ్ళ ముందు మెదులుతూనే ఉండగా ఈయన ఈ విధంగా అసత్య ప్రేలాపనలు చేయడం అసమంజసం.

పామర్రు సభలో హైటెక్ సిటీ ప్రస్తావన తెచ్చి ‘ఇక్కడే అలాంటి టవర్‌లు కడతాను’ అని చెప్పారు. ఇలాంటి డాంబికాలు పచ్చ‘కామెర్లు’ వచ్చిన వారికి రుచించవచ్చుగానీ కొంచెం అయినా ఆలోచించే జనం అటువంటి ప్రకటనలను శంకించక మానరు. అసలు ఐటీ అంటే చంద్రబాబు అని జరిగిన ప్రచారం... ఉన్న దాన్ని చిలవలు పలవలు చేసిన చందంగా జరిగింది. ప్రపంచీకరణలో భాగంగా వచ్చిన ఒరవడిలో చెన్నై, బెంగుళూరు వంటి నగరాలతో పోటీ పడుతూ హైదరాబాద్ కూడా ఐటీ హబ్ అవ్వడం జరిగింది. అయితే, ఇతర రాష్ట్రాల్లోని అప్పటి ముఖ్యమంత్రులకు రాని ఖ్యాతిని చంద్రబాబుకి చేకూర్చడంలో ఆయన ప్రచార కౌశల్యం, అడక్కుండానే వండి వార్చే అస్మదీయ మీడియా సహకారం పాత్ర మరవరానిది. ఒక అర్ధ సత్యాన్ని వందల, వేల సార్లు నొక్కి వక్కాణిస్తే అది ఏవిధంగా చరిత్రలో స్థిరీకరించుకుపోతుందో ఈ ‘చంద్రబాబు–ఐటీ’ ఉదంతం ఒక బలమైన ఉదాహరణ.

ఆయన 2004లో అదే హైదరాబాద్ సిటీలో, హైటెక్ సిటీ పరిసర నియోజకవర్గాల్లో కూడా చిత్తుగా ఓడిపోయిన మాట వాస్తవం. అంటే, ఈయన చెప్పుకునే అభివృద్ధి అక్కడ గ్రామిక జనాలకు ఏ మాత్రం ఉపయోగ పడలేదు అనేది సుస్పష్టం. అలాగే, హైదరాబాద్ నగరం చంద్రబాబును వదిలించుకుని ఇప్పటికి 20 ఏళ్లు దాటినా, ఇంకా ఐటీ రంగంలో అగ్రగామిగా ఎందుకు ఉంది? ఈయన తరవాత వచ్చిన ప్రభుత్వాలకు అందులో పాత్ర లేదా? నిజానికి, ఆయన తదనంతర పాలనలోనే హైదరాబాద్ విపరీతంగా అభివృద్ధి చెందింది అని కూడా చెప్పొచ్చు. అందుకే, అభివృద్ధి అనేది ఒక్క వ్యక్తి ద్వారా వచ్చి పడే విషయం కాదు. ఒక నగరానికి, ప్రాంతానికి ఉన్న భౌగోళిక, చారిత్రక, స్వాభావిక నేపథ్యాల వల్ల సాధ్యమయ్యే విషయం.



పెనమలూరు ప్రచార సభలో చంద్రబాబు ‘సంపద సృష్టిస్తా’ అని అరిచి గీ పెట్టారు. అసలు ‘సంపద సృష్టి’ అంటే ఏంటి? నేల విడిచి సాము చేసి, గ్రాఫిక్స్‌తో మాయ చేసి, తిమ్మిని బమ్మిని చేయడం సంపద సృష్టి అవుతుందా? ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి, దావోస్ పర్యటనలకు వెళ్లి విశ్వవ్యాప్త పెట్టుబడిదారీ రాబంధుల అడుగులకు మడుగులొత్తడమా సంపద సృష్టి అంటే? అణగారిన వర్గాల భూముల్లో జయభేరీలు, ఫోరమ్మాళ్లు కట్టడమా సంపద సృష్టి అంటే? వేల సంవత్సరాల వివక్ష వల్ల నలిగిపోయి ఉన్న బతుకులను కొత్త ప్రపంచపు ఎండమావుల మిరిమిట్లను చూపి మళ్ళీ దగా చేయడమా సంపద సృష్టి అంటే? నిజమైన సంపద సృష్టి అంటే కింది జనాలకు నాణ్యమైన విద్యను అందించడం కాదా? వారికి కావాల్సిన ఆర్థిక చేదోడు ఇచ్చి నేను ఉన్నాను అని వెన్ను తట్టే ప్రభుత్వమే సంపద సృష్టికి నాంది పలుకుతుంది. ఈ రాష్ట్రంలో ఒక తరం పేద పిల్లలు అందరూ ప్రభుత్వ బడులలో ఇంగ్లీష్ చదువులు నేర్చుకుంటే కలిగే మానవ వనరుల సంపద వంద చంద్రబాబులు వెయ్యి రియల్ ఎస్టేట్ మాయాజాలాలు చేసినా ఒనగూడదు.

పల్నాడులో మాట్లాడుతూ బాబు శవ రాజకీయాల ప్రస్తావన చేశారు. గోదావరి పుష్కరాల సందర్భంగా 2015లో ఈయన పబ్లిసిటీ పిచ్చి వల్ల జరిగిన తొక్కిసలాటలో 29 మంది అమాయక భక్తులు శవాలుగా మారిన దుర్ఘటన మరవరాదు. అలాగే, 2022 డిసెంబర్ 29న కందుకూరులో ఈయన అత్యుత్సాహంతో ఇరుకు సందుల్లో సభ పెట్టడం వల్ల 8 మంది చనిపోతే, 4 రోజులు తిరగకుండానే గుంటూరులో చీరల పంపిణీ పేరున మరో తొక్కిసలాట జరిగి ముగ్గురు శవాలుగా మారారు. ఆ నిస్సహాయ, పేద ప్రజల శవాలు బాబు రాజకీయ ప్రస్థానంలో సమిధలు.

మొత్తానికి, ఈ విషయాలన్నీ గమనిస్తే మనకు అవగతమవుతున్న దేంటంటే చంద్రబాబు నాయుడు దృష్టి కోణంలోనే లోపం ఉంది. అందులో ప్రజల సంక్షేమానికి తావు లేదు. ఉన్నదల్లా అభూత కల్పనపై మక్కువ, కల్పిత స్వీయ చరిత్రపై ఎనలేని అతి విశ్వాసం. వీటిని రాష్ట్ర ప్రజలు సమూలంగా మరోసారి తిరస్కరిస్తారని ఆశిద్దాం.


వ్యాసకర్త సామాజిక ఆర్థిక అంశాల విశ్లేషకులు

మూడంశాల మేలు కలయిక

గురు దర్శనము, గురు పూజ, గురు సేవ అనునవి భక్తియందలి మూడు ముఖ్యాంశములు. వీటిద్వారా భక్తుడు నిర్మల భక్తిని పెంపొందించుకొని సద్గురువు కృపను చూరగొంటాడు. సద్గురువు కేవలం ఒక భౌతిక స్వరూపమే కాక సాక్షాత్తు భగవంతుని అవతారమే.

సద్గురువు విశ్వ శక్తికీ, విశ్వ చలనమునకూ ప్రాతినిధ్యం వహిస్తాడు. కేవలము నిష్కళంకమైన భక్తిద్వారా భక్తుడు సద్గురువు భగవత్తత్త్వమును లేక విశ్వవ్యాపకత్వమును అనుభవ పూర్వకముగా గ్రహిస్తాడు. భక్తి, అహంభావాలు కలిసి ముందుకు వెళ్ళలేవు. అహంభావము ఎంతవరకు మిగులునో దానిని తొలగించు నంతవరకు భక్తిని పెంచుకొని, నిజమైన భక్తిగా వృద్ధి చేసుకోవలసిన అవసరం ఉంది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మీరా, ధృవుని ఉదంతాలు శ్రేష్ఠమైన భక్తికి దృష్టాంతములు. నిన్ను నీవు ఒక భక్తుడిగా పరిగణించుకొన్నచో, పైన పేర్కొన్న భక్తులు ఎదుర్కొనిన పరీక్షలను ఎదుర్కొని, నీవు నిజమైన భక్తుడివేనా అని నిన్ను నీవు ప్రశ్నించుకోవాలి. ‘నేను నిజమైన భక్తుడను’ అని ఏ నిజమైన భక్తుడు చెప్పుకోడు. అతడు కేవలం భక్తిని మాత్రమే కలిగి ఉండి మిగిలిన విషయములను తన ఆరాధ్య దైవమునకే వదలిపెట్టాలి.

ప్రతి ఒక్క వ్యక్తి కోరుకొనదగిన, మిక్కిలి విలువైన వరము భక్తియే. ఇదే మానవునికి గల గొప్ప మానసిక శక్తి. భక్తి మనస్సును దృఢపరుస్తుంది. మనసు శక్తిని ఆకాశమును దాటి వ్యాపించునట్లు చేస్తుంది. భక్తియందలి ముఖ్యాంశము ప్రేమ. నిరంతరము సాధన చేసినచో, ఇది భక్తుని ముందు భగవంతుని సాక్షాత్కరింప చేస్తుంది. భగవంతునిపై భక్తి తారాస్థాయిని చేరగానే భగవంతునికి, భక్తునికి మధ్యగల భేదము లేకుండా పోతుంది. అలాగే జీవితం సఫలమవుతుంది.

ఆత్మ వికాసానికి భక్తి సులభమైన మార్గమని చెప్పబడినప్పటికీ, ఆలోచించి చూచినప్పుడు, ఇది చాలా కష్టతరమైన మార్గం. నిజమైన భక్తిగల వ్యక్తి తాను భగవంతుని నుండి కానీ లేక గురువు నుండి కానీ భిన్నంగా ఉన్నానని తలచడు. ఆ విధముగా తలచుటకు అవకాశమే లేదు. భక్తి పరిపూర్ణత పొందిన వెంటనే, భక్తుడు భక్తుడు కానేరడు. కాని అతను తన ఆరాధ్య దైవములో ఒక భాగముగా ఉంటాడు. రాధ కృష్ణునిలో ఒక భాగమైనట్లు!

వాస్తవానికి మూర్తీభవించిన భక్తియే భక్తుడు. కట్టెల నుండి నిప్పు ఏ విధముగా వేరుగా ఉండదో, అదే విధముగా భక్తుడు తన ఆరాధ్య దైవము నుండి భిన్నము కానేరడు!!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.చవితి సా.5.09 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** రోహిణి తె.4.48 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.8.56 నుండి 9.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.12 వరకు, **అమృతఘడియలు:** రా.1.40 నుండి 3.14 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.10.



సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి స్వయంభూశ్రీరాజ్యలక్ష్మి,చెంచులక్ష్మి సమేత ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని గురువారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పూజల అనంతరం గతంలో కృష్ణానదికి వచ్చిన భారీ వరదలతో పులిచింతల బ్యాక్ వాటర్‌లో ఆలయం మునిగిపోయిన ఫొటో ఆల్బమ్‌ను జస్టిస్ మల్లికార్జునరావు తిలకించారు.
– మఠంపల్లి (సూర్యాపేట జిల్లా)

పూలే ఆశయాలకు అనుగుణంగా మోదీ సర్కార్ పనితీరు

- జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా బీజేపీ నేతల నివాళి



సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలకనుగుణంగా మోదీ ప్రభుత్వం పని చేస్తోందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. పూలేను స్ఫూర్తి తీసుకున్న ప్రధాని మోదీ ఇప్పుడు అభినవ జ్యోతి బా పూలేగా ప్రశంసలు అందుకుంటున్నారని కొనియాడారు. బీసీలను విద్య, ఉద్యోగ కల్పనతో పాటు పారిశ్రామిక వేత్తలుగా తయారు చేశారన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో జ్యోతి బాపూలే జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి కె.లక్ష్మణ్ ఇతర నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో బీసీలను అణచివేశారన్నారు. బీఆర్ అంబేడ్కర్‌ను రెండుసార్లు ఓడించి చట్ట సభలకు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. పదేళ్లుగా మోదీ సామాజిక న్యాయాన్ని అమలు చేస్తూ కేంద్ర కేబినెట్‌లో బీసీలకు పెద్దపీట వేశారని తెలిపారు. అందుకే బీసీలంతా మోదీకి అండగా నిలబడుతున్నారని, కాబట్టి ఆయన మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ధీమాను వ్యక్తం చేశారు. మోదీని కులం పేరుతో అవమానిస్తున్నందుకు రాహుల్‌గాంధీ బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

బీసీల చైతన్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యం

- గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి బుర్రా వెంకటేశం



సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనలకు అనుగుణంగా నేటి యువత అడుగులు వేయాలని, జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు చైతన్యవంతం అయినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర విద్యా, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. దేశంలో మొదటిసారిగా మహాత్మా బిరుదు పొందిన వ్యక్తి జ్యోతిబా పూలే అని ఆయన కొనియాడారు. గురువారం సంక్షేమ భవన్‌లో జ్యోతిబా పూలే 198వ జయంతిని పురస్కరించుకుని ఆయన పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని బలహీన వర్గాల వారికి విద్యను అందించడానికి అహర్నిశలు పాటుపడిన త్యాగధనుడు పూలే అని కొనియాడారు. బీసీలు తమను తాము ఉన్నతీకరించుకుంటూ సమాజాభివృద్ధికి దిశానిర్దేశం చేసే స్థాయికి ఎదిగాలని వెంకటేశం పిలుపు నిచ్చారు.

నెక్లెస్‌రోడ్‌లో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: నెక్లెస్‌రోడ్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం తరహాలోనే వెనుకబడిన వర్గాల ఆశాకిరణం మహాత్మా జ్యోతిబా పూలే 150 అడుగుల విగ్ర హాన్ని కూడా ఏర్పా టు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జ్యోతిబా పూలే 198వ జయంతిని బాగ్ లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బడుగుల ఉన్నతికి పూలే చేసిన కృషిని దాసు సురేశ్ గుర్తు చేశారు. పూలే పేరిట స్మృతివనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వంద కోట్లతో నిధిని ఏర్పాటు చేసి ప్రతి ఏటా పూలే పేరిట సంఘ సంస్కర్తలకు అవార్డులు ప్రదానం చేయాలన్నారు. పూలేకు భారత రత్నతోపాటు ఆయన జయంతిని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

అసైన్డ్ భూమిని | ఎలా కొట్టేయాలనుకున్నారు?

టీడీపీ నేత శివానందరెడ్డిని ప్రశ్నించిన పోలీసులు!

- బుద్వేల్ అసైన్డ్ భూముల కేసులో ఈయన నిందితుడు
- బుధవారం సీసీఎస్‌లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరు
- దాదాపు రెండు గంటల పాటు వివిధ అంశాలపై ఆరా
- వచ్చే వారం మరోసారి రావాలంటూ ఆదేశాలు జారీ



సాక్షి, హైదరాబాద్: నగర శివార్లలోని బుద్వేల్‌లో ఉన్న 26 ఎకరాల అసైన్డ్ భూమిని కాజేసిన వ్యవహారంలో నిందితుడిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నేత, వెస్సెల్లా గ్రూప్ సీఈఓ, మాజీ పోలీసు అధికారి మాండ్ర శివానందరెడ్డి బుధవారం నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసుల ఎదుట హాజరయ్యారు. అధికారులు శివానందరెడ్డిని దాదాపు రెండు గంటల పాటు వివిధ అంశాలపై ప్రశ్నించినట్టు తెలిసింది. ఆయన నుంచి కొంత సమాచారం సేకరించిన పోలీసులు వచ్చే వారం మరోసారి సీసీఎస్‌లో హాజరుకావాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న శివానందరెడ్డి భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్క్, ప్రశాంత్‌రెడ్డిని సీసీఎస్ పోలీసులు గత వారం ప్రశ్నించిన విషయం విదితమే. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. అసైనీల నుంచి భూమిని చేజిక్కించుకోవాలని తొలుత ప్రయత్నించిన రియల్టర్లు టీజీ ప్రకాష్, గాంధీ, రామారావు, రియల్ ఎస్టేట్ బ్రోకర్ దయానంద్ 2021లో మిమ్మల్ని ఎందుకు సంప్రదించారంటూ పోలీసులు శివానందరెడ్డిని ప్రశ్నించారు. బుద్వేల్‌లోని ఆ భూమికి సంబంధించిన పూర్వాపరాలు తెలిసినప్పటికీ పోలీసు అధికారిగా ఉన్న పరిచయాలు, పలుకుబడి వినియోగించి అసైన్డ్ ల్యాండ్‌ను కాజేయాలని ప్రయత్నించడంపై శివానందరెడ్డికి కొన్ని ప్రశ్నలు సంధించారు. ఈ భూములు సొంతం చేసుకునే ఉద్దేశంతో 2021–22 మధ్య కాలంలో అసైనీలకు శివానందరెడ్డి తన సంస్థ ద్వారా చెక్కుల రూపంలో చెల్లించిన మొత్తం వివరాలను సీసీఎస్ పోలీసులు అడిగారు.

ఇంకా మీ వెనుక ఎవరున్నారు?

ఆ అసైన్డ్ ల్యాండ్ కన్వర్షన్ కోసం 2022–23 మధ్య ఎవరెవరి ద్వారా? ఎక్కడెక్కడ లాబీయింగ్ చేశారు? ఈ వ్యవహారంలో ఎవరు కీలకంగా వ్యవహరించారు? అనే వివరాలను శివానందరెడ్డి నుంచి రాబట్టడానికి సీసీఎస్ పోలీసులు ప్రయత్నించారు. అసైనీలు, ఆక్రమణదారులకు కన్వేయన్స్ డీడ్స్ ద్వారా అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయించాలంటూ రాజేంద్రనగర్ ఎమ్మార్వోకు మెమో జారీ అవడం వెనుక ఎవరు ఉన్నారు? అనే అంశాన్నీ పోలీసులు ప్రశ్నించారు. గత ఏడాది ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య అసైనీలు, ఆక్రమణదారులకు కన్వేయన్స్ డీడ్స్ జరగ్గా.. ఆ భూమిని ఏ అండ్ యూ ఇన్‌ఫ్రా పార్క్, వెస్సెల్లా గ్రీన్ కంపెనీస్‌లకు వారిపై రిజిస్టర్ చే యడంపైనా దర్యాప్తు అధికారులు దృష్టి పెట్టారు. అసైనీలను భయపెట్టి ప్రభుత్వ ఉత్తర్వులు, మంత్రివర్గం ఆమోదం లేకుండా అసైన్డ్ భూములు లాక్కోవడానికి కుట్ర ప న్నడం ఉద్దేశపూర్వకంగా చేసిందా? అనే అంశాన్నీ పోలీ సులు పరిగణనలోకి తీసుకుని శివానందరెడ్డిని ప్రశ్నించారు. ఆయన నుంచి సేకరించిన సమాచారాన్ని సరిచూడాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వచ్చే వారం మరోసారి రావాలని స్పష్టం చేశారు.

కాంగ్రెస్, ఎంఐఎం మధ్య పొత్తు కుదిరింది

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని, ఓడించేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నదని మండిపడ్డారు. గురువారం పార్టీ కార్యాలయంలో కిషన్ రెడ్డి, పార్లమెంటరీబోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, ఇతరనేతల సమక్షంలో గ్రేటర్ మాజీ కార్పొరేటర్ బంగారు ప్రకాష్, చెన్నూరు ఎంపీపీ సురేఖ రామయ్య, ఎంపీటీసీలు, ఇతర నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలప్పుడు బీఆర్‌ఎస్‌కు కొమ్ముకాస్తూ ఎంఐఎం దుశ్శాసన పాత్ర పోషించిందని మండిపడ్డారు. ఎవరు అధికారంలో ఉంటే వారితో అంటకాగే పార్టీ ఎంఐఎం అని, పాతబస్తీ అభివృద్ధిని అడ్డుకున్నది ఆ పార్టీనేనని ధ్వజమెత్తారు. అక్కడి ప్రజల బతుకులను చీకటిలోనే మగ్గేలా చేస్తోందన్నారు. ఎంఐఎంకు రెండు ఎజెండాలున్నాయని.. ఒకటి తన చీకటి వ్యాపారానికి అండ కోసం ప్రభుత్వంతో ఉండటం, రెండోది బీజేపీని వ్యతి రేకించడమన్నారు. మజ్లిస్ కాళ్ల వద్ద కూర్చొని కేసీఆర్ దుర్మార్గమైన పాలన సాగించారని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. దేశ్‌కీనేత కేసీఆర్‌ను వదిలేసి, ఆ పార్టీ చెంతకు చేరారని ఎద్దేవా చేశారు. మొన్నటి వరకు కేసీఆర్ ఫ్యామిలీ, ఒవైసీ ఫ్యామిలీ కలిసి ఉంటే.. ఇప్పుడు సోనియా ఫ్యామిలీ ఒవైసీ ఫ్యామిలీగా మారిపోయిందన్నారు. మజ్లిస్‌కు భయపడి చెంగిచర్ల దాడి నిందితులపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. హైదరాబాద్ ఎంపీగా అసదుద్దీన్ ఓడిపోవద్దని కాంగ్రెస్ డిసైడ్ అయ్యిందని, తనకు ఇష్టం లేకపోయినా ఆయన్ను గెలిపించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ ఇటీవల చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలో స్టోరీ పాతదేనని, అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాత్రలు మారాయని కిషన్‌రెడ్డి చెప్పారు ఈ సమావేశంలో అమర్‌సింగ్, డా.ఎస్.గౌతమ్‌రావు, నూనె బాలరాజ్, అట్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోంది

- మంద కృష్ణమాదిగ



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంద కృష్ణమాదిగ

భానుపురి (సూర్యాపేట): పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క స్థానాన్ని కూడా కేటాయించకపోవడం ముమ్మాటికీ ద్రోహమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం సూర్యాపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు పార్లమెంటు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో రెండు స్థానాలను, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మాదిగలకు సీఎం అవకాశాలు ఇవ్వడం లేదని, ఈ విషయాన్ని ప్రశ్నిస్తే తమపై అవాకులు చెవాకులు మాట్లాడిస్తున్నారని అన్నారు. అనంతరం సూర్యాపేట పట్టణంలోని ఎంజీరోడ్డులో పూలే విగ్రహానికి కృష్ణమాదిగ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఫోన్ బాగు చేయించలేదని యువతి ఆత్మహత్య



సాయిషుమా

జైపూర్: సెల్‌ఫోన్ బాగు చేయించమని తల్లిదండ్రులను అడిగితే నిరాకరించారని ఓ యువతి ఆత్మహత్య చేసు కుంది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేలాల గ్రామానికి చెందిన ప్యాగ సారక్క, స్వామి దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కూతురు సాయిషుమా (19) మంచిర్యాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్ పాడైపోవడంతో బాగు చేయించమని అడిగింది. దీంతో తరచూ సెల్‌ఫోన్ పాడు చేస్తున్నావని తల్లి మందలించింది. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులు బాగాలేవని, కొద్ది రోజుల తర్వాత బాగు చేయిస్తామని చెప్పింది. 'అన్న అడిగితే బాగు చేయిస్తారు కానీ తాను అడిగితే మాత్రం ఏమీ చెయ్యరు' అంటూ సాయిషుమా మనస్తాపం చెందింది. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లోనే ఉరేసుకుంది. కాసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కిందికి దించినా అప్పటికే మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు.

దిద్దుబాటుపై గులాబీదళం గురి

▶ మొదటి పేజీ తరువాయి

పలువురు జిల్లా పరిషత్, మున్సిపల్ చైర్మన్లతో పాటు గ్రేటర్ హైదరాబాద్ మేయర్, మాజీ మేయర్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. మొత్తంగా పార్టీలో కీలక పదవులు అనుభవించిన సుమారు 150కి పైగా ముఖ్య నేతలు ఏడాది కాలంలో పార్టీకి దూరమైనట్లు అంచనా. వీరిలో రాజ్యసభ ఎంపీ కె.కేశవరావు, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మాజీ మంత్రులు పట్నం మహేందర్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ఎంపీలు రంజిత్‌రెడ్డి, బీబీ పాటిల్, పసునూరి దయాకర్, నేతకాని వెంకటేశ్, పి.రాములు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్‌రావు తదితరులు ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి వెళ్లిన వారే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల టికెట్లు దక్కించుకోవడం గమనార్హం. అయితే నేతలు పార్టీని వీడే క్రమంలో కొందరు అనుచరగణాన్ని కూడా వెంట బెట్టుకు వెళ్తుండటంతో కింది స్థాయిలో అక్కడక్కడా కొంత గందరగోళం ఏర్పడింది.

సమన్వయానికి పెద్దపీట

కీలక పదవులు అనుభవించిన నేతలు కూడా పార్టీని వీడుతుండటాన్ని బీఆర్‌ఎస్ సీరియస్‌గా తీసుకుంది. దిద్దుబాటు చర్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో.. వలసల ప్రభావం ప్రచార పర్వం, గెలుపు అవకాశాలపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించింది. అందులో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను లేదా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వర్ధన్నపేట, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ హుజూర్‌నగర్‌లో పార్టీ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. భద్రాచలం, ముధోల్, ఖైరతాబాద్‌లో నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేశారు. మరోవైపు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లకు కూడా సమన్వయకర్తలను నియమిస్తున్నారు. చేవెళ్ల, మల్కాజిగిరి, నాగర్‌కర్నూలు లోక్‌సభ నియోజకవర్గాల పరి ధిలో ఇప్పటికే సమన్వయకర్తలను నియమించగా, ఇతర సెగ్మెంట్లకు సంబంధించిన జాబితా త్వరలో విడుదల చేయనున్నారు. పార్టీ నేతలు, యంత్రాంగం నడుమ సమన్వయానికి పెద్దపీట వేయడం ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కించేందుకు బీఆర్‌ఎస్ అధిక ప్రాధాన్యతను ఇస్తోంది.

జస్టిస్ రామలింగేశ్వర్‌రావుకు కన్నీటి వీడ్కోలు



జస్టిస్ రామలింగేశ్వర్‌రావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ పుల్లా కార్తీక్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావుకు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు గురువారం కన్నీటి వీడ్కోలు పలికారు. జర్మనీలో ఉంటున్న కూతురుని చూసేందుకు వెళ్లిన ఆయన గుండెపోటుతో అక్కడే గతవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయం జర్మనీ నుంచి సత్వరం తెలంగాణకు తరలేందుకు ఏపీ ప్రభుత్వం చొరవ చూపింది. న్యాయమూర్తులు జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ లక్ష్మీనారాయణ, మాజీ అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) సూర్యకరణ్‌రెడ్డి, మాజీ ఏజీ బీఎస్.ప్రసాద్ తదితరులు రాయదుర్గంలోని ఆయన స్వగృహంలో పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవుల రక్షణ, చెంచుల హక్కుల కోసం రామలింగేశ్వర్‌రావు న్యాయవాదిగా వాదించిన కేసు దేశమంతటా 'సమత' కేసుగా ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఈ పిటిషన్ దాఖలు చేసిన 'శక్తి'సంస్థ శివరామకృష్ణ మాట్లాడుతూ.. తాము ఇద్దరం కృష్ణార్జునుల్లా ఈ కేసులో పోరాటం చేశామని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయడానికి ఆయన కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఉదయం 11 గంటల తర్వాత మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఈపీఎఫ్‌ఓ చందాదారుల వేతన పరిమితి పెంపు!

- రూ.15 వేల నుంచి రూ.21 వేలకు పెంచే యోచన
- కేంద్ర కార్మిక శాఖ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) పరిధిలోని చందాదారుల గరిష్ట వేతన పరిమితిని రూ.21 వేలకు పెంచేందుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కార్మిక సంఘాలు, అనుబంధ సంస్థలు ఇందుకోసం గత కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో వేతన పరిమితి పెంపుతో జరిగే పరిణామాలపై కేంద్ర కార్మిక శాఖ ప్రాథమిక కసరత్తుకు ఉపక్రమించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈపీఎఫ్ చందాదారుడి గరిష్ట వేతన పరిమితి రూ.15 వేలుగా ఉంది. 2014కు ముందు ఇది రూ.6,500 కాగా.. అప్పటి ప్రభుత్వం ఈ పరిమితిని రూ.15 వేల వద్ద ఫిక్స్ చేసింది. ఈపీఎఫ్‌ఓ ఫార్ములా ప్రకారం ఒక ఉద్యోగికి భవిష్యనిధి చందా కింద 12 శాతం యాజమాన్యం చెల్లిస్తుండగా, మరో 12 శాతం ఉద్యోగి వేతనం నుంచి చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని (పెన్షన్ మినహా) ఉద్యోగి పదవీ విరమణ సమయంలో వడ్డీతో సహా ఈపీఎఫ్‌ఓ తిరిగి ఇచ్చేస్తుంది.

ఉద్యోగికి లాభం..యాజమాన్యాలపై భారం

చందాదారుడి గరిష్ట వేతన పరిమితి పెంపుతో ఉద్యోగికి లాభం కలగనుండగా.. అధిక చెల్లింపుల భారం యాజమాన్యాలపై పడనుంది. ప్రస్తుత ఫార్ములా ప్రకారం ఉద్యోగి గరిష్ట వేతన పరిమితి రూ.15 వేలు కాగా అందులో 12 శాతాన్ని (రూ.1800) యాజమాన్యం సదరు ఉద్యోగి ఈపీఎఫ్‌ఓ ఖాతాకు బదిలీ చేస్తుంది. ఇందులో నుంచి 8.33 శాతం(రూ.1250) పెన్షన్ ఖాతాకు బదిలీ అవుతుండగా... మిగతా 3.67 శాతం (రూ.550) మొత్తం భవిష్యనిధి ఖాతాలో జమ అవుతుంది. దీనికి సమానంగా ఉద్యోగి వేతనం నుంచి 12 శాతం (రూ.1800) భవిష్యనిధి ఖాతాలో జమ చేస్తారు. తాజాగా ఉద్యోగి వేతన పరిమితి రూ.21 వేలకు పెంచితే ఇందులోని 12 శాతం (రూ.2520) యాజమాన్యం చెల్లించాల్సి వస్తుంది. ఈ లెక్కన ఉద్యోగి పెన్షన్ ఖాతాలో రూ.1790, భవిష్య నిధి ఖాతాలో రూ.730 జమ అవుతాయి. దీనికి సమానంగా ఉద్యోగి వేతనం నుంచి రూ.2520 భవిష్యనిధి ఖాతాలో జమ చేస్తారు. ప్రస్తుతం ఈఎస్‌ఐ చట్టం కింద చందాదారుడి గరిష్ట వేతన పరిమితి రూ.21 వేలుగా ఉంది. రూ.21 వేలు దాటిన వారు ఈఎస్‌ఐ పరిధిలోకి రారు. ఈఎస్‌ఐ గరిష్ట వేతన పరిమితి 2016కు ముందు రూ.15 వేలు ఉండగా.. కేంద్ర ప్రభుత్వం దీన్ని రూ.21 వేలకు పెంచింది. ఈ తరహాలోనే ఈపీఎఫ్‌ఓ కూడా వేతన పరిమితిని రూ.21 వేలకు పెంచే యోచనలో ఉందని ప్రాథమిక సమాచారం. కాగా ఇందుకు సంబంధించి ఈపీఎఫ్‌ఓ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.


రేపు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

ఎవరికి దక్కుతాయన్నది హాట్‌టాపిక్‌గా మారింది. ఖమ్మం టికెట్ ఇవ్వాలంటూ.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన సతీమణి కోసం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన సోదరుడి కోసం, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తన కుమారుడి కోసం ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. వీరితోపాటు అదే జిల్లాకు చెందిన ఓ వ్యాపారవేత్త కూడా తన వంతు ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావుతోపాటు మరో ఇద్దరు బీసీ నేతల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు కరీంనగర్ ఎంపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, తీన్మార్ మల్లన్న పోటీపడుతున్నారు. ఇక హైదరాబాద్ ఎంపీ స్థానంలో అలీ మస్కతీ పోటీ చేస్తారనుకున్నా.. ఆయన వెనక్కి తగ్గినట్టు తెలిసింది. దీంతో హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీఉల్లా పేరు వినిపిస్తోంది.

ఆధునిక సంస్కర్తల్లో మహోన్నతుడు పూలే

- బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు



సాక్షి,హైదరాబాద్: సంస్కరణలతో చైతన్యవంత సమాజ నిర్మాణానికి మహాత్మ జ్యోతిబా పూలే బాటలు వేశారని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. పూలే 198వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...స్త్రీ విద్య వ్యాప్తి, అంటరానితనం నిర్మూలన, స్వేచ్ఛ, సమానత్వం సాధించే దిశగా పూలే కృషి, సాధించిన ఫలితాలు చరిత్ర పుటల్లో సుస్థిరంగా ఉంటాయన్నారు. సామాజికవేత్తలకు, ఉద్యమ నాయకులకు, ప్రభుత్వాలకు ఆయన సేవలు ఎప్పటికీ స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న షబ్బీర్ అలీ కుటుంబ సభ్యులు. చిత్రంలో దానం నాగేందర్ తదితరులు

షబ్బీర్ అలీ నివాసంలో సీఎం, మంత్రుల రంజాన్ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు షబ్బీర్ అలీ నివాసంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి స్వయంగా షబ్బీర్ అలీ నివాసానికి చేరుకుని వారి కుటుంబసభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నేతలు మధుయాష్కీ, ఫిరోజ్ ఖాన్ తదితరులు షబ్బీర్ అలీ నివాసానికి చేరుకుని రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు.

రథోత్సవంలో సీఎం సతీమణి

- కొడంగల్ వెంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాల సమర్పణ



కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయఅర్చకులు, ధర్మకర్తలు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె రథోత్సవంలో పాల్గొన్నారు.

సమ్మర్.. కాస్త కూల్!

▶ మొదటి పేజీ తరువాయి



గాలులు వీయగా, గురువారం కూడా దాదాపుగా అలాంటి వాతావరణమే కొనసాగింది. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. సగటున 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కావడం గమనార్హం. గురువారం రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత నల్లగొండలో 39 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 20.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఆదిలాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 9.6 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కావడం గమనార్హం. కాగా మరో రెండ్రోజులు ఇలాంటి వాతావరణమే ఉంటుందని వాతావరణ శాఖ సూచిస్తోంది.

తేలికపాటి నుంచి మోస్తరు వానలు: రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు మరఠ్వాడ నుంచి మధ్య మహారాష్ట్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఇది సముద్రమట్టం నుంచి సగటున 1.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఉష్ణోగ్రతల్లో క్షీణత చోటు చేసుకుందని తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు.. ఒకట్రెండు చోట్ల మోస్తరు వర్షాలు కూడా కురవొచ్చని సూచించింది. కొన్ని జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వివరించింది. ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది.

గురువారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	30.5	20.2
భద్రాచలం	37.4	25.5
దుండిగల్	35.5	24.5
హకీంపేట్	35.2	22.7
హనుమకొండ	36.5	24.0
హైదరాబాద్	35.6	25.2
ఖమ్మం	39.2	23.6
మహబూబ్‌నగర్	38.8	26.6
మెదక్	38.2	23.0
నల్లగొండ	39.0	23.4
నిజామాబాద్	37.6	23.9
రామగుండం	34.2	25.6

మరాఠా గడ్డపై మహా పోరు!

హోరాహోరీ తలపడుతున్న బీజేపీ, కాంగ్రెస్ కూటములు

2019లో ఎన్డీఏ క్లీన్‌స్వీప్
48 స్థానాల్లో 41 కైవసం
ఈసారి అఘాడీ గట్టి పోటీ


ఏక్‌నాథ్ షిండే


అజిత్ పవార్


దేవేంద్ర ఫడ్నవీస్


ఉద్ధవ్ ఠాక్రే


శరద్ పవార్


నానా పటోలే



ఎన్నికల తేదీలు
ఏప్రిల్ 19, 26, మే 7, 13, 20

మరాఠా గడ్డపై ఈసారి ఎన్నికలు మరింత రసవత్తరంగా మారాయి. పొత్తుకు పై పొత్తు అన్నట్లుగా ఏ పార్టీ ఎప్పుడు ఏ కూటమిలో ఉంటుందో తెలియని ట్విస్టులతో మహారాష్ట్రలో రాజకీయం నానా మలుపులు తిరుగుతోంది. శివసేన, దిగ్గజ నేత శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) పగ్గాలు చీలిక వర్గాల చేతికి వెళ్లడంతో కొత్త పొత్తులు పొడుస్తున్నాయి. ఆ రెండు పార్టీలతో రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లోనూ వాటితో కలిసే కూటమిగా పోటీ చేస్తోంది. మరో పక్క, ఉద్ధవ్ శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్ పవార్)తో సహా చిన్నాచితకా పార్టీలు జట్టు కట్టి రంగంలోకి దిగాయి...

48 లోక్‌సభ స్థానాలున్న మహారాష్ట్ర సీట్లపరంగా ఉత్తరప్రదేశ్ తర్వాత రెండో అతి పెద్ద రాష్ట్రం. ఇక్కడి రాజకీయాలు ఎక్కువగా స్థానికాంశాల చుట్టూనే తిరుగుతుంటాయి. ఎన్నికల వేళ అనూహ్య రాజకీయ మార్పులూ పరిపాటే. ఏ పార్టీ కూడా ఒంటిచేత్తో మెజారిటీ స్థానాలు దక్కించుకున్న దాఖలాలు పెద్దగా లేవు.

రెండేళ్లలో అంతా తలకిందులు

పొత్తు రాజకీయాలకు పేరొందిన మహారాష్ట్రలో గడిచిన రెండేళ్లలో రాజకీయాలు శరవేగంగా మారిపోయాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వాములుగా పోటీ చేసిన బీజేపీ, శివసేన ఏకంగా 41 స్థానాలు కైవసం చేసుకున్నాయి. బీజేపీ 25 స్థానాల్లో పోటీ చేసి 23 సీట్లు దక్కించుకోగా, శివసేన 23 చోట్ల పోటీ చేసి 18 సీట్లను కైవసం చేసుకుంది. కాంగ్రెస్, ఎన్సీపీ మరో రెండు ప్రాంతీయ పార్టీలను కలుపుకొని బరిలోకి దిగినా ప్రభావం చూపలేకపోయాయి. కాంగ్రెస్ 25 స్థానాల్లో పోటీ చేసి ఒక్క చోటే గెలిచింది. ఎన్సీపీ 19 చోట్ల అభ్యర్థులను నిలబెట్టి 4 సీట్లతో సరిపెట్టుకుంది. ఇతర పార్టీలు ఎన్డీఏ సునామీలో కొట్టుకుపోయాయి. ఇప్పుడు శివసేన, ఎన్సీపీ రెండుగా చీలిపోయాయి. ఒకటి ఎన్డీఏలో, మరోటి మహాకూటమి పంచన చేరాయి. 48 లోక్‌సభ స్థానాల్లో 5 సీట్లు ఎస్సీలకు, 4 ఎస్టీలకు కేటాయించారు.

అధికార కుమ్ములాటలు

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీజేపీ, శివసేన కలిసి పోటీ చేసి మెజారిటీ సాధించాయి. మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) పేరిట కలిసి బరిలో దిగిన కాంగ్రెస్, ఎన్సీపీ ప్రతిపక్షానికి పరిమితయ్యాయి. అధికార పంపకంపై బీజేపీ, శివసేన కుమ్ములాట చివరికి కూటమి నుంచి సేన వైదొలిగేందుకు దారితీసింది. శివసేనకు ఎంవీఏ సీఎం పదవి ఆఫర్ చేయడంతో అది కూటమిలో చేరింది. పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తొలిసారి సీఎం పగ్గాలు చేపట్టారు. 100కు పైగా సీట్లను దక్కించుకున్నా అధికారం దక్కకపోవడంతో బీజేపీ అదను చూసి శివసేనకు షాకిచ్చింది. శివసేన నేత ఏక్‌నాథ్ షిండే మెజారిటీ ఎమ్మెల్యేలను చీల్చి వేరుకుంపటి పెట్టుకున్నారు. ఆయన సీఎంగా బీజేపీ–శివసేన సంకీర్ణ సర్కారు ఏర్పాటు చేసింది. శివసేన పార్టీ, గుర్తు షిండే వర్గానికే దక్కాయి. అటు ఎన్సీపీలోనూ అజిత్ పవార్ తిరుగుబావుటా ఎగరేశారు. ఎమ్మెల్యేలను చీల్చి అధికార సంకీర్ణంలో చేరి డిప్యూటీ సీఎం అయ్యారు. ఎన్సీపీ పేరు, గుర్తు కూడా అజిత్ వర్గానికే దక్కడంతో శరద్ పవార్ కొత్త పేరు, గుర్తుతో పోటీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది!

'మహా'యుతి కూటమి

బీజేపీ, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి కూటమి బలంగా కన్పిస్తోంది. శివసేన (ఉద్ధవ్), ఎన్సీపీ (శరద్ పవార్) కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమిలో ఉన్నాయి. అయోధ్య రామ మందిరం సాకారం, అభివృద్ధి నినాదాలతో బీజేపీ ప్రచారం సాగిస్తోంది. మోదీ కేబినెట్లో రెండు విడతల్లోనూ మంత్రి పదవి దక్కించుకున్న మిత్రపక్షం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) షిర్డీ లోక్‌సభ సీటు డిమాండ్ చేస్తోంది. దాన్ని తమ సిట్టింగ్ ఎంపీకే కేటాయించాలని సీఎం షిండే పట్టుబడుతున్నారు. షిర్డీ నుంచి తాను పోటీ చేసినా, చేయకపోయినా ఎన్డీఏతోనే ఉంటానని ఆర్పీఐ చీఫ్ రాందాస్ అథవాలే ప్రకటించారు. ఆయనకున్న ఓటు బ్యాంకు చాలా స్థానాల్లో కూటమికి కలిసొస్తుందని భావిస్తున్నారు. ఎన్డీఏ కూటమి సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. బీజేపీ దాదాపు 30 సీట్లలో పోటీ చేయాలని భావిస్తోంది. కానీ ఎన్సీపీ 10, శివసేన 18 సీట్లు కోరుతున్నాయి. ఇప్పటిదాకా బీజేపీ 24, శివసేన 8, ఎన్సీపీ 3 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. గత ఎన్నికల్లో మహారాష్ట్రలో 7 శాతం ఓట్లు సాధించిన అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్ సారథ్యంలోని బహుజన్ అఘాడీ కూడా బీజేపీతో సీట్ల బేరం సాగిస్తోంది. మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే కూడా తాజాగా మోదీకి జై కొట్టారు. ఈ ఎన్నికల్లో మహాయుతి కూటమికి బేషరతుగా మద్దతు ప్రకటించారు!

స్టేట్ స్కాన్

మాటల యుద్ధం

ఎన్నికల ప్రచారం జోరందుకుంటున్న కొద్దీ నేతల మాటల్లో వాడి, వేడి కూడా పెరుగుతోంది. ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే బీజేపీకి బేషరతు మద్దతు ప్రకటించడాన్ని కాంగ్రెస్ నేత విజయ్ వడెట్టివార్ తప్పుబట్టారు. 'రాజ్ ఠాక్రే బీజేపీ ముందు మరీ ఇలా సాగిలపడిపోతారనుకోలేదు. పులి కాస్త గొర్రెలా మారింది. ఠాక్రే వంటి పోరాట యోధుడు బానిసగా మారారు. అతను బీజేపీకి మద్దతు ప్రకటించినా ఎన్నికల్లో మా విపక్ష ఎంవీఏ కూటమిపై ఎలాంటి ప్రభావం ఉండదు' అని విజయ్ పేర్కొన్నారు. కాగా, బుధవారం నాగ్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టారు. 'సర్వేలన్నీ ఎన్డీఏ బంపర్ విజయం ఖాయమంటున్నాయి. ప్రతిపక్షాలు నాపై చేస్తున్న విమర్శలు, దూషణలతో మా బలం మరింత పెరుగుతోంది. 'అబ్‌కీ బార్ 400 పార్' ట్రెండ్ బలపడుతోంది' అని స్పష్టం చేశారు. బీజేపీ తరఫున డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వంటి నేతలు ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. కాగా, రెండు నెలల క్రితం కాంగ్రెస్‌ను వీడిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ కూడా బీజేపీ స్టార్ క్యాంపెయినర్లలో ఉండటం విశేషం. ఆయనకు బీజేపీ రాజ్యసభ సీటు కట్టబెట్టింది. మరోపక్క, కాంగ్రెస్ ప్రచారంలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే దన్నుగా నిలుస్తున్నారు.

సర్వేల సంగతేంటి?

సర్వేల్లో మహారాష్ట్రపై మిశ్రమ అంచనాలు వెలువడుతున్నాయి. కొన్ని అధికార మహాయుతి కూటమికే మెజారిటీ సీట్లు కట్టబెట్టగా మరి కొన్ని ఎంవీఏ భారీగా పుంజుకుని పైచేయి సాధిస్తుందంటున్నాయి. తాజా సర్వే ఒకటి ఎంవీఏ కూటమికి ఏకంగా 26 స్థానాలు అంచనా వేయడంతో కాంగ్రెస్ తదితర విపక్షాల్లో ఉత్సాహం నెలకొంది.

- సాక్షి నేషనల్ డెస్క్

'ఇండియా' పైచేయి సాధించేనా?

ప్రతిపక్ష ఎంవీఏ కూటమిలో ఎట్టకేలకు సీట్ల పంపకం కొలిక్కి వచ్చింది. శివసేన (ఉద్ధవ్) 21 సీట్లు, కాంగ్రెస్ 17 స్థానాలు, ఎన్సీపీ (శరద్ పవార్) 10 స్థానాల చొప్పున పంచుకున్నాయి. ఎన్సీపీ, శివసేన ఓటు బ్యాంకు తమతోనే ఉందని ఎంవీఏ చెబుతోంది. కాంగ్రెస్ 6 న్యాయాలు, 25 గ్యారంటీలతో కూడిన మేనిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తోంది. మహాయుతి కూటమికి ఎంవీఏ గట్టి పోటీ ఇస్తున్నట్టు కన్పిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్న నేపథ్యంలో మహారాష్ట్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఎన్నికల విచిత్రం



ప్రచారంలో భాగంగా గురువారం రోడ్డుపక్కనే భోజనం చేస్తున్న జమ్మూ–రియాసీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి జుగల్ కిశోర్ శర్మ

డ్రీమ్ గర్ల్ హేమమాలిని (బీజేపీ) తన నియోజకవర్గం మథురలో గురువారం ఇలా చేలోకి దిగి గోధుమ పంట కోతల్లో పాలుపంచుకున్నారు.



'మూడో విడత'కు నేడు నోటిఫికేషన్

- ఈనెల 19 వరకు నామినేషన్లకు అవకాశం
- 12 రాష్ట్రాల్లోని 94 లోక్‌సభ స్థానాల్లో మే 7న పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక సమరంలో మూడో విడత ఎన్నికల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. మూడో విడతలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 94 లోక్‌సభ స్థానాల్లో మే 7వ తేదీన పోలింగ్ జరగనుంది. వీటితోపాటు అభ్యర్థి మృతితో రెండో విడతలో వాయిదా పడిన మధ్యప్రదేశ్‌లోని బేతుల్ లోక్‌సభ నియోజకవర్గానికి మే 7నే పోలింగ్ ఉంటుంది. శుక్రవారం మూడో విడత ఎన్నికల ప్రక్రియకు నోటిఫికేషన్ వచ్చాక నామినేషన్ల ప్రక్రియ మొదలుకానుంది. ఈ 94 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19 వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 20న ఉంటుంది. మూడో విడతలో అస్సాం, బిహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌తదితర రాష్ట్రాల్లో మే 7న ఎన్నికలు జరుగనున్నాయి. గుజరాత్‌లోని విజాపూర్, ఖంభట్, వఘోడియా, మానవదర్, పోర్‌బందర్ అసెంబ్లీ స్థానాలతో పాటు, పశ్చిమబెంగాల్‌లోని భగవాన్‌గోలా, కర్ణాటకలోని షోరాపూర్ (ఎస్టీ) అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక పోలింగ్ జరుగనుంది.

బీజేపీలో చేరిన రోహన్ గుప్తా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి రోహన్ గుప్తా బీజేపీలో చేరారు. గురువారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. ఐఏఎస్ మాజీ అధికారి పరంపల్ కౌర్, ఆమె భర్త, శిరోమణి అకాలీదళ్ సీనియర్ నేత సికందర్ బీజేపీలో చేరారు. జాతీయవాదం, సనాతన ధర్మం వంటి అంశాలపై సంప్రదాయ వైఖరి నుంచి వైదొలిగిన కాంగ్రెస్ పార్టీ విశ్వసనీయతను కోల్పోయిందని గుప్తా పేర్కొన్నారు.

స్పైవేర్ దాడులు జరగొచ్చు

మరోమారు యూజర్లను హెచ్చరించిన యాపిల్ సంస్థ

న్యూఢిల్లీ: ప్రభుత్వ మద్దతున్న సైబర్ నేరగాళ్లు మీ ఐఫోన్ తదితర యాపిల్ ఉత్పత్తులపై సైబర్‌దాడులు చేయొచ్చని గతంలో హెచ్చరించి తీవ్ర చర్చకు తెరలేపిన యాపిల్ సంస్థ తాజాగా మరోమారు అలాంటి హెచ్చరికనే చేసింది. పెగాసస్ తరహా అత్యంత అధునాతనమైన స్పైవేర్ దాడులు కీలకమైన పాత్రికేయులు, కార్యకర్తలు, రాజకీయవేత్తలు, దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకుని జరగొచ్చని యాపిల్ ఏప్రిల్ పదో తేదీ ఒక 'థ్రెట్' నోటిఫికేషన్‌లో పేర్కొంది. ''కొనుగోలుచేసిన అధునాతన స్పైవేర్‌తో సైబర్ దాడులు జరిగే అవకాశాలను ముందే పసిగట్టి యూజర్లకు సమాచారం ఇవ్వడం, వారిని అప్రమత్తం చేయడం కోసం థ్రెట్ నోటిఫికేషన్లను రూపొందించాం. సాధారణ సైబర్‌నేరాల కంటే ఈ దాడులు చాలా సంక్లిష్టమైనవి. అత్యంత తక్కువ మందినే లక్ష్యంగా చేసుకుంటారు కాబట్టి ఎవరిపై, ఎందుకు దాడి చేస్తారో చెప్పడం కష్టం. అయితే దాడి జరిగే అవకాశాన్ని మాత్రం ఖచ్చితంగా అంచనావేసి ముందే యూజర్లను అప్రమత్తం చేస్తాం'' అని థ్రెట్ నోటిఫికేషన్‌లో యాపిల్ హెచ్చరించింది. సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధమవుతున్న భారత్‌సహా 60 దేశాల్లోని యూజర్లకు యాపిల్ ఈ నోటిఫికేషన్లు పంపించింది. ఇజ్రాయెల్ తయారీ పెగాసస్ స్పైవేర్ సాయంతో మొబైల్ ఫోన్‌కు వాట్సాప్ ద్వారా మిస్డ్‌కాల్ ఇచ్చి కూడా ఆ ఫోన్‌ను సైబర్‌నేరగాళ్లు తమ నియంత్రణలోకి తెచ్చుకోవచ్చు. ''ఎవరైనా యూజర్‌ను సైబర్‌నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటే ముందే గుర్తించి ఆ యూజర్‌ను హెచ్చరిస్తాం. ఐఫోన్‌ను సైబర్‌భూతం నుంచి కాపాడాలంటే దానిని లాక్‌డౌన్ మోడ్‌లో పెట్టుకోవచ్చు. అప్పుడు ఆ ఫోన్‌లో ఫింగర్‌ప్రింట్ సెన్సార్, ఫేషియల్ రికగ్నిషన్, వాయిస్ రిగ్నిషన్ ఏవీ పనిచేయవు. ఒకవేళ మనమే మళ్లీ వాడుకోవాలంటే పిన్ లేదా పాస్‌కోడ్ లేదా ప్యాట్రన్ సాయంతోనే మళ్లీ ఫోన్‌ను పనిచేసేలా చేయొచ్చు'' అని యాపిల్ సూచించింది. ఒక సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 49 శాతం సంస్థలు తమ ఉద్యోగుల డివైజ్‌లపై సైబర్ దాడులు/ఉల్లంఘన ఉదంతాలను పసిగట్ట లేకపోతున్నాయి. భారత్‌లో లెక్కిస్తే మొబైల్ మాల్‌వేర్ సాయంతో సగటు వారానికి 4.3 శాతం సంస్థలపై సైబర్ దాడులు జరుగుతున్నాయి. అదే ఆసియాపసిఫిక్ ప్రాంతంలో అయితే గత ఆరు నెలల్లో సగటును 2.6 శాతం సంస్థలపై సైబర్ దాడులు చోటుచేసుకున్నాయి.


రిషికేశ్‌లో ఎన్నికల ర్యాలీలో ఢమరుకం మోగిస్తున్న ప్రధాని మోదీ

ఉగ్రవాదులకు చావుదెబ్బ: మోదీ

రిషికేశ్/జైపూర్: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఉగ్రవాదులు చావుదెబ్బ తిన్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ముష్కర మూకలను మన భద్రతా దళాలు వారి సొంత గడ్డపైనే మట్టుబెట్టాయని పేర్కొన్నారు. ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కారు(మరోసారి మోదీ ప్రభుత్వం) అనే నినాదం దేశమంతటా ప్రతిధ్వనిస్తోందని అన్నారు. స్థిరమైన ప్రభుత్వం వల్ల కలిగే లాభాలను ప్రజలు ప్రత్యక్షంగా చూశారని తెలిపారు. గురువారం ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో, రాజస్తాన్‌లోని కరౌలీలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. బహిరంగ సభల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గతంలో కేంద్రంలో బలహీన, అస్థిర ప్రభుత్వాలు ఉన్నప్పుడు ఉగ్రవాదులు చెలరేగిపోయారని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక తోక ముడిచారని వ్యాఖ్యానించారు. దేశాన్ని లూటీ చేయకుండా అవినీతిపరులను అడ్డుకున్నానని, అందుకే వారంతా తనను దూషిస్తున్నారని ఆక్షేపించారు.

వీరి బాధలు ఎవరికీ పట్టట్లేవు

రైతులు, నిరుద్యోగులనుద్దేశించి రాహుల్ వ్యాఖ్య

జైపూర్: తమను కష్టాల నుంచి గట్టెక్కించాలని రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు ఎంత మొత్తుకున్నా బాధలను మోదీ సర్కార్ పట్టించుకోవట్లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గురువారం రాజస్తాన్‌లోని బికనీర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అనూప్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. '' తమ పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని రైతులు డిమాండ్‌చేస్తున్నారు. ఉపాధి కల్పించాలని నిరుద్యోగ యువత విన్నపాలు చేస్తోంది. నిత్యా వసరాల ధరల నుంచి ఉపశమనం కల్పించాలని మహిళలు వేడుకుంటున్నా వీళ్ల గోడు ఎవరికీ పట్టదు'' అని రాహుల్ అన్నారు. '' వెనుకబడిన వర్గాలు, దళితులు, గిరిజనులు, జనరల్ కేటగిరీలో ఉన్న పేదల అభ్యున్నతి కోసమే ఈ ఎన్నికలు. నిరుద్యోగమే దేశంలో అతిపెద్ద సమస్య. ద్రవ్యోల్బణం రెండో సమస్య. దేశంలో 90 శాతం మంది ఇవే చెబుతారు. కానీ ఒకవేళ కేంద్రంలో బీజేపీ చెప్పుచేతల్లో ఉన్న జాతీయమీడియాను ఫాలో అయితే మాత్రం మనకు అంబానీ కుమారుల పెళ్లివేడుకే దేశంలో అతిపెద్ద చర్చనీయాంశంగా కనిపిస్తుంది. మోదీ ఓసారి సాగరగర్భంలోకి వెళ్తారు, మరోసారి గస్తీవిమానంలో చక్కర్లు కొడతారు, మరోసారి డప్పు వాయిస్తూ కనిపిస్తారు, ఇంకోసారి సభలో మొబైల్ ఫ్లాష్‌లైట్లు వెలిగించాలని పిలుపునిస్తూ కనిపిస్తారు. జాతీయ మీడియాలో 24 గంటలూ మోదీ ముఖమే దర్శనమిస్తుంది'' అని ఎద్దేవాచేశారు.



కేజ్రీవాల్ ప్రైవేట్ సెక్రటరీ తొలగింపు

న్యూఢిల్లీ: సీఎం కేజ్రీవాల్ ప్రైవేట్ సెక్రటరీ బిభవ్ కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వ విజిలెన్స్ డైరెక్టరేట్ తెలిపింది. ఆయన నియామకం నియమ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని పేర్కొంది. మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు సంస్థలు బిభవ్ కుమార్ పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపింది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్(టెంపరరీ సర్వీస్) నిబంధనలు–1965 ప్రకారం బిభవ్ కుమార్‌ను సీఎం కేజ్రీవాల్ ప్రైవేట్ సెక్రటరీ విధుల నుంచి తొలగిస్తున్నట్లు వివరించింది. ఈ పరిణామంపై అధికార ఆప్ స్పందించలేదు.

చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్సు 6గురు విద్యార్థులు మృతి

మరో 20 మంది చిన్నారులకు గాయాలు

చండీగఢ్: విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూలు బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. 20 మంది తీవ్ర గాయాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. హరియాణాలోని మహేంద్రగఢ్ జిల్లా ఉన్హాని గ్రామ సమీపంలో గురువారం ఉదయం ఈ ఘోరం జరిగింది. బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. రంజాన్ సెలవైనప్పటికీ స్కూలు యాజమాన్యం తరగతుల నిర్వహణపై దర్యాప్తు ప్రారంభించారు.

లోయలో పడిన బస్సు 17 మంది మృత్యువాత

కరాచీ: పాకిస్తాన్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 17 మంది మృతి చెందారు. 38 మంది గాయపడ్డారు. సింధ్, బలోచిస్తాన్ ప్రావిన్స్‌ల సరిహద్దుల్లోని హుబ్ పట్టణ సమీపంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సింధ్ ప్రావిన్స్‌లోని తట్టా పట్టణానికి చెందిన కొందరు బలోచిస్తాన్‌లోని హుబ్ పట్టణంలోని షా నూరానీ దర్గాకు బుధవారం మధ్యాహ్నం బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బస్సు రాత్రి 8 గంటల సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కన లోయలో పడిపోయింది. క్షతగాత్రులను అక్కడికి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరాచీ నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీఐ కింద ఎలక్టోరల్ బాండ్ల వివరాలు ఇవ్వలేం

ఎస్‌బీఐ వెల్లడి

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద బహిర్గతం చేసేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) నిరాకరించింది. ఇది వ్యక్తిగత సమాచారమని పేర్కొంది. సంబంధిత రికార్డులు ఎన్నికల సంఘం వెబ్‌సైట్ అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ ఆర్టీఐ కింద ఈ వివరాలు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. ఈ బాండ్లకు సంబంధించిన పూర్తి డేటాను డిజిటల్ రూపంలో ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు చట్టం కార్యకర్త లోకేశ్ బాత్రా మార్చి 13న దరఖాస్తు చేశారు.

దక్షిణ కొరియా అధ్యక్షునికి ఎదురుదెబ్బ

ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ ఘన విజయం

సియోల్: పీపుల్ పవర్ పార్టీ నేత, దక్షిణ కొరియా దేశాధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్ పరిపాలనకు రెఫరెండంగా భావిస్తున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ కూటమి ఘన విజయం సాధించింది. ఓట్ల లెక్కింపు తాజా సమాచారం ప్రకారం 300 సీట్లకుగాను విపక్షాల కూటమి 175 చోట్ల విజయం సాధించింది. అధికార పీపుల్ పవర్ పార్టీ, దాని మిత్రపక్షం కలిపి 109 చోట్ల గెలిచాయి. ప్రతిపక్షం గెలుపుతో అధ్యక్షుడిగా యూన్ సుక్‌కు కష్టాలు మొదలయ్యాయి. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ఆధిపత్యం పెరిగిన నేపథ్యంలో అధ్యక్షుడికి కొత్త సవాళ్లు ఎదురుకానున్నాయి.

ఇవేం పేర్లు బాబోయ్!

రాజకీయ పార్టీలకు గమ్మత్తైన పేర్లు


దేశవ్యాప్తంగా చాంతాడంత జాబితా

ట్వంటీ20. హైటెక్. సాఫ్. సూపర్ నేషన్. జాగ్తే రహో...



ఇవన్నీ ఏమిటా అనుకుంటున్నారా? రాజకీయ పార్టీల పేర్లు! వినడానికి చిత్రంగా ఉన్నా ఇది నిజం. మన దేశంలో ఆరు జాతీయ పార్టీలు, 57 రాష్ట్ర పార్టీలున్నాయి. వీటి పేర్లు మనం తరచూ వినేవే. వీటితో పాటు భారత్‌లో ఏకంగా 2,597 గుర్తింపు లేని రాజకీయ పార్టీలు కూడా ఉన్నాయి. వీటిలో వినడానికే గమ్మత్తైన, ఆసక్తికరమైన, పేర్లున్న పార్టీలకు కొదవ లేదు. కాకపోతే వీటిలో చాలావరకు ఎన్నికల సమయంలో తప్ప పెద్దగా తెరపైకే రావు.

పార్టీ పెట్టడం యమా ఈజీ



మన దేశంలో పార్టీ పెట్టడం సులువైన పని. రూ.10 వేలు డిపాజిట్, 100 మంది సభ్యుల మద్దతుంటే చాలు... పార్టీ పెట్టేయొచ్చు. ఏ మతాన్నో, కులాన్నో, ప్రాంతాన్నో కించపరిచేలా లేకపోతే చాలు. దాంతో దేశవ్యాప్తంగా ఇలా వేలాది పార్టీలు పుట్టుకొచ్చాయి. వాటిలో గమ్మత్తైన పేర్లకూ కొదవ లేదు. ఇండియన్ లవర్స్ పార్టీ, ఇండియన్ ఓషియానిక్ పార్టీ, లైఫ్ పీస్‌ఫుల్ పార్టీ, హోలీ బ్లెస్సింగ్ పీపుల్స్ పార్టీ, లేబర్ అండ్ జాబ్ సీకర్స్ పార్టీ, అఖిల భారతీయ భారత మాతా–పుత్రపక్ష, భారతీయ మొహబ్బత్ పార్టీ, మినిస్టీరియల్ సిస్టం అబాలిషన్ పార్టీ, ఆల్ పెన్షనర్స్ పార్టీ, తమిళ్ తెలుగు నేషనల్ పార్టీ, ఇండియన్ విక్టరీ పార్టీ, ఇంటర్నేషనల్ పార్టీ, చిల్డ్రన్ ఫస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా, చాలెంజర్స్ పార్టీ, స్వచ్ఛ భారత్ పార్టీ, సత్యయుగ్ పార్టీ, ఇన్సానియత్ పార్టీ, నేషనల్ టైగర్ పార్టీ, మర్యాదీ దళ్... ఇలా ఈ జాబితా చాంతాడును మించిపోతుంది. ప్రధాని మోదీ ఇటీవల పదేపదే ప్రస్తావిస్తున్న నారీ శక్తి పేరుతో కూడా ఒక పార్టీ ఉంది! ఆమ్ ఆద్మీ పార్టీని తలపించేలా గరీబ్ ఆద్మీ పేరుతో కూడా ఒక పార్టీ ఉంది. ఇక, ద రిలిజియన్ ఆఫ్ మ్యాన్ రివాల్వింగ్ పొలిటికల్ పార్టీ ఆఫ్ ఇండియా అనే పార్టీ పేరునైతే వీటికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు! అయితే ఈ పార్టీల్లో చాలావరకు వ్యవస్థపై తమ అసంతృప్తిని, అసహనాన్ని వ్యక్తం చేసేందుకు, ఆదర్శ సమాజ స్వప్నానికి రూపమిచ్చేందుకు వాటి వ్యవస్థాపకులు చేసిన ప్రయత్నంగా కనిపిస్తుంది.

రైట్ టు రీకాల్!

...అంటే తమకు నచ్చని ప్రజాప్రతినిధిని చట్టసభ నుంచి తప్పించే హక్కు. భారత్‌లో లేకున్నా చాలా దేశాల్లో ఈ హక్కుంది. కాకపోతే యూపీలో రాకేశ్ సూరి అనే 42 ఏళ్ల కంప్యూటర్ ఆపరేటర్ ఈ పేరుతో ఏకంగా పార్టీయే పెట్టారు. హామీలు నెరవేర్చని ప్రజాప్రతినిధులను రీకాల్ చేసే ప్రతిపాదనపై పౌరులకు అవగాహన కల్పించడమే ఆయన లక్ష్యమట. అన్నట్టూ, ఈ లోక్‌సభ ఎన్నికల్లో గాజియాబాద్ నుంచి ఆయన పోటీ కూడా చేస్తున్నారు! యూపీలో ఇలాంటి భిన్నమైన పేర్లతో కూడిన పార్టీలకు కొదవ లేదు. సచ్ సే అచ్ఛీ అనే పార్టీ కూడా అక్కడ ఉనికిలో ఉంది. తొలుత దీని పేరు ఇస్లామిక్ డెమొక్రటిక్ పార్టీ. మతపరమైనదిగా ఉందంటూ అభ్యంతరాలు రావడంతో ఇలా మార్చేశారన్నమాట! ఆప్ కీ అప్నీ పార్టీ (పీపుల్స్), సుభాష్‌వాదీ భారతీయ సమాజ్‌వాదీ పార్టీ వంటి పార్టీలు కూడా యూపీలో ఉన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

రియల్‌ఎస్టేట్ మహిళా దిగ్గజానికి మరణశిక్ష

తీర్పు చెప్పిన వియత్నాం కోర్టు

హనోయి: తనకు వాటాలు ఉన్న బ్యాంక్‌ను మోసం చేసి ఏకంగా రూ.1 లక్ష కోట్లకుపైగా మోసానికి పాల్పడిన వియత్నాం రియల్ ఎస్టేట్ మహిళా దిగ్గజం ట్రూంగ్ మై లాన్‌కు అక్కడి సిటీ కోర్టు గురువారం మరణశిక్షను విధించింది. దేశంలోనే అతిపెద్ద ఆర్థిక మోసంగా ఈ ఉదంతం రికార్డులకెక్కింది. అక్కడి ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వాన్ థిన్ ఫాట్‌కు 67 ఏళ్ల లాన్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఈమె 2012–2022 కాలంలో అక్కడి సైగన్ జాయింట్ స్టాక్ కమర్షియల్ బ్యాంక్‌పై అజమాయిషీ చలాయించారు. ఆ కాలంలో తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించి ఏకంగా 2,500 రుణాలు మంజూరయ్యేలా చేసి బ్యాంక్‌కు సుమారు రూ.2.24 లక్షల కోట్లు(27 బిలియన్ డాలర్లు) నష్టం చేకూర్చారని గతంలో ఆమెపై కేసు నమోదైంది. దీంతో 2022 అక్టోబర్‌లో ఆమెను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ ఉదంతంలో బ్యాంక్‌కు రూ.224 కోట్లు(2.69 కోట్ల డాలర్లు) జరిమానాగా చెల్లించాలని హో చిన్ మిన్హ్ సిటీ కోర్టు ఆదేశించింది. '' ఈమె భారీ ఆర్థిక, వ్యవస్థీకృత నేరానికి పాల్పడి ఆ నగదు మళ్లీ రికవరీ చేసే పరిస్థితి లేకుండా చేశారు. ఇంతటి హేయమైన నేరానికి పాల్పడినందుకే మరణశిక్ష విధిస్తున్నాం. ఈ కేసులో దాదాపు రూ.43 కోట్లలంచం తీసుకున్న సెంట్రల్ బ్యాంక్ మాజీ అధికారి డో థి నహాన్‌కు జీవితఖైదు విధిస్తున్నాం. లాన్ అత్యంత సన్నిహిత బంధువు, వాన్ థిన్ ఫాట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిణి ట్రూంగ్ హుయూ వాన్‌కు 17 ఏళ్ల కారాగారశిక్ష విధిస్తున్నాం' అని కోర్టు తన తీర్పులో పేర్కొంది. రియల్ ఎస్టేట్ సంస్థ వాన్ థిన్హ్ ఫాట్ అక్కడి లగ్జరీ నివాస భవంతులు, కార్యాలయాలు, హోటళ్లు, షాపింగ్ సెంటర్లను నిర్మించడంలో మంచి పేరు సాధించింది.


ట్రూంగ్ మై లాన్

సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 12 ఏప్రిల్ । 2024




సాలెహ్‌నగర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ఘనంగా రంజాన్

జిల్లావ్యాప్తంగా గురువారం రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనాలు చేశారు. మతపెద్దల ప్రసంగాలు విన్నారు. పరస్పరం ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దానధర్మాలు ఆచరించారు. బంధు, మిత్రులను విందుకు ఇళ్లకు ఆహ్వానించారు. నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద ఉన్న పురానీ(ఖదీమ్‌షాహి)ఈద్గా, చింతకుంట ఈద్గా, సాలెహ్‌నగర్ ఈద్గా, బైపాస్‌రోడ్డులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాలెహ్‌నగర్ ఈద్గా వద్ద ముస్లింలకు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బి.వినోదకుమార్, కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ప్రార్థనలు పూర్తయ్యేంత వరకు ట్రాఫిక్ మళ్లించారు. ఉన్నతాధికారులు డ్రోన్ కెమెరాలు, మొబైల్ వాహనాల ద్వారా భద్రతను పర్యవేక్షించారు.

– కరీంనగర్ కల్చరల్



సాలెహ్‌నగర్‌లో సందేశం ఇస్తున్న మతపెద్ద



సాలెహ్‌నగర్ వద్ద ఆలింగనం చేసుకుంటున్న ముస్లింలు



హుజూరాబాద్‌లో ప్రార్థనలు చేస్తూ...



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



గంభీరావుపేటలో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్

న్యూస్‌రీల్

ప్రజల ప్రాణాలతో బీఆర్‌ఎస్, బీజేపీ చెలగాటం



నగర శివారులోని డంప్‌యార్డ్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ బృందం

కరీంనగర్ కార్పొరేషన్: పదేళ్లు అధికారం చెలాయించిన బీఆర్‌ఎస్, ఎంపీగా ఉన్న బీజేపీ పాలకులు నగర ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాయని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. డంపింగ్‌యార్డ్ మూలంగా నగరవాసులు అనారోగ్యం పాలవుతున్నా.. బీఆర్‌ఎస్ బల్దియా పాలకవర్గం, బీజేపీ ఎంపీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించింది. గురువారం పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, కట్ల సతీశ్, మాచర్ల ప్రసాద్, నడిపెల్లి అశోక్‌రావు, మల్లికార్జున రాజేందర్ నగర శివారులోని డంప్‌యార్డ్‌ను సందర్శించారు. డంప్‌యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త గుట్టలు, వృథాగా ఉన్న బయోమైనింగ్ మిషనరీలు, మంటలను ఆర్పుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ మాట్లాడుతూ డంప్‌యార్డ్‌లో మంటలు చెలరేగి విపరీతమైన పొగ రావడంతో ఈ ప్రాంతంతో పాటు, సమీపంలోని పలు డివిజన్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. గత నాలుగు రోజులుగా ఈ ప్రాంతం కాలుష్యానికి గురైన నేపథ్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు తాము డంప్‌యార్డ్‌ను సందర్శించామన్నారు. స్మార్ట్ సిటీ నిధులు వేల కోట్ల రూపాయలు తీసుకువచ్చినట్లు చెప్పుకొనే మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ ఎందుకు ఈ సమస్యను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా బయోమైనింగ్ పనులు చేపట్టాలని, రెండు ఫైర్ ఇంజన్‌లు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలాఉంటే సమస్యను త్వరగా పరిష్కరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్‌కు సూచించారని, మంటలు విస్తరించకుండా చర్యలు చేపట్టాలని నగరపాలకసంస్థ కమిషనర్‌ను ఆదేశించారని ఆయన తెలిపారు. నాయకులు గంగుల దిలీప్, రేకొండ సందీప్, రోల సతీష్, కొండ హరీశ్, కట్కం కృష్ణ, కంకణాల అనిల్ కుమార్, గోపి, అరుణ్ పాల్గొన్నారు.

గంద్ర హన్మంతరావు స్మారక పురస్కారానికి 'షట్చక్రం' ఎంపిక



లక్ష్మణ చక్రవర్తి



షట్చక్రం గ్రంథం

కరీంనగర్ కల్చరల్: ప్రతీ యేటా రాష్ట్రస్థాయిలో కవిత్వేతర ప్రక్రియలకు అందించే గంద్ర హన్మంతరావు స్మారక పురస్కారానికి తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ ఆచార్యుడు, విమర్శకుడు డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి రచించిన 'షట్చక్రం' గ్రంథం (సాహిత్య విమర్శ వ్యాసాలు) ఎంపికైనట్లు కమిటీ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన పురస్కార ప్రదాత, సాహితీవేత్త, అవధాని డాక్టర్ గంద్ర లక్ష్మణరావు సంతోషం వ్యక్తం చేశారు. పురస్కారాన్ని ఈ నెల చివరి వారంలో లక్ష్మణ చక్రవర్తికి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పురస్కార కమిటీ సభ్యులు డాక్టర్ తత్వాది ప్రమోద్‌కుమార్, గాజుల రవీందర్, కేఎస్.అనంతాచార్య రచయితకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

బిల్లులు.. తిప్పలు

- ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ గోస
- తొమ్మిది నెలలుగా బిల్లులకు మోక్షం లేదు
- నిలిచిపోయిన జీపీఎఫ్, ఫైనల్ పేమెంట్స్, పార్టు ఫైనల్ రుణాలు



'ఇతనిపేరు పొద్దుటూరి కిషన్‌రెడ్డి. హుజూరాబాద్ మండలం సింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్. గతేడాది ఆగస్టులో జీపీఎఫ్ నుంచి పార్ట్‌ఫైనల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. తొమ్మిది నెలలు దాటినా బిల్లు రాలేదు. ఆర్థిక సంవత్సరం ముగిసినా పెండింగ్‌లోనే ఉంది. జిల్లా పరిషత్ జీపీఎఫ్ విభాగం, ట్రెజరీ కార్యాలయం చుట్టూ తిరిగినా డబ్బు అందలేదు'

'చొప్పదండి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఇటీవల పదవీ విరమణ పొందాడు. అతనికి రావాల్సిన బకాయిల కోసం రెండు నెలల క్రితం దరఖాస్తులు సమర్పించాడు. పెన్షన్‌తో పాటు ఇతర డబ్బులు ఇంకా అందకపోవడంతో జిల్లా పరిషత్ జీపీఎఫ్ విభాగంలో వాకబు చేస్తూనే ఉన్నాడు'.

'జిల్లాలోని గంగాధరకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు 18ఏళ్లుగా జీపీఎఫ్ విభాగంలో తాను దాచుకున్న డబ్బులు ఆరోగ్య అవసరాలకు కావాలని ఎనిమిది నెలల క్రితం దరఖాస్తు చేసింది. నెలలు గడుస్తున్నా లోన్ ఇవ్వకుండా సంబంధిత అధికారులు కాలయాపన చేస్తున్నారు'... ఇలా తొమ్మిది నెలలుగా లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న జిల్లాలోని చాలామంది ఉపాధ్యాయులు జీపీఎఫ్ కోసం కళ్లల్లోవత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు.

కరీంనగర్:

జిల్లా పరిధిలోని 16 మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రెండేళ్లుగా సమయానికి వేతనాలు రాక వెతలు పడ్డారు. ప్రతీనెల 12 నుంచి 15వ తేదీల మధ్య వేతనాలు అందుతుండడంతో తీసుకున్న రుణాలకు చెక్‌బౌన్స్ కావడం, పెనాల్టీలు కట్టడం, సిబిల్‌స్కోర్ ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 1,2వ తేదీల్లో ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమవుతున్నాయి. వారికి రావాల్సిన జీపీఎఫ్ లోన్లు, సప్లమెంటరీ బిల్లులు, పదవీవిరమణ డబ్బులు సకాలంలో అందడం లేదు. దీంతో చాలామంది ఉపాధ్యాయులు తొమ్మిది నెలలుగా జెడ్పీ కార్యాలయంలోని జీపీఎఫ్ విభాగం, కలెక్టరేట్‌లోని ట్రెజరీ విభాగం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.



కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయం

ఉపాధ్యాయుల సౌకర్యాలు ఇలా..

జిల్లా పరిషత్ ప్రభుత్వ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) నుంచి పదవీవిరమణ పొందిన తరువాత పెన్షన్, ఇతర సదుపాయాలు పొందే అవకాశముంది. సర్వీసులో ఉన్నప్పుడు ఇల్లు రిపేర్లు, పిల్లల చదువులు, పెళ్లిళ్ల అవసరాలకు, ఆరోగ్య రీత్యా ఎదురయ్యే సమస్యలకు జీపీఎఫ్ నుంచి డబ్బులు పొందే వీలుంది. ఇందుకు భిన్నంగా జిల్లా పరిషత్ అధికారులు వ్యవహరిస్తుండడంతో వేలాది మంది ఉపాధ్యాయులు జిల్లా పరిషత్‌లోని జీపీఎఫ్ విభాగం చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గతంలో పలుమార్లు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా జెడ్పీ అధికారుల్లో మార్పు రాలేదు. తాజాగా ఈ విద్యా సంవత్సరంలోనూ అదే పరిస్థితి. తమ ప్రమేయం ఏం లేదని జెడ్పీ అధికారులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో జీపీఎఫ్ విభాగంలో ఏటా ఇదేతంతు జరుగుతోందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

70 కోట్లకుపైబడి బకాయిలు...

జిల్లా పరిధిలో స్వచ్ఛంద పదవీ విరమణ, ఆకస్మిక మృతి చెందినవారు, ఆరోగ్య రీత్యా అవసరాలకు, ఇళ్ల నిర్మాణం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం జీపీఎఫ్ విభాగానికి దరఖాస్తు చేసుకున్న వారి బకాయిలు రూ.20కోట్ల పైబడి ఉంటుందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. స్వచ్ఛంద పదవీవిరమణ, ఆకస్మిక మృతి చెందిన వారికి సంబంధించి ఫైనల్ పేమెంట్ రూ.32 లక్షలకుపైగా, పార్ట్‌ఫైనల్, అడ్వాన్సులకు సంబంధించి రూ.19కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉంది. సప్లమెంటరీ బిల్లులు, ఇతరత్రా బిల్లులు మరో రూ.50 కోట్లకుపైబడి పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

వార్షిక సంవత్సరం ముగిసినా..

2023–24వార్షిక సంవత్సరం మార్చి 31తో ముగిసి 11రోజులు గడిచినా చేతికి ఇచ్చిన చెక్కులు పాస్ కాకపోవడంతో బిల్లులు చిక్కుల్లో పడ్డాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు. మార్చి 31వరకు కార్యాలయంలో సమర్పించిన బిల్లులన్నింటిని ఆమోదించి నిధులు మంజూరు చేస్తామన్న ప్రభుత్వం నిధులు లేకపోవడంతో చేతులెత్తేసిందని అంటున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో మరోసారి దరఖాస్తు చేయాలా..? అని ఉపాధ్యాయులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పార్ట్‌ఫైనల్ రూ.18,77,76,288
ఫైనల్ పేమెంట్స్(రిటైర్డ్ అయినవారివి) రూ.32,52,545
అడ్వాన్సులు రూ.1,15,19,158
సప్లమెంటరీ, ఇతరత్రా బిల్లులు రూ.50 కోట్లకుపైబడి
రావాల్సిన బకాయిలు మొత్తం రూ.70,25,47,991

సకాలంలో చెల్లించాలి



ఏడాదిన్నరగా మెడికల్, సరెండర్, జీపీఎఫ్, పార్ట్‌ఫైనల్ బిల్లులు నేటికి చెల్లింపులు చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధ్యాయులు భవిష్యత్ అవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు కూడా చెల్లింపు చేయకపోవడం విచారకరం. అవసరాల కోసం ప్రైవేట్‌గా అప్పులు చేసి వడ్డీలు కట్టాల్సిన దుస్థితి ఉంది. ప్రభుత్వం బిల్లులు సకాలంలో క్లియర్ చేయాలి.

– పొలంపల్లి ఆదర్శన్‌రెడ్డి, తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

మంజూరుకు పంపిస్తున్నాం



విడతల వారీగా బిల్లుల చెల్లింపుకు పంపిస్తున్నాం. మార్చి 31 వరకు వచ్చిన చెక్కులను ప్రభుత్వానికి నివేదించాం. ఈ–కుబేర్‌లో చెల్లింపుతో ఆలస్యమవుతున్నాయి. ఉద్యోగుల బెనిఫిట్స్‌కు సంబంధించిన బిల్లులు పెండింగ్ లేకుండా పంపించాం. జిల్లాలోని ట్రెజరీలకు వచ్చిన చెక్కులను వెంటనే ప్రభుత్వానికి పంపిస్తున్నాం. 31లోపు పంపించిన బిల్లులన్ని దశల వారీగా పాస్ అవుతాయి.

– నాగరాజు, జిల్లా ట్రెజరీ అధికారి,కరీంనగర్



పాతబజార్‌లో పనిచేయని చేతిపంపు



పద్మశాలి వీధిలో..



గాయత్రీనగర్‌లో...

పనిచేయని చేతిపంపులు

పదేళ్లుగా పుష్కలంగా నీరు అందుబాటులో ఉండదంతో నగరంలోని చాలా డివిజన్లలో చేతిపంపుతో పనిలేకుండా పోయింది. నగరానికి తలాపున ఉన్న లోయర్ మానేరు డ్యాంలో సరిపడా తాగునీరు లభించడంతో చాలారోజులు అవి మూలకు పడ్డాయి. దీంతో చేతిపంపుల నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోగా.. ఇప్పుడు అవసరానికి పనికిరాకుండా పోయాయి. కొద్దిరోజులుగా నగరంలో తాగునీటి ఎద్దడి ఎదురవుతుండగా.. ఎల్‌ఎండీలో నీళ్లు లేక నల్లానీరు సరిపడా సరఫరా కావడం లేదు. దీంతో మూలకుపడ్డ చేతిపంపులను వినియోగంలోకి తేవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

సైబర్ నేరాలకు చెక్

- కమిషనరేట్ కేంద్రంలో ప్రత్యేక ఠాణా
- ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక సైబర్ వారియర్
- అందుబాటులోకి సేవలు

కరీంనగర్‌క్రైం: సైబర్ క్రైం.. ఇప్పుడు మెజార్టీ ప్రజలను వేధిస్తున్న సమస్య. సెల్‌ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్ లింక్ క్లిక్ చేయగానే అకౌంట్‌లోని డబ్బులు క్షణంలో మాయమవడం.. గుర్తు తెలియని వ్యక్తులు ఖాతాలోని నగదు దొంగలించడం.. ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వేదికగా వేధింపులు, ఫొటోమార్ఫింగ్‌తో బ్లాక్ మెయిల్ చేయడం .. ఇలా ఏదో ఒక విధంగా చాలా మంది సైబర్ నేరాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రతీ కమిషనరేట్, జిల్లాల్లో ఒక్కో సైబర్‌క్రైం పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఇటీవల కమిషనరేట్ కేంద్రంలో ప్రత్యేకంగా సైబర్ క్రైం స్టేషన్ ఏర్పాటు చేశారు.

ఎస్‌హెచ్‌వోగా ఏసీపీ స్థాయి అధికారి

కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సైబర్ క్రైం ఠాణాకు ఏసీపీ స్థాయి అధికారి నరసింహారెడ్డిని ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఎస్‌హెచ్‌వోతో పాటు సిబ్బందికి ప్రత్యేకంగా సైబర్ నేరాలపై శిక్షణ, అవగాహన కల్పించారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఉత్పన్నమయ్యే సైబర్ నేరాలను పోలీస్‌స్టేషన్ల వారీగా ఎక్కడికక్కడ నియంత్రించేందుకు సైబర్ వారియర్స్ టీం ఏర్పాటు చేశారు. ప్రతీ స్టేషన్‌లో టెక్నాలజీపై అవగాహన ఉన్న సిబ్బందిని సైబర్ వారియర్‌గా నియమించి క్షేత్రస్థాయిలో బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు వీరిని ఏర్పాటు చేశారు. సైబర్ కేసుల్లో ఆధారాలు సేకరించి నేరస్తులను పట్టుకోవడం, వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా సైబర్ వారియర్స్ చూస్తారు. కాగా, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కమిషనరేట్ కేంద్రంలో సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్

బాధితులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు



కరీంనగర్ కమిషనరేట్‌లో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా స్టేషన్ ఏర్పాటు చేశాం. బాధితులు నేరుగా వచ్చి వారి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు నేరం చేసే విధానాన్ని మార్చుతూ ఖాతాల్లో గల డబ్బు దోచుకుంటున్నారు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ క్రైం బాధితులు వెంటనే సంబంధిత స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కూడా కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– అభిషేక్ మహంతి, పోలీస్ కమిషనర్



మహాత్మ జ్యోతిరావు పూలేకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



నివాళి అర్పిస్తున్న ఎంపీ బండి సంజయ్



బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బి. వినోద్‌కుమార్



మేయర్ యాదగిరి సునీల్‌రావు

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

కరీంనగర్/కరీంనగర్‌టౌన్: మహాత్మ జ్యోతిరావుపూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. సిటీలోని శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా ఉన్న పూలే విగ్రహానికి కలెక్టర్ పమేలా సత్పతి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, కోతిరాంపూర్‌లోని విగ్రహానికి మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ వేర్వేరుగా పూలమాల వేసి నివాళి అర్పించారు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే అని కలెక్టర్ కొనియాడారు. అణిచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్ జ్యోతిరావుపూలే అని ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన జ్యోతిరావుపూలేకు భారతరత్న ఇవ్వాలని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, లోక బాపురెడ్డి, కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనిల్ ప్రకాశ్‌కిరణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌కు చెందిన మారంపెల్లి విశ్వతేజ(22) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. విశ్వతేజ తండ్రి రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటినుంచి అతను మనోవేదనకు గురవుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది, బుధవారం రాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి చిన్న లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

క్యాంటీన్‌లో చోరీ



క్యాంటీన్‌లో చిందరవందరగా సామగ్రి

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి గుట్టపై కాళీయమర్ధనం పక్కనున్న క్యాంటీన్‌లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఫర్నిచర్ ధ్వంసం చేసి, కూల్‌డ్రింక్స్, సామగ్రి ఎత్తుకెళ్లారని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ప్రాంగణం, గుట్టపై ఉన్న ఘాట్‌రోడ్డు వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



దుర్గవ్వ (ఫైల్)

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామానికి చెందిన పానుగంటి దుర్గవ్వ(111) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె 6 నెలల కిందటి వరకు తన పని తాను చేసుకుందన్నారు. ఇటీవల అస్వస్థతకు గురై, మంచం పట్టిందని పేర్కొన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, మనవళ్లు, మనవరాళ్లు సుమారు 25 మంది వరకు ఉంటారని తెలిపారు.

మహిళతో యువకుడి అసభ్య ప్రవర్తన



మహిళను బైక్‌పై వెంబడిస్తున్న యువకుడు

సిరిసిల్లటౌన్: పట్టణంలోని 28వ వార్డులో మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు బుధవారం ఉదయం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా.. ఓ యువకుడు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బైక్‌పై వెంబడిస్తూ ఇబ్బంది పెట్టాడు. ఇదంతా ఆ వార్డులోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. ఉదయం 5.25 గంటలకే ఈ సంఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. నిత్యం ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ కోరారు. దీనిపై పోలీసులు విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

బకాయిలు రూ.150 కోట్లు

- మూడేళ్లుగా లేని రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు
- బీసీ సంక్షేమ శాఖలోనే రూ.113.39 కోట్లు పెండింగ్
- ఆందోళనలో కళాశాలల యాజమాన్యాలు
- మండిపడుతున్న విద్యార్థి సంఘాలు
- కరీంనగర్ జిల్లాలో పరిస్థితి



కరీంనగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులో జాప్యం వల్ల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాల్సిందేనంటూ హుకుం జారీ చేస్తుండటంతో తల్లిదండ్రులు తల పట్టుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం మూడేళ్లుగా విడుదల చేయకపోవడంతో బకాయిలు కొండెక్కాయి. ఒక్క బీసీ సంక్షేమ శాఖవే 2021–22, 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించి రూ.113.39 కోట్లు రావాల్సి ఉంది. పాత బకాయిలు రాకపోవడం, కొత్త వాటి కోసం రోజురోజుకూ దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. సంక్షేమ శాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ముగుస్తున్న విద్యాసంవత్సరం..

బీసీ సంక్షేమ శాఖలో గత మూడేళ్లలో స్కాలర్‌షిప్(ఎంటీఎఫ్) కింద 34,102 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మొత్తం రూ.3.34 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఈబీసీ కేటగిరీలో ఫీజు రీయింబర్స్‌మెంట్(ఆర్టీఎఫ్) కింద 3,755 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మొత్తం రూ.96.35 కోట్లు రావాల్సి ఉంది. ఈబీసీ ఆర్టీఎఫ్ కింద రూ.13.69 కోట్ల బకాయిలున్నాయి. మొత్తం రూ.150 కోట్ల నుంచి బీసీ విద్యార్థులకు సంబంధించిన రూ.113.39 కోట్లు పోనూ మిగతా రూ.37 కోట్లు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు బకాయి ఉండటం గమనార్హం. మూడేళ్లకు సంబంధించిన బకాయిలు సగం మాత్రమే రావడంతో కళాశాలల యాజమాన్యాలకు ఏం చేయాలో తోచడం లేదు. గతేడాది ఆగస్టులో నిధులు విడుదలైనా ఏ విద్యార్థి ఖాతాలోనూ జమకాలేదు. విద్యాసంవత్సరం ముగుస్తుండటంతో విద్యార్థులు, అధ్యాపకులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వాలు సంక్షేమ శాఖలపై సవితి తల్లి ప్రేమ చూపడమే ఈ దుస్థితికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

రోడ్డెక్కి ఆందోళనలు..

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత లేకపోవడంతో విద్యార్థి సంఘాలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నాయి. డబ్బులు ఇవ్వకపోతే సర్టిఫికెట్లు ఇవ్వబోమని కళాశాలల యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయని విద్యార్థులు అంటున్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ ఫీజుల పేరిట వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల తాము మానసిక ఒత్తిడికి గురవుతున్నామని వాపోతున్నారు.

బకాయిలు విడుదల చేయండి



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు బాధాకరం. గత మూడేళ్లలో జిల్లాకు చెందిన 1,25,906 మంది విద్యార్థుల బకాయిలు రూ.150 కోట్లు పెండింగ్‌లో ఉండటం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. బకాయిలు తక్షణమే విడుదల చేయాలి.

– కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వ తీరు దుర్మార్గం



ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నత విద్య చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం దుర్మార్గం. చదువు పూర్తయిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థి సంఘాలను కలుపుకొని పోరాటం ఉధృతం చేస్తాం.

– జక్కని సంజీవ్‌కుమార్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



బుచ్చిరాములు మృతదేహం

గంగాధర(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన నాయిని బుచ్చిరాములు(40) మృతి చెందాడు. గంగాధర పోలీసుల వివరాల ప్రకారం.. బుచ్చిరాములు కొత్తపల్లి పట్టణంలోని ఓ బార్‌లో పని చేస్తూ కుటుంబసభ్యులతో కలిసి స్థానికంగానే ఉంటున్నాడు. ఉగాది పండుగకు స్వగ్రామం వెళ్లిన అతను గురువారం ద్విచక్రవాహనంపై కొత్తపల్లి వస్తున్నాడు. గంగాధర మండలంలోని కురిక్యాల శివారు కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బుచ్చిరాములుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌రెడ్డి పేర్కొన్నారు.

కేజీవీల్స్ ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు..

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): కేజీవీల్స్ ట్రాక్టర్ బోల్తా పడి, ఒడిశాకు చెందిన కార్మికుడు రంజన్ (25) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలకుర్తి మండలం ఎలకలపల్లికి చెందిన ఎస్ఆర్‌వీ ఇటుక బట్టీలో రంజన్ గురువారం కేజీవీల్స్ ట్రాక్టర్‌తో మట్టిని తొక్కే పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వాహనం బోల్తా పడి, అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య జనాని, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కారును ఢీకొన్న మరో కారు

- తప్పిన ప్రాణాపాయం

పాలకుర్తి(రామగుండం): ఓ కారును మరో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీకి చెందిన వ్యక్తులు గురువారం కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాల స్టేజీ సమీప రైల్వేట్రాక్ వద్దకు చేరుకోగానే వెనకాల వస్తున్న మరో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు వెళ్తున్న కారు రహదారి పక్కనున్న రెయిలింగ్‌ను కొట్టేసింది. వాహనంలోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటనతో రహదారిపై ట్రాఫిక్‌జామ్ అయ్యింది. పోలీసులు వచ్చి, కార్లను పక్కకు తీయించి, వాహనాలు పంపించారు.

దుప్పిని చంపిన ముగ్గురి పట్టివేత



నిందితులు, దుప్పి మాంసం చూపుతున్న పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాకలో దుప్పిని చంపి, మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గురువారం అడవిలో దుప్పిని వేటాడి, మాంసం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు టూటౌన్ సీఐ రవీందర్, ఎస్సై సనత్ కుమార్ తమ సిబ్బందితో న్యూమారేడుపాకకు చెందిన లోకిని మల్లేశ్, బండారి నరేందర్, యైటింక్లయిన్‌కాలనీకి చెందిన గంట మోహన్‌లతోపాటు దుప్పి మాంసాన్ని పట్టుకున్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

సిజేరియన్లపై కలెక్టర్ సీరియస్

- సిరిసిల్ల, వేములవాడల్లోని మూడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు
- ప్రసూతి గదులు సీజ్



ప్రసూతి గదిని సీజ్ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: సాధారణ కాన్పులే చేయాలని పదే పదే ఇస్తున్న ఆదేశాలను పట్టించుకోకుండా సిజేరియన్లు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై కలెక్టర్ అనురాగ్ జయంతి సీరియస్ అయ్యారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం సిరిసిల్ల, వేములవాడల్లోని పలు ప్రైవేటు హాస్పిటళ్లలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు నేతృత్వంలో వైద్యాధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. 2020 నుంచి 24 మధ్య 100 శాతం సిజేరియన్లే చేసిన 3 ప్రైవేటు ఆస్పత్రుల ప్రసూతి గదులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. అన్ని దవాఖానాల్లో కచ్చితంగా సాధారణ కాన్పులే చేయాలన్నారు. వేములవాడలో వాసుదేవ ఆస్పత్రి, అమృత నర్సింగ్ హోమ్, సిరిసిల్లలోని సరయు హాస్పిటల్ ప్రసూతి గదులను సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలకు నోటీసులు అందించినట్లు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ హాస్పిటళ్లలో ప్రసవాలు జరగవని, యాజమాన్యాలు కూడా తమ ఆదేశాలు పాటించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీ కేసులో ఒకరి అరెస్టు

- పరారీలో మరో నలుగురు
- రూ.60 వేలు, కంటైనర్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్‌జీ



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్: ఏటీఎంను ధ్వంసం చేసి, డబ్బులు చోరీ చేసిన కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వివరాలను వెల్లడించారు. గత నెల 18న హుజూరాబాద్ కోర్టు ఆవరణలోని ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, రూ.8.64 లక్షలు ఎత్తుకెళ్లారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకోవడానికి నాలుగు టీంలను ఏర్పాటు చేయగా సీసీ పుటేజీ ఆధారంగా కరీంనగర్–వరంగల్, సిద్దిపేట్, హైదరాబాద్, కామారెడ్డి తదితర ప్రాంతాల్లో వెతికారు. ఈ నెల 10న కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ వాహనాన్ని ఆపి, తనిఖీ చేయగా అందులో సీసీ పుటేజీలో కనిపించిన వ్యక్తి మాదిరిగా ఉన్న హరియాణాకు చెందిన ముషారఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను తన సోదరుడు సంపత్, ఢిల్లీకి చెందిన అఫ్తాబ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాజిద్, హరియాణాకు ఫరీద్‌లతో కలిసి చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. రాజస్థాన్‌కు చెందిన తారీఫ్ రోడ్ వేస్‌కు చెందిన కంటైనర్‌తో దొంగతనాలు చేసేవాళ్లమని చెప్పాడు. దీంతో ముషారఫ్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.60 వేలు, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. పరారీలో ఉన్న మిగతావారి కోసం వెతుకుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ టీంలను ఆయన అభినందించారు. సమావేశంలో టౌన్ సీఐ రమేశ్, ఎస్సై సాంబయ్య గౌడ్, హెడ్ కానిస్టేబుల్ మోహన్, కానిస్టేబుళ్లు అవినాష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో అసత్య వ్యాఖ్యలు

- కేసీఆర్‌కు పట్టిన గతే మంత్రి 'పొన్నం'కు పడుతుంది..
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ



మాట్లాడుతున్న రాణీరుద్రమ

కరీంనగర్‌టౌన్: మంత్రి పొన్నం ప్రభాకర్ కొండగట్టు అంజన్న సన్నిధిలో అసత్య వ్యాఖ్యలు చేశారని, నోరు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో కేసీఆర్ ఆంజనేయ స్వామి సాక్షిగా అబద్ధాలు మాట్లాడారని, అందుకే ఆయన ముఖ్యమంత్రి మంత్రి పదవి పోయిందని, మంత్రి పొన్నం పోస్టు కూడా ఊస్ట్ అవుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి కరీంనగర్‌లో ఎంపీ అభ్యర్థే కరువయ్యారని ఎద్దేవా చేశారు. ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి గురించి మాట్లాడే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో దాదాపు రూ.12 వేల కోట్ల అభివృద్ధి పనులు చేయించి, వాటిపై ఓ పుస్తకాన్ని ముద్రించారని తెలిపారు. మంత్రి ఆ పుస్తకాన్ని చదివాలని సూచించారు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, మాజీ సీఎం కేసీఆర్‌ను, కేటీఆర్‌ను, లిక్కర్ కేసులో అరెస్టయిన కవిత గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, మీడియా కన్వీనర్ కటకం లోకేశ్, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కల్యాణ్ చంద్ర, ఎడమ సత్యనారాయణ రెడ్డి, జానపట్ల స్వామి, రాగి సత్యనారాయణ, బండ రమణారెడ్డి, మామిడి రమేశ్, అవదుర్తి శ్రీనివాస్, పోరెడ్డి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపు



విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మల్యాల(చొప్పదండి): మల్యాల అడ్డరోడ్డులోని అల్ఫోర్స్(ఎస్ఎస్వీ) పాఠశాలలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి గురువారం కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర కరాటే అసోసియేషన్ చైర్మన్, అకాడమీ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కె.వసంత్‌కుమార్ విద్యార్థుల ప్రతిభా పాటవాలను పరీక్షించారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కోచ్ మర్రిపల్లి శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడిపల్లి సెంటర్‌లో యువకుల గొడవ

- స్టీల్ రాడ్డుతో దాడి
- ఒకరికి గాయాలు



గాయపడిన రమేశ్



రోడ్డుపై గొడవ పడుతున్న యువకులు

జ్యోతినగర్(రామగుండం): నడి రోడ్డుపై కొందరు యువకులు గొడవ పడ్డారు. స్టీల్ రాడ్డుతో దాడి చేయడంతో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. గోదావరిఖని హనుమాన్ నగర్‌కు చెందిన బూడిద హర్షవర్ధన్, గుల్ల యోగిల మధ్య ఉగాది రోజు గోదావరిఖనిలో గొడవ జరిగింది. ఒకరినొకరు దూషించుకున్నారు. దీనికి సంబంధించి మాట్లాడుకుందామని గురువారం ఇరువర్గాల వారు ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌కు చేరుకున్నారు. హర్ష, సన్నీ రమేశ్‌ను వెంబడించి, రాడ్డుతో దాడి చేశారు. ఈ ఘటనలో అతని కుడి కంటి వద్ద, కుడి చేయి మీద, తలకు గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా వారు రమేశ్‌ను చంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

పాముకాటుతో గొర్రెల కాపరి మృతి

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని మల్లన్న గుట్ట సమీపంలో పాముకాటుతో ఓ గొర్రెల కాపరి మృతిచెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ధర్మారం మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన జీళ్ల ఐలయ్య వద్ద జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు గుడేటి సంపత్ (43) గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. ధర్మారం మల్లన్న గుట్ట సమీపంలో బుధవారం రాత్రి గొర్రెల మందకు కాపలా ఉన్నాడు. గురువారం తెల్లవారుజామున అతన్ని పాముకాటు వేసింది. తొలుత స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గతంలో చనిపోగా ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతురు దీప్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాయమవుతున్న గుట్టలు

- దర్జాగా తవ్వేసి, మట్టి తరలిస్తున్న అక్రమార్కులు
- ప్రభుత్వ భూమిని కలుపుకోవాలని కొందరు..
- పట్టించుకోని అధికారులు
- బుగ్గారం మండలంలో పరిస్థితి



సిరికొండ సమీపంలో తవ్వేసిన గుట్ట



యశ్వంతరావుపేటలో ఆనవాళ్లు కోల్పోయి..

బుగ్గారం(ధర్మపురి): మండలంలోని పలు ప్రాంతాల్లో గుట్టలు మాయమవుతున్నాయి. అక్రమార్కులు మట్టిపై ఆశతో, స్థలం కబ్జా చేయాలన్న ఆలోచనతో గుట్టలను ఇష్టారీతిన తవ్వేస్తున్నారు. దీంతో అవి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పేద, మధ్య తరగతి వాళ్లు ఇళ్ల నిర్మాణానికి, ఇతర అవసరాలకు ఎక్కడైనా మట్టి తవ్వి తెచ్చుకుంటే ఎన్నో ఇబ్బందులకు గురిచేసే అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆరు గ్రామాల పరిధిలో..

బుగ్గారం మండలంలోని సిరికొండ, మద్దునూర్, యశ్వంతరావుపేట, బుగ్గారం, చిన్నాపూర్, గోపులాపూర్ గ్రామాల పరిధిలోని గుట్టలను కొంతకాలంగా దర్జాగా తవ్వుతుంటే పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకుండా, అనుమతులు పొందకుండానే అక్రమంగా తవ్వకాలు చేపడుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అటవీ శాఖ భూములు..

ఈ మండలంలో మొత్తం 11 గ్రామాలు ఉండగా చాలావరకు పల్లెల్లో అటవీ శాఖ భూములున్నాయి. వీటిలో కొన్ని పలువురు రైతులకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రాలకు సమీపంలోనే ఉన్నాయి. ఆ భూముల్లోని గుట్టలను తవ్వి, స్థలాన్ని కలుపుకోవాలని తవ్వకాలు చేపడుతున్నారు. ఫలితంగా వృక్ష సంపద కనుమరుగవడమే కాకుండా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పలుచోట్ల పూర్తిగా అదృశ్యం..

కొందరు అక్రమార్కులు మట్టి కోసం తవ్వకాలు చేపడుతుండటంతో పలుచోట్ల గుట్టలు పూర్తిగా అదృశ్యమయ్యాయి. గంగాపూర్ శివారులో ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి గుట్టలను తవ్వి, చదును చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. దీనిపై స్థానిక నాయకులు ఫిర్యాదు చేస్తే అధికారులు కొంత హడావుడి చేసి, తర్వాత పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. గుట్టల తవ్వకంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతున్నారు.

యథేచ్ఛగా మట్టి దందా



బుగ్గారం మండలంలో ఇప్పటికే అనేక గుట్టలు మాయమయ్యాయి. పలుకుబడి ఉన్న వారు యథేచ్ఛగా వాటిని తవ్వి మట్టి దందా సాగిస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలతో రోజుల వ్యవధిలో అటవీ ప్రాంతంలోని గుట్టలను ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చుక్క గంగారెడ్డి, సామాజిక కార్యకర్త

చర్యలు తీసుకుంటాం



అనుమతి లేకుండా గుట్టలను తవ్వితే చర్యలు తీసుకుంటాం. మట్టి తరలించకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. గ్రామస్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచుతున్నాం. వ్యవసాయ భూముల సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని చూస్తే చర్యలు తప్పవు.

– మాజిద్, తహసీల్దార్, బుగ్గారం



నగరంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నగునూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫిత్ర్

కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక నమాజు ప్రార్థనలు చేశారు. ఖబ్రస్తాన్‌లోని సమాధుల వద్ద నివాళులర్పించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

– కరీంనగర్‌కార్పొరేషన్/కరీంనగర్‌రూరల్



రేకుర్తి ఈద్గా వద్ద ముస్లింలతో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



విద్యుత్‌భవన్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్ఈ గంగాధర్



నివాళి అర్పిస్తున్న ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆర్ఎం, అధికారులు

జ్యోతిబా పూలేకు నివాళి

మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంఘ కార్యాలయాల్లో జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని బైపాస్ రోడ్డు వద్ద, శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా ఉన్న జ్యోతిబాపూలే విగ్రహానికి పలు పార్టీల, సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. వెనుకబడిన జాతుల కోసం లాంతరు వెలుగులో చదువుకొని ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పి వారిలో చైతన్యం తెచ్చిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయసాధన కోసం పోరాడుతామని తెలిపారు.

– కరీంనగర్/కరీంనగర్‌కార్పొరేషన్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి



పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు



సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో...



నివాళి అర్పిస్తున్న బీసీ అఖిల పక్షం నాయకులు,



నివాళి అర్పిస్తున్న గ్రామీణ ఉద్యోగులు



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు



నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



యూటీఎఫ్ నాయకుల నివాళి

క్లుప్తంగా

సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

కరీంనగర్: ఎస్సెస్సీ స్పాట్‌లో స్పెషలిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న రాగంపేట చంద్రశేఖర్ సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు డిమాండ్ చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో జరిగిన టీపీటీఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నగరంలోని సెయింట్‌జాన్ స్కూల్‌లో జరుగుతున్న పదోతరగతి మూల్యాంకనంలో స్పెషల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ నాయకులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాలయ్య, జానకి, శ్రీనివాస్, కిషన్‌రావు, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతు కావాలి

విద్యానగర్(కరీంనగర్): ప్రస్తుత రాజకీయాలు వ్యక్తి స్వార్థపూర్వకంగా మారాయని ఈ పరిస్థితుల్లో ప్రశ్నించే గొంతు కావాల్సిన అవసరం ఉందని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్న పేరాల మానసరెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కుల, కుటుంబ, మత, డబ్బు రాజకీయాలకు స్వస్తి పలికితేనే అవినీతిరహిత భారత్ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు.

సుమిత్రకు నివాళి



భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కొత్తపల్లి: రేకుర్తి మాజీ సర్పంచ్ నందెల్లి ప్రకాష్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ మాతృమూర్తి సుమిత్ర మృతి చెందగా ఆమె భౌతికకాయం వద్ద కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను ఓదార్చారు. కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్ఎస్ నాయకులు, పీఈటీలు తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

అన్నదానం



సప్తగిరికాలనీ(కరీంనగర్): రంజాన్ పండుగ సందర్భంగా కరీంనగర్‌లోని రాజా థియేటర్ సమీపంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ నాయకుడు ఆసంపల్లి శ్రీనివాస్, కరీంనగర్ శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురమళ్ల శ్రీనివాస్, నాయకులు అమీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గీతా ప్రవచనం విజయవంతం చేయండి

జమ్మికుంట: పట్టణంలోని శ్రీభగవద్గీత జ్ఞాన మందిర్‌లో చిత్తూరు జిల్లా జాశ ఆశ్రమం పీఠాధిపతి శ్రీపరిపూర్ణానందస్వామివారు 13న సాయంత్రం, 14న ఉదయం గీతా ప్రవచనం కార్యక్రమం చేపడతారని పట్టణ ప్రజలు, భక్తులు విజయవంతం చేయాలని జ్ఞాన మందిర్ కమిటీ సభ్యులు గురువారం ప్రకటనలో తెలిపారు. స్వామివారి గీతా ప్రవచనం, ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో గీతా మందిర్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ధర్మ సమాజ్ పార్టీ



మాట్లాడుతున్న ధర్మసమాజ్ పార్టీ ఇన్‌చార్జి శ్రీకాంత్

కరీంనగర్: కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల బరిలో ధర్మ సమాజ్ పార్టీ నిలుస్తుందని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఇంచార్జి చిలువేరు శ్రీకాంత్ మహారాజ్ తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూలే, అంబేడ్కర్, కాన్షీరాంల ఆశయాల కోసం పోరాటం కొనసాగించే ఏకైక పార్టీ ధర్మ సమాజ్ పార్టీ అని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్‌లో ఉన్న 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ధర్మసమాజ్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు జంగం సాధన, ప్రధాన కార్యదర్శి తల్లా నరేశ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా కోశాధికారి ఆరెల్లి బాబు, సదానందం అనిల్, శివాజీ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఉపశమనం

- పనిప్రదేశాల్లో నీడ ఏర్పాటు
- పంచాయతీల ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం



దుబ్బపల్లిలో గ్రీన్‌నెట్ కింద కూర్చున్న కూలీలు



బొమ్మకల్‌లో ఏర్పాటు చేసిన గ్రీన్‌నెట్, పనిచేస్తున్న కూలీలు

కరీంనగర్‌రూరల్: సూర్యుడి ఎండ తీవ్రత క్రమేపీ పెరుగుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏప్రిల్ మొదటి వారం నుంచే రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉపాధిహామీ కూలీలు మండుటెండల్లోనూ పనులు చేస్తున్నారు. వడదెబ్బకు గురయ్యే అవకాశముండటంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎండ నుంచి కాపాడటంతో పాటు ఉపశమనం కలిగించేలా సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

1,600 మందికి ఉపాధి

కరీంనగర్ మండలంలో మొత్తం 6వేల మంది కూలీలుండగా వీరిలో 4,353 మంది పనిచేసే కూలీలున్నారు. వేసవికాలంలో వ్యవసాయ పనులు లభించకపోవడంతో ఉపాధిహామీ పనులకు వచ్చేందుకు ముందుకొస్తున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో గతేడాది వందరోజులు పని పూర్తి చేసుకున్న కూలీలకు మళ్లీ ఇప్పుడు అవకాశం లభించింది. ప్రస్తుతం రోజుకు సరాసరిగా 1,500 నుంచి 1,600 మంది చొప్పున కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ కూలీలు మాత్రం తగ్గకుండా పనులకు వస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా గ్రీన్‌నెట్‌తో నీడ

పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. సాధారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కూలీలు పనిచేస్తున్నారు. అయితే ఉదయం 9గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఎండ నుంచి కూలీలకు ఉపశమనం కలిగించేందుకు పని ప్రదేశాల్లో గ్రీన్‌నెట్, చెట్లకొమ్మలతో నీడ సౌకర్యం కల్పిస్తున్నారు. అయితే భానుడి ప్రతాపానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గ్రీన్‌షేడ్ నెట్ టెంట్లు కూలీలకు రక్షణ కల్పించడం లేదు. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పనిప్రదేశాలకు వెళ్లి వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు.

తాగునీటి సౌకర్యం

గతంలో తాగునీటికోసం ప్రభుత్వం డబ్బులను కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ప్రస్తుతం తాగునీటి సౌకర్యం కల్పించే బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగించింది. ఒక్కో కూలీకి రోజుకు 2 లీటర్ల చొప్పున అందిస్తున్నారు. లీటరు నీటికి పంచాయతీకి రూ.2.50 చొప్పున చెల్లిస్తున్నారు. కూలీలకు తాగునీటిని పంచాయతీ కార్యదర్శి పని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచుతున్నారు. అయితే పెద్ద గ్రామాల్లో వందల సంఖ్యలో పనికి వస్తున్న కూలీలకు సరిపడే నీళ్లు అందించడం సాధ్యపడటం లేదు. నామమాత్రంగా నీటిసౌకర్యం ఏర్పాటు చేయడంతో కూలీలు యథావిధిగా ఇంటి నుంచే నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కూలీలకు అన్ని సౌకర్యాలు

వేసవిలో ఉపాధి పనికి వచ్చే కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో నీడ కోసం టెంట్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నాం. మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాం. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశాం.

– శోభారాణి, ఏపీవో, ఉపాధిహామీ పథకం

డంపింగ్ యార్డ్‌ను తరలించాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: నగర ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కాలిపోయి దట్టమైన పొగ వస్తున్న డంపింగ్ యార్డ్‌ను సందర్శించి మాట్లాడారు. ఏటా వేసవిలో డంపింగ్‌యార్డు తగలబడి దట్టమైన పొగ వ్యాపించి నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులు, మేయర్ శాశ్వత పరిష్కారం చూపించకపోవడం సిగ్గుచేటని తెలిపారు. కేవలం కాలిపోయి పొగ వస్తున్నప్పుడు తూతూమంత్రంగా పర్యటనలు చేసి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. శాశ్వతంగా తరలించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో తడిసినప్పుడు దుర్వాసన, వేసవిలో కాలిపోయి పొగతో ఆటోనగర్, అల్గునూర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, కోతిరాంపూర్, కట్టరాంపూర్, భగత్‌నగర్, పాతబజార్‌కాలనీవాసులు ఊపిరాడక అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. పక్కనే కోట్లాది రూపాయలు వెచ్చించి తడి చెత్త, పొడి చెత్తతో కంపోస్ట్ తయారు చేస్తామని షెడ్లు నిర్మించి నిరుపయోగంగా వదిలేశారని తెలిపారు. ఇప్పటికైనా నగర మేయర్ స్పందించి వెంటనే డంపింగ్ యార్డ్‌ను తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పున్నం రవి, జి.తిరుపతి, కొంపెల్లి సాగర్, నాయకులు కోనేటి నాగమణి, ఆర్.శ్రీనివాస్, కనకరాజు, చెలికాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు, కుంటలు వెలవెలబోతున్నాయి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు

గంగాధర: కేసీఆర్ పాలనలో పంటపొలాలు కళకళలాడాయి, జీవనదిలా ఉన్న వరదకాలువ, మత్తడి దూకిన చెరువు, కుంటలు ప్రస్తుతం నీళ్లు లేక వెలవెలబోతున్నాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కరువును తీసుకొచ్చిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని మధురానగర్ బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. అబద్ధాలతో అందలమెక్కిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లడిగే హక్కులేదన్నారు. కాంగ్రెస్ దొంగ హామీలను ప్రజలు గమనిస్తున్నారని, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఏమైందని, రుణమాఫీ అమలు కాలేదని విమర్శించారు. క్వింటాల్‌కు రూ.ఐదువందల బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ మోదీ వైపే..

కరీంనగర్ టౌన్: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ క్యాడర్ కూడా బీజేపీకే ఓటేసేందుకు సిద్ధమయ్యారని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ నుంచి వరంగల్, ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట జాతీయ రహదారికి మోదీ శంకుస్థాపన చేశారని, కరీంనగర్‌లో ఆర్వోబీ తీసుకొచ్చానని తెలిపారు. ఇక్కడి కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి రాగానే మిడిసిపడుతున్నారని మండిపడ్డారు. గురువారం రాత్రి అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్షులు, సమన్వయ కర్తల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి 6 గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ చేసిన మోసాలు, గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన పాపాలను ప్రజలకు వివరించాలన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

శంకరపట్నం: మండలంలోని తాడికల్ సహకార సంఘం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సీఈవో వీరస్వామి ప్రారంభించారు. తాడికల్, కేశవపట్నం, వన్నారం, ఎరడపల్లి గ్రామాలలో సెంటర్లు ప్రారంభించామని తెలిపారు. ఈకార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శరణాగతి చిత్తశుద్ధితో చేయాలి



ప్రవచనం చేస్తున్న చిన జీయర్‌స్వామి



హాజరైన భక్తులు

కరీంనగర్ కల్చరల్: సంపూర్ణ శరణాగతిని చిత్తశుద్ధితో చేయాలని, భరతుడు, విభీషణుడు, శబరివంటివారు అలా ఆచరించి మోక్షాన్ని పొందారని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో గురువారం ఉదయం, సాయంత్రం స్వామి ప్రవచనం చేశారు. రామాయణం మహిమాన్వితమైందని, పారాయణ, ప్రవచన, హోమాదుల ద్వారా కోరిన కోరికలు తీరుతాయని అన్నారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమరావు, బీవీ.రావు, యాద కిషన్, ఎల్.భూపతిరావు, ఎస్.వెంకటేశం, వరప్రసాదాచార్యులతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు



శ్రీనిలయంలో పూజ చేస్తున్న అర్చకులు



ద్వారతోరణ పూజలో మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్: తిరుమలనగర్‌లోని శ్రీనిలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. మయూరగిరి పీఠాధిపతులు రమణాచార్య ఆధ్వర్యంలో మూడోరోజు గురువారం రామచంద్రస్వామికి ఫల పంచామృతా అభిషేకాలు నిర్వహించారు. సుదర్శన లక్ష్మీనరసింహ హోమం జరిపారు. ఈ కార్యక్రమంలో పండితులు రామకృష్ణమాచార్యులు, వేణుగోపాలాచార్యులు, గోపీశర్మ, శివరామకృష్ణలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..

వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం హెలీప్యాడ్ గ్రౌండ్ ప్రక్కన గల ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజారోహణ, ద్వార తోరణ పూజలు ఘనంగా జరిగాయి. మేయర్ సునీల్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గరుడ ధ్వజంతో పాటు యాగశాల, ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపేందర్, వెంకటరావు, ప్రవీణ్, నాగరాజు, ప్రభాకర్, ఆలయ కమిటీ బాధ్యులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు



వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): బీఆర్.అంబేడ్కర్ జయంతోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని కార్ఖానగడ్డలో గల అంబేడ్కర్ క్లబ్‌లో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బైరమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షులు గొర్రె వాసు, దొంత కనకయ్య, సహాయ కార్యదర్శి పెదరంగం పూర్ణచందర్, కోశాధికారి కర్ర నవీన్‌కుమార్, కార్యవర్గసభ్యులు రొడ్డ రవీందర్, ములుకల శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కరీంనగర్ అర్బన్: పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. కోతిరాంపూర్‌లో గంట అనిల్ అనే వ్యక్తి 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేయగా.. గురువారం రాత్రి వల పన్ని పట్టుకున్నారు. సదరు వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసి బియ్యాన్ని సమీప డీలర్‌కు అప్పగించామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ప్రశాంత్‌రావు, తహసీల్దార్ దినేష్‌చంద్రా, సివిల్ సప్లయ్ డీటీ సురేందర్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

హుజూరాబాద్: మండలంలోని కందుగులలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ గురువారం పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అలాగే బోర్నపల్లిలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులను ప్రణవ్ పరామర్శించారు.

క్లుప్తంగా...

ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులు


రాకెట్ లాంచర్ పడిన చోట ఏర్పడిన గుంత, విరిగిన చెట్లు

చర్ల: మావోయిస్టులను నిర్మూలించే లక్ష్యంతో పోలీసులు ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులు చేస్తుండటం హేయనీయమని మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ గురువారం లేఖ విడుదల చేశారు. అందులోని వివరాల ప్రకారం.. ఈనెల 7న రాత్రి 11.45 గంటల సమయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ – సుక్మా జిల్లాల సరిహద్దు పామేడు సమీపాన పాలగూడ, ఇత్తగూడ, జిల్లేరుగట్టు, గొమ్ముగూడ, కంచాల గ్రామాల్లో పోలీసులు డ్రోన్ల ద్వారా దాడులు చేశారని ఆరోపించారు. ఆయా గ్రామాలపై రాకెట్ లాంచర్లు వదలడంతో ఆదివాసీలు తీవ్రంగా ఆందోళన చెందారన్నారు. ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీయాల్సి వచ్చిందని, ఇకనైనా పోలీసు బలగాలు ఆదివాసీ గ్రామాలపై దాడులను వెంటనే నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె లేఖతోపాటు రాకెట్ లాంచర్లు వదిలిన ప్రాంతాల ఫొటోలు విడుదల చేశారు.

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్



చాదర్‌ఘాట్: మాజీ హోంమంత్రి మహమూద్ అలీ నివాసంలో జరిగిన రంజాన్ వేడుకల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. గురువారం అజంపురాలోని మహమూద్ అలీ ఇంటికి చేరుకున్న కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మహమూద్ అలీతో పాటు పలువురు మైనారిటీ నాయకులకు కేటీఆర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

'ఆయిల్‌పామ్'..అంతంతే

సాగులో నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోని ప్రైవేట్ కంపెనీలు
పామాయిల్ ఫ్యాక్టరీల ఏర్పాటులోనూ నిర్లక్ష్యం
సమీక్ష చేసి అవసరమైతే కంపెనీలతో ఒప్పందాల రద్దు?



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్ సాగు రాష్ట్రంలో ఆశించినస్థాయిలో పెరగలేదు. దీనిపై సర్కారు దృష్టి సారిస్తున్నా..కొన్ని కంపెనీలు మాత్రం వెనుకడుగు వేస్తున్నాయి. ఆయిల్‌పామ్ విస్తీర్ణాన్ని వచ్చే దశాబ్దంలోగా ఏకంగా 20 లక్షల ఎకరాలకు విస్తరించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది.రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్ సహా 14 ప్రైవేట్ కంపెనీలకు ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన బాధ్యతలు అప్పగించింది. మొత్తం 31 జిల్లాలను గుర్తించింది. కొన్నేళ్లుగా ప్రైవేట్ కంపెనీలు తమ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవుతున్నాయి. సాగు చేయించడంలోనూ, ఆ మేరకు రైతులను ఒప్పించడంలోనూ అనాసక్తి చూపిస్తున్నాయి. మరోవైపు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని కొన్ని కంపెనీలు సేకరించలేదు. దాదాపు మూడేళ్ల క్రితమే ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, కంపెనీలు పట్టించుకోలేదు. ఇప్పటి వరకు భూములు కొనకపోతే ఫ్యాక్టరీలు ఎప్పుడు నిర్మిస్తారోనన్న విమర్శలు వస్తున్నాయి. ఒప్పందం ప్రకారం మూడేళ్లలోపు ఫ్యాక్టరీ నిర్మించాలి. కానీ ఈ నిబంధనను అనేక కంపెనీలు అమలు చేయడం లేదు. పంట చేతికొచ్చే సమయానికి ఫ్యాక్టరీ అందుబాటులో లేకుంటే రైతులు ఇబ్బందులు పడతారు. ఇప్పటికే కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేసిన జిల్లాల్లో పంట గెలలు అందుబాటులోకి వచ్చాయి. మరో ఏడాదిలో మరింత ఎక్కువగా అందుబాటులోకి వస్తాయంటున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీలు ఇంకా నిర్లిప్తంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లక్ష్యాన్ని చేరుకోలేని దుస్థితి

ఆయిల్‌పామ్ సాగులో 14 కంపెనీలు తమ లక్ష్యంలో కేవలం 20 శాతం వరకే చేరుకున్నాయని అధికారులు అంటున్నారు. ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ మినహా ఇతర ప్రైవేట్ కంపెనీల్లో పెద్దగా పురోగతి లేదు. వంట నూనెల జాతీయ పథకం (ఎన్‌ఎంఈఓ) ద్వారా కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని వాటికి జిల్లాలు, అందులో భూముల సాగు లక్ష్యాలను నిర్దేశించింది. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు స్థాపించడం, రైతులను ఒప్పించి మొక్కలు వేయడం, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం, పంట వచ్చిన తర్వాత కొనుగోలు చేయడం వంటి వాటిని ఈ కంపెనీలు చేపట్టాలి. 2020–21లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు ఇప్పటివరకు కేవలం 1,52,957 ఎకరాల్లోనే పంటలు వేయించాయి. వీటిలో టీఎస్ ఆయిల్‌ఫెడ్ 87 వేల ఎకరాల్లో..మిగిలిన సంస్థలు 65 వేల ఎకరాల్లోనే పంటలను వేయించాయి. ఈ నేపథ్యంలో సాగు లక్ష్యాన్ని చేరుకోని కంపెనీలతోపాటు ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోలేని కంపెనీలకు ఉద్యానశాఖ నోటీసులు జారీ చేసింది. అయితే కంపెనీలు మాత్రం సాగుకు రైతులు ముందుకు రావడం లేదంటూ వివరణ ఇచ్చాయి. ప్రైవేట్ కంపెనీలు రైతుల వద్దకు వెళ్లడానికి అవసరమైన సిబ్బందిని నియమించడంలోనూ... రైతులను ప్రోత్సహించడంలోనూ విఫలం అవుతున్నాయి. పైగా ప్రైవేట్ కంపెనీలు కావడంతో వాటిని రైతులు నమ్మడం లేదన్న చర్చ జరుగుతోంది. తమకు ప్రోత్సాహకాలు అందుతాయో లేదోనని, పంట కొనుగోలు చేయరేమోనని అనుమానపడుతున్నారు. వారి అనుమానాలను తొలగించే ప్రయత్నాలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో లక్ష్యంలో 20 శాతం కూడా సాధించక పోవడంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా కంపెనీలతో సమావేశం నిర్వహించాలని, వాటి నుంచి ఆశించిన స్పందన లేకపోతే అవసరమైతే ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన అన్నట్టు సమాచారం.

ప్రాణాలు తీసిన అతివేగం

- చెట్టును ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరు యువకులు మృతి
- మరో ముగ్గురికి స్వల్ప గాయాలు
- సూర్యాపేట సమీపంలోని రాయినిగూడెం వద్ద ప్రమాదం


మృతుడు నవీన్ (ఫైల్)


మృతుడు సాయి (ఫైల్)


ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన వాహనం

సూర్యాపేట: అతివేగం ఇద్దరి యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. మితిమీరిన వేగంతో చెట్టును ఢీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకుల్లో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు యువకులకి స్వల్ప గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన ఆరుగురు యువకులు ఎర్టిగా కారును అద్దెకు తీసుకుని సూర్యాపేటలోని వీరి స్నేహితుడు ఉదయ్‌ను కలిసేందుకు గురువారం వచ్చారు. వీరంతా బాల్యస్నేహితులు. అతడితో కలిసి కాసేపు సరదాగా పట్టణంలో తిరిగి ఉదయ్‌ను కూడా కారులో ఎక్కించుకుని కేతేపల్లికి బయలుదేరారు. సూర్యాపేట మండలంలోని రాయినిగూడెం శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో జటంగి సాయి (17), అంతటి నవీన్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మారగోని మహేష్, కావడి శివ, అబ్బూరి గణేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే మిగిలిన మరో ఇద్దరు యువకులు చింత మళ్ల ధనుష్ అలియాస్ బన్ని, ఉదయ్ ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. ధనుష్ కారును 170 స్పీడ్‌తో నడపడంతోనే అదుపు తప్పినట్టు తెలుస్తోంది. మితిమీరిన వేగంతో కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. చెట్టు విరిగిపోవడమే కాకుండా కారు నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

గురుకుల సొసైటీల ఇష్టారాజ్యం!

ఇంటర్ బోర్డు నిబంధనల అతిక్రమణ
- వేసవి సెలవుల్లోనూ జూనియర్ కాలేజీల నిర్వహణ
- ఫస్టియర్ విద్యార్థులకు సెకండియర్ పాఠ్యాంశాల బోధన
- సెకండియర్ విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్ కోచింగ్



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల సొసైటీలు ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలను గాలికొదిలేశాయి. వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత కాలేజీలకు సెలవులు ప్రకటించాలని ఆదేశిస్తూ తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు గత నెల 30న ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 31 నుంచి మే నెల 31వరకు రెండు నెలల పాటు వేసవి సెలవులు ఇవ్వాలని, జూన్ 1వ తేదీ నుంచి కళాశాలలు పునఃప్రారంభించాలని స్పష్టం చేసింది. కానీ ఈ నిబంధనలను పట్టించుకోని గురుకుల సొసైటీలు... పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే తరగతులు ప్రారంభించాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు రెండో సంవత్సరం పాఠ్యాంశాన్ని ప్రారంభించగా... ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన తరగతులు నిర్వహిస్తున్నారు.

ఏయే సొసైటీలంటే..

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) జూనియర్ కాలేజీలను పూర్తిస్థాయిలో నిర్వహిస్తుండగా... తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్‌ఈఐఎస్) మాత్రం రంజాన్ నేపథ్యంలో వచ్చే వారం నుంచి తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది.

సీఓఈలకు ప్రత్యేకమంటూ...

రాష్ట్రంలోని గురుకుల సొసైటీల పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక ప్రాంగణంలో ఐదో తరగతి నుంచి పదోతరగతి వరకు పాఠశాలలు నిర్వహిస్తుండగా.. జూనియర్ కాలేజీని ప్రత్యేక ప్రిన్సిపల్‌తో నిర్వహిస్తున్నారు. గురుకుల సొసైటీలకు పాఠశాలలతో పాటు ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం సీఓఈల పేరిట ప్రత్యేక పాఠశాలలున్నాయి. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 38, ఎస్టీ గురుకుల సొసైటీ పరిధిలో 30, బీసీ గురుకుల సొసైటీ పరిధిలోని 12 సీఓఈల్లో ఇంటర్మీడియట్ తరగతులను పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆయా సొసైటీ కార్యదర్శులు వేరువేరుగా ఉత్తర్వులు సైతం జారీ చేశారు. సీఓఈల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫస్టియర్ కేటగిరీకి మే 15వ తేదీ వరకు, సెకండియర్ విద్యార్థులకు మే 26వ తేదీ వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. ముందస్తుగా పాఠ్యాంశాన్ని ముగించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని నిర్ణయించినట్లు సొసైటీ కార్యదర్శులు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

అదే బాటలో ప్రైవేటు కాలేజీలు..

గురుకుల విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహిస్తుండడంతో పలు ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు సైతం ఇదే బాట పట్టాయి. ఇంటర్మీడియట్ బోర్డు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారంగా తరగతులను నిర్వహిస్తున్నాయి. వేసవి సీజన్‌లో తీవ్రమైన ఎండలు, ఉక్కపోత ఉండగా కనీస ఏర్పాట్లు చేయకుండా పలు కాలేజీలు తరగతులు నిర్వహిస్తుండడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరగతులకు హాజరు కాకుంటే సిలబస్ మిస్సవుతుందనే ఆందోళనతో తప్పనిసరి పరిస్థితుల్లో పంపుతున్నట్లు వాపోతున్నారు.

ప్రత్యేక రైళ్లకు నో హాల్ట్స్!

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- స్టాప్‌లు కల్పించాలని వేడుకోలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వీక్లీ, స్పెషల్ రైళ్లు జిల్లా గుండా వెళ్తున్నా ఇప్పటికీ అనేక రైళ్లు నిలుపుదలకు నోచుకోవడం లేదు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కరోనా ప్రభావం తర్వాత చాలా వరకు మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్ మధ్య ఉన్న రైల్వేస్టేషన్లలో సూపర్‌ఫాస్ట్ ట్రైన్ల హాల్టింగ్ ఎత్తేశారు. ప్రయాణికుల డిమాండ్ల మేరకు ఇటీవల కొన్నింటిని పునరుద్ధరించారు. కాజీపేట జంక్షన్, సికింద్రాబాద్ వైపు, ఇటు ఉత్తర భారతదేశానికి కలిపే బల్లార్షా వైపు అనేక సూపర్‌ఫాస్ట్ రైళ్లు కొత్తవి రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ వీటికి ముఖ్య స్టేషన్ల పరిధిలో ఎక్కడా హాల్టింగ్ లేదు. కేరళ నుంచి ఎర్నాకులం–హజ్రత్‌నిజాముద్దీన్(ఢిల్లీ) సూపర్ ఫాస్ట్ వీక్లీ స్పెషల్‌ట్రైన్ ప్రతీ సోమవారం రాకపోకలు సాగించనుంది. తిరుపతి, గూడూరు, విజయవాడ, వరంగల్, బల్లార్షా, నాగ్‌పూర్ మీదుగా ఢిల్లీ చేరుతుంది. వరంగల్ నుంచి బల్లార్షా మధ్య ఎక్కడా స్టాప్స్ ఇవ్వలేదు. రామగుండం, మంచిర్యాల, కాగజ్‌నగర్ స్టేషన్లలో హాల్ట్ ఇస్తే ఇక్కడి ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉండేది. ఇక చెన్నయ్ సెంట్రల్ నుంచి బర్మార్(రాజస్థాన్) ఆదివారం వీక్లీ స్పెషల్ నడవనుంది. ఈ రైలుకు సైతం వరంగల్ తర్వాత మళ్లీ బల్లార్షాలోనే స్టాప్ ఇచ్చారు. మంచిర్యాల, కాగజ్‌నగర్ మధ్య నిలుపుదలకు అవకాశం ఇస్తే ఇక్కడి ప్రయాణీల రాకపోకలకు వీలు ఉండేది.

ముంబయి రైలు మనకు రాదు

ప్రతీ మంగళవారం ముంబయి నుంచి కరీంనగర్ మధ్య మే 28వరకు ముంబయికి ప్రత్యేక రైలు నడవనుంది. ఈ రైలును కాగజ్‌నగర్ వరకు పొడగించాలని ఇక్కడి ప్రయాణికులు కోరుతున్నారు. పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, కాగజ్‌నగర్ వరకు అవకాశం కల్పిస్తే కరీంనగర్‌తోపాటు ముంబయి వెళ్లేందుకు సులువు కానుంది. ఈ రైలు ఉదయం 8.30గంటలకు కరీంనగర్‌కు చేరాక, రాత్రి ఏడింటిదాకా అంటే దాదాపు రాత్రి 10గంటలు కరీంనగర్ స్టేషన్‌లో ఖాళీగానే ఉంటుంది. ఈ క్రమంలో ఈ ముంబయి రైలును కాగజ్‌నగర్ వరకు పొడగించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

ఉపాధి కూలీలపై తేనేటీగల దాడి


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న తేనేటీగల బాధితులు

బేల: ఆదిలాబాద్ జిల్లా బేల మండలం రేణిగూడ రెవెన్యూ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం ఉపాధి హామీ కూలీలపై తేనేటీగలు దాడి చేశాయి. 50 మందికి పైగా కూలీలు తేనేటీగల దాడికి గురయ్యారు. ఇందులో అధిక దాడికి గురైన 18మంది వరకు బాధితులకు హుటాహుటిన అంబులెన్స్‌లలో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. స్వల్పంగా గాయాలైన బాధితులకు సైద్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించారు. స్థానికంగా గ్రామంలోనే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స చేశారు. కాగా ఎలాంటి ప్రాణపాయం లేకపోవడంతో ఉపాధి కూలీలతోపాటు కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా రిమ్స్‌లో తేనేటీగల బాధితులకు అందుతున్న వైద్య సేవలను డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఆరా తీసి పరిశీలించారు.


తేనేటీగల బాధితుల వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, రిమ్స్ డైరెక్టర్‌లు


పక్షుల దాహార్తి తీరుస్తున్న మట్టిచిప్పలు


సీఓఈ ఆవరణలో ఉన్న చెట్లకు తాళ్లతో కట్టి నీరుపోసి ఉంచిన మట్టిచిప్ప

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆలోచన పక్షుల దాహార్తి తీర్చుతోంది. ప్రిన్సిపాల్ ఐనాల సైదులు పర్యవేక్షణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గురుకుల ఆవరణలోని చెట్లకు తాళ్లతో మట్టిచిప్పలు కట్టి నీరు పోసి ఉంచారు. ప్రహరీ, చెట్లు, ఆరుబయట ఇలా 60 చోట్ల మట్టిచిప్పలు ఏర్పాటు చేశారు. రోజువారీగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాటిలో నీరు పోస్తున్నారు.

సదర్మాట్ రైతులు ఆందోళన చెందవద్దు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: సదర్మాట్ రైతాంగం సాగునీటి కోసం ఆందోళన చెందవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదర్మాట్ ఆయకట్టుకు కాలువ నీరందించాలని ఇదివరకే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో కలిసి తాను ఇరిగేషన్ ఈఎన్‌సీతో మాట్లాడామని తెలిపారు. సదర్మాట్ కాలువకు నీరందేలా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయాలని ఈఎన్‌సీ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు ఓట్ల కోసం రైతులను ఆగం చేస్తున్నారని విమర్శించారు. సదర్మాట్ రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

అటవీ అనుమతులు ఇక సులువు

- ఈ నెల 1న అమల్లోకి వన్ నేషన్–వన్ పర్మిట్
- అంతా ఆన్‌లైన్‌లోనే..
- కలప, అటవీ ఉత్పత్తులను దేశంలో ఎక్కడికైనా తరలించొచ్చు



కరీంనగర్ అర్బన్: అటవీ శాఖలో అనుమతులు ఇక సులువుగా రానున్నాయి. దేశవ్యాప్తంగా ఒకే విధానం అమలు చేస్తుండటంతో కార్యాలయంలో నిరీక్షణకు తెరపడినట్లే. అటవీ శాఖలో ఒకే దేశం –ఒకే అనుమతి (వన్ నేషన్–వన్ పర్మిట్) విధానం అమల్లోకి వచ్చింది. దీనివల్ల కలప, వెదురుతోపాటు అటవీ ఉత్పత్తులను దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా తరలించేందుకు వెసులుబాటు కలిగింది. ఇదంతా ఆన్‌లైన్ వేదికగా జరగనుండటంతో క్షేత్రస్థాయిలో అనుమతులు సులువుగా వస్తాయి. కలప ఉత్పత్తుల తరలింపులో కొందరు సామిల్ నిర్వాహకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్న నేపథ్యంలో ఈ విధానంతో అడ్డుకట్ట పడనుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుతో పారదర్శకత..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. కార్యాలయం, అధికారుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. దరఖాస్తును పరిశీలించి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ తిరస్కరించినా తగిన కారణం చూపాల్సిందే. దీనివల్ల సాధారణ ప్రజానీకానికి ప్రయోజనం కలుగుతుంది. కేవలం కలపనే కాదు.. వెదురు, అడవుల్లో దొరికే ఇతర ఉత్పత్తులు ఏవైనా ఆన్‌లైన్‌లో అర్జీ పెట్టుకుంటే మనకు కావాల్సిన ప్రదేశానికి తరలించేందుకు అవకాశం ఉంటుంది. కేవలం మన జిల్లా, రాష్ట్రం పరిధిలోనే కాదు.. దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వీటిని తీసుకెళ్లవచ్చు.

నిర్వాహకులకు అవగాహన

నూతన విధానంపై ఇప్పటికే కరీంనగర్ జిల్లా పరిధిలోని సామిల్, టింబర్ డిపో నిర్వాహకులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ విధానం ఎలా పని చేస్తుంది.. ఎలా దరఖాస్తు చేయాలి.. ఏ వివరాలు నమోదు చేయాలి.. ఎంత కాలంలో అనుమతులు వస్తాయి.. ఇలా అన్ని రకాల అంశాలను వారికి వివరించారు. సందేహాలను నివృత్తి చేశారు.

ఎన్టీపీఎస్ పోర్టల్‌లోనే చేయాలి..

గత డిసెంబర్ చివరి వారంలో కేంద్రం ప్రారంభించిన వన్ నేషన్–వన్ పర్మిట్ ఈ నెల 1 నుంచి మన రాష్ట్రంలోనూ అమల్లోకి వచ్చింది. కొత్త విధానంలో అనుమతులు పొందేందుకు నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టం(ఎన్టీపీఎస్) పోర్టల్‌లోనే దరఖాస్తు చేయాలి. పేరు, ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం పోర్టల్‌లో లాగిన్ అయి, మనకు కావాల్సిన అనుమతి పొందాల్సి ఉంటుంది. అన్ని వివరాలను పొందుపరిస్తే అవి ఆ ప్రాంత ఎఫ్ఆర్‌వోకు చేరుతాయి. దరఖాస్తు, ఎఫ్ఆర్వో సిఫార్సు ఆధారంగా డీఎఫ్‌వో అనుమతి ఇస్తారు. ఇదంతా ఆన్‌లైన్ ప్రక్రియ కావడంతో కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా కేవలం 24 గంటల వ్యవధిలో అనుమతులు జారీ అవుతాయి.

అక్రమాలకు చెక్

మన వ్యక్తిగత స్థలంలోనో, పంట పొలంలోనో టేకు చెట్లున్నాయి. వాటిని కొట్టి కర్రను వినియోగించుకోవాలనుకుంటే.. ఇది వరకు అటవీ శాఖ కార్యాలయంలో సంప్రదించాల్సి వచ్చేది. అధికారులు, సిబ్బంది చేయి తడిపితేనో, లేక రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తేనో పనయ్యేదన్న భావన చాలా మందిలో ఉండేది. దీనికి నిదర్శనమే అన్నట్లుగా నిబంధనలు, ఇతరత్రా అంశాలను సాకుగా చూపి, తిప్పించుకున్న, ఏసీబీకి పట్టించిన ఘటనలు లేకపోలేదు. సామిల్‌లో కలపతో తయారైన వస్తువులను, టింబర్ డిపోలో ఉన్న కర్రను కొనుగోలు చేసిన వినియోగదారులు వాటిని తమ ప్రాంతానికి తీసుకెళ్లాలంటే అటవీ అధికారుల అనుమతి తప్పనిసరి. ఇదంతా మాన్యువల్‌గా ఉండేది. కర్ర పరిమాణం, కర్రతో తయారు చేసిన వస్తువులు, ఎప్పుడు, ఎక్కడి నుంచి ఎక్కడకు తీసుకెళ్తారు, ఏ వాహనంలో తరలిస్తారు.. ఇలా అన్ని వివరాలను రాసి, ఎస్ఆర్ సంతకం తీసుకున్నాకే తీసుకెళ్లేందుకు అవకాశం ఉండేది. అనుమతి రాకపోతే వచ్చే వరకు ఎదురుచూడాల్సి వచ్చేది. అయితే, కొందరు సామిల్ నిర్వాహకులు అధికారులను మచ్చిక చేసుకొని, సదరు అనుమతిని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. ఒకటే పర్మిట్‌ను నాలుగైదు చోట్లకు వినియోగించడం, తక్కువ వస్తువులను చూపి, ఎక్కువ తీసుకెళ్లడం.. ఇలా చేతివాటం ప్రదర్శించేవారన్న విమర్శలు ఎన్నో. ఇప్పుడు ఇలాంటి అక్రమాలకు చెక్ పడుతుంది.

రేషన్ దుకాణాల్లో పంచదార

- వచ్చే నెల నుంచి పంపిణీ
- ఏఏవై కార్డుదారులకే..



కరీంనగర్ అర్బన్: ఇకపై రేషన్ దుకాణాల్లో చక్కెర పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ డీలర్లను ఆదేశించగా తదనుగుణ చర్యలు మొదలయ్యాయి. ఉచిత బియ్యంతో పాటు పంచదార విధిగా ఇవ్వాలని సూచించటంతో చౌకధర దుకాణాల డీలర్లకు మరింత ఆర్థిక భరోసా లభించనుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు బియ్యంతో పాటు చక్కెర, గోధుమలు, ఎనిమిది రకాల సరుకులను డీలర్లు పంపిణీ చేసేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం చౌకధర దుకాణాల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారు. ప్రతి చౌకధర దుకాణం వద్ద స్టాక్‌బోర్డుపై బియ్యం, చక్కెర, గోధుమలతో పాటు 8 రకాల సరకుల ధరలు రాసి పెట్టినా పంపిణీ మాత్రం జరగటం లేదు. పేదలకు రూ.13.50 ధరకే లభించాల్సిన పంచదార అందని ద్రాక్షలా మారింది. రేషన్ దుకాణాల్లో విక్రయించకపోవడంతో పేద కుటుంబాలు పండగల వేళ కిలో రూ.48 చెల్లించి కిరాణ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇక నుంచి చౌకధర దుకాణాల్లో చక్కెర కూడా పంపిణీ చేయాలని పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు డీలర్లను ఆదేశించడంతో ఏఏవై కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఏవై కార్డుదారులకే

అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డులు కలిగిన పేదలకు కిలో చొప్పున చక్కెర పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశించారు. డీలర్లు అప్రమత్తం అయ్యారు. వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు బియ్యంతో పాటు పంచదారకు డీడీలు తీసేందుకు సిద్ధపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 566 రేషన్ దుకాణాలుండగా 2.74లక్షల కార్డుదారులున్నారు. కాగా పంచదార కేవలం అంత్యోదయ అన్న యోజన కార్డులకే పరిమితం చేశారు. సదరు కార్డుదారులు జిల్లాలో 9వేల వరకు ఉండగా మొత్తం కార్డుల్లో 5శాతం మాత్రమే. అన్ని రకాల కార్డుదారులకు వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.


పెద్ద సేవలపై స్వామి వారల దర్శనం

శ్రీసీతారాములకు ప్రత్యేక పూజలు

- అశ్వవాహనంపై ఊరేగింపు

వేములవాడ: రాజన్న ఆలయంలో కొనసాగుతున్న శ్రీరామ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అశ్వవాహనంపై ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు.

ఫ్యాషన్

డిజిటల్ జెండర్ గ్యాప్‌ను
కోడింగ్ చేసింది!



● కోడింగ్‌లో శిక్షణ పొందుతున్న అమ్మాయిలు

స్త్రీలు సాంకేతికంగా కూడా సాధికారిత సాధించాలనే లక్ష్యంతో వారికి ఉచితంగా కోడింగ్ పాఠాలు నేర్పుతోంది ఢిల్లీవాసి 23 ఏళ్ల జష్మిత్ అహూజా. కోడింగ్ తెలిసిన వారికి ఉద్యోగావకాశాలు అధికంగా లభిస్తాయి. ఈ రకంగా దేశంలో ఆర్థికంగా వెనుకబడిన అమ్మాయిలకు ఆశాజ్యోతిగా మారింది జష్మిత్. ఇప్పటి వరకు 2 వేల మంది అమ్మాయిలకు ఉచితంగా డిజిటల్ పాఠాలు నేర్పింది. వంద మంది వాలంటీర్ల బృందానికి నాయకత్వం వహిస్తోంది.

ఢిల్లీకి చెందిన జష్నిత్ అహూజాకు కోడింగ్ అంటే చాలా ఆసక్తి. దాంతో కోడింగ్ నేర్చుకోవడం మీదనే దృష్టిపెట్టింది. అదే సమయంలో ఆమె ఒక విషయాన్ని గుర్తించింది. అదేమంటే, కోడింగ్ రంగంలో స్త్రీలు చాలా తక్కువగా ఉన్నారనీ, ఆ ఉన్న వారిలో కూడా చాలామందికి దానిపై తగినంత పరిజ్ఞానం లేదనీ. మిగిలిన వారితో పోల్చితే కోడింగ్ తెలిసిన వాళ్లకి ఉద్యోగావకాశాలు కాసింత ఎక్కువగానే దొరుకుతాయి. అయితే ఆ రంగంలో పురుషులదే పై చేయి. దాంతో సాంకేతికపరంగా ఏమైనా ఉద్యోగాలు ఉంటే కోడింగ్‌లో వారే ముందుకు దూసుకుపోవడం వల్ల ఆ ఉద్యోగాలు కూడా వారే ఎక్కువగా దక్కించుకోగలుగుతున్నారు.

ఇప్పటిదాకా స్త్రీలు ఎన్నో రంగాలలో పట్టుదలతో కృషి చేసి, పై చేయి సాధించగలుగుతున్నప్పుడు కోడింగ్‌లో మాత్రం పట్టు ఎందుకు సాధించకూడదు... అని ఆలోచించింది.

అంతే... ముందు తాను ఆ రంగంలో బాగా కృషి చేసింది. పట్టుదలతో కోడింగ్ నేర్చుకుంది... ఆ రకంగా అందులో చకచకా పై మెట్టుకు చేరిపోగలిగింది. తన లాగే మరికొందరు ఆడపిల్లలకు కూడా కోడింగ్ నేర్పితేనో... అనుకుంది. అలా అనుకోవడం ఆలస్యం... ఇతర అమ్మాయిలను కొందరిని పోగు చేసి తనకు తెలిసిన దానిని వారికి ఉచితంగా పాఠాలు నేర్పడం ఆరంభించింది. అలా తన 16వ ఏట ఆమె 'గో గర్ల్' అనే సంస్థను స్థాపించింది. అయితే భాష సమస్య రాకుండా వారికి వచ్చిన స్థానిక భాషలోనే ఉచితంగా కోడింగ్‌ను నేర్పడం ఆమె ప్రత్యేకత. తోటి ఆడపిల్లలను సాంకేతికంగా ఎదిగేలా చేయడం కోసం ఎంచుకున్న లక్ష్యం, అందుకు ఆమె చేసిన కృషీ వృథా పోలేదు. చాలా మంది అమ్మాయిలు ఆమె దగ్గర కోడింగ్ నేర్చుకుని మంచి ఉద్యోగావకాశాలను సాధించుకోగలిగారు. అలా తనకు లభించిన ప్రోత్సాహ ఉత్సాహంతో తన వయసు ఆడపిల్లలకే కాదు, తల్లి వయసు స్త్రీలకు కూడా కోడింగ్ నేర్పడం మొదలు పెట్టింది. అలా తనకు 23 ఏళ్లు వచ్చేసరికి చిన్న, పెద్ద కలిసి దాదాపు రెండు వేల మందికి పైగా ఆమె వద్ద కోడింగ్ నేర్చుకుని సాంకేతికంగా అభివృద్ధి చెంది, తమ కాళ్ల మీద తాము నిలబడగలిగారు. అన్నింటికన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ఆరవ తరగతి చదివేటప్పుడే కోడింగ్ రంగంలో సాధించిన ప్రావీణ్యం బాల మేధావిగా ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టింది.

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ "చిన్నప్పుడు స్కూల్ నుంచి రాగానే అమ్మానాన్న ఆఫీసులనుంచి ఇంటికి వచ్చేలోగా వారికోసం ఎదురు చూస్తూ రకరకాల వెబ్‌సైట్లకు రూపకల్పన చేసేదానిని. అప్పుడు నాన్న నాతో.. 'ఈ పిచ్చి పిచ్చి వెబ్‌సైట్లు కాదు బేబీ... నువ్వు నాసా సైంటిస్ట్‌గా ఎదగాలి. తలచుకుంటే నీకదేమీ ఒక లెక్కలోనిది కాదు' అని చెప్పిన మాట నన్ను ఎంతో ప్రభావితం చేసింది. అలా ఎయిత్ క్లాస్‌కు వచ్చేసరికి పెద్దయ్యాక నేను చేయవలసింది ఉద్యోగం కాదని... సాంకేతికంగా అభివృద్ధి చెందడం, దానిద్వారా నేను నేర్చుకున్న పాఠాలను పదిమందికీ చెప్పడంలోనే ఎంతో థ్రిల్ ఉందనీ అర్థమైంది. నా దగ్గర కోడింగ్ పాఠాలు నేర్చుకున్న వారే తమంతట తాము స్వచ్ఛందంగా ఇతరులకు నేర్పించడం మొదలు పెట్టారు. ఆ విధంగా 'కోడింగ్ ఫర్ ఉమెన్ బై ఉమెన్' కాన్సెప్ట్ మాకు బాగా ఉపకరించింది. అంతే కాదు, డిజిటల్ జెండర్ గ్యాప్ అనే వివక్షను పూడ్చాలన్న నా స్వప్నం సాకారం అయ్యేందుకు ఉపకరించింది. ఏమైనా పిల్లలు గ్యాడ్జెట్స్‌తో ఆడుకుంటున్నప్పుడు వాళ్లు వాటితో ఏం చేస్తున్నారో... తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలి. దానిని వారు మంచికే ఉపయోగిస్తున్నారు అని గుర్తించగలిగితే ఆ దిశగా వారిని ప్రోత్సహించడం మంచిది. నా తల్లిదండ్రులు కోడింగ్‌పై నాకున్న ప్యాషన్‌ను గుర్తించకుండా ఏవో పిచ్చి ఆటలు ఆడుతున్నాను అనుకుని దానికి అడ్డుకట్ట వేసి ఉంటే నేను ఈ స్థాయికి ఎదిగి ఉండేదానిని కాను" అని ఆమె చెప్పిన మాటలు ఆలోచించదగ్గవి.













నెయిల్
క్లాసికల్ జ్యూవెలరీ

నెయిల్ ఆర్ట్ గురించి మనకు తెలిసిందే. ఎన్నో డిజైన్లు మన చూపు తిప్పకోనివ్వవు. ఆర్టిఫిషియల్ నెయిల్స్‌ని అతికించి మరీ చూడచక్కని డిజైన్లతో చేసే ఆ అలంకారం వేలి కొసలలో మెరుపులుగా కనువిందు చేస్తుంది. ఇప్పుడు వాటి స్థానాన్ని నెయిల్ జువెలరీ ఆక్రమిస్తోంది. ఫింగర్ క్లా రింగ్స్‌గా ఈ నెయిల్ జ్యువెలరీ ఆధునికమైన టచ్‌తో అందంగా రూపుకడుతుంది. ప్రాచీనకాలంలో రక్షణలో భాగంగా చేరిన ఈ ఆభరణం ఇప్పుడు సొగసైన అలంకార జాబితాలో చేరి ప్రత్యేకతను చాటుతోంది.

బంగారు, వెండి, ఇతర లోహాలలోనూ ఈ నెయిల్ జ్యువెలరీ అందుబాటులో ఉంది. సంప్రదాయం, ఆధునికం ఏ వేడుకైనా కొత్తగా వెలిగిపోవాలని కోరుకునే వారికి ఈ నెయిల్ రింగ్స్ సరైన ఎంపిక అవుతాయి. లోహపు డిజైన్లలో ముత్యాలు, రత్నాలు, ఎనామిల్.. వంటివి జతచేసిన డిజైన్ల ఎంపిక మనదైన ప్రత్యేకతను చాటుతుంటుంది. లోహాన్ని బట్టి, డిజైన్‌ను బట్టి ధరలు వందల రూపాయల నుంచి అందుబాటులో ఉన్నాయి.

చరిత్రలో నెయిల్ జువెలరీ



ప్రాచీన చైనా, ఈజిప్ట్ రాజులు, రాణుల ఈ నెయిల్ క్లా జ్యువెలరీ విరివిగా ధరించేవారు. పొడవాటి గోర్లు సంపదకు చిహ్నంగా భావించేవారు. వాటి వల్ల శారీర శ్రమ చేయవలసి అవసరం లేదు. అలా శ్రమ చేయాల్సిన అవసరం లేని వారు, స్థితిమంతులుగా జాబితాలో ఉండేవారు. అంతేకాదు, నెయిల్ గార్డ్‌గా పిలిచే ఈ ఆభరణాన్ని ధరించడం ప్రాచీన చైనీస్ మహిళలు శక్తికి, అందానికి చిహ్నంగా భావించేవారు. నెయిల్ క్లా లేదా గార్డుల తయారీలో సాధారణంగా లోహాలు లేదా సముద్ర తీరాల్లో లభించే ఆల్చిప్పల పెంకులను కూడా ఉపయోగించేవారు. అయితే, ఎక్కువగా బంగారం, వెండి, కాంస్య లేదా పోత పోసిన లోహంతో తయారు చేస్తారు. ముత్యాలు, విలువైన రాళ్లను వాటిలో పొదుగుతారు. వేలిగోళ్ల గార్డు ధరించిన వారి సామాజిక స్థితిని తెలియజేసేది. 3సెం.మీ నుండి దాదాపు 15 సెంటీ మీటర్ల వరకు ఉండేలా డిజైన్ చేయించేవారు. కొన్నిసార్లు చిటికెన వేలు, ఉంగరపు వేలికి సరిపోయేలా డిజైన్ చేయించుకునేవారు. కుడి చేతి, ఎడమ చేతి డిజైన్లు భిన్నంగా ఉండేవి. తమ దేశ సంప్రదాయ ఆభరణాలలో భాగంగా ఉన్నా, రక్షణ కోసం ఉపయోగించేవిగా పేరొందాయి. వారి వారి దేశాల్లోని నాణేలు, జంతువులు, పక్షులు, మొక్కల బొమ్మలను నెయిల్ గార్డ్స్‌పైన డిజైన్ చేయించేవారు.

మహారాణి కళ







జువెలరీ డిజైన్ సృష్టి, ఎంపిక అనేవి మన భావ వ్యక్తీకరణ పట్ల నుండి పుట్టుకు వచ్చిన ఆలోచన. నా డిజైన్స్ ఎక్కువగా బంజారా సంస్కృతికి అద్దం పడతాయి. ఎన్నో ఏళ్లుగా చూసిన వివిధ జాతుల సంస్కృతి, కళలు నా డిజైన్స్‌లో కనిపిస్తాయి. క్లియోపాత్రా నుంచి ప్రేరణ పొందిన నెయిల్ రింగ్స్ అలంకరణ మహారాణి కళను తీసుకువస్తుంది.



– భవ్య రమేష్, జ్యువెలరీ డిజైనర్

బ్యూటిప్స్
మృదువుగా.. ముడతలు లేకుండా..!

ముఖ చర్మం మృదువుగా ముడతలు లేకుండా ఉండాలంటే చర్మాన్ని తేమగా ఉండేలా చూసుకోవడం అవసరం. ఇందుకు బీట్‌రూట్ దుంప బాగా ఉపయోగపడుతుంది. బీట్‌రూట్‌ను చెక్కు తీసి సన్నగా తురుముకుని రసం తీసుకోవాలి. ఈ రసంలో కొద్దిగా తేనె కలిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి.

అలాగే కొన్ని గులాబీ ఆకులను తీసుకుని వాటికి తగినన్ని నీటిని చేర్చి మెత్తగా రుబ్బుకుని ముఖానికి రాసుకోవాలి. ఆరిన తర్వాత కడిగేసుకుంటే ముఖం తేమగా ఉంటుంది. ఇది ముఖానికి గులాబీ రంగుని ఇస్తుంది. ఇవి అందుబాటులో లేకపోయినా లేదా తగిన సమయం లేకున్నా, ముఖంపై రోజ్‌వాటర్‌ను చల్లుకున్నా ఇది చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. ముఖంపై, బుగ్గల పైన తేనె రాసుకుని ఆరాక శుభ్రం చేసుకున్నా ముఖం స్మూత్‌గా.. మెరుస్తూ కనిపిస్తుంది.

చలువ పొట్లం

వంటిల్లు

పొట్లకాయ... స్నేక్‌గార్డ్.
చూడడానికి పాములా భయపెడుతుంది.
కానీ... ధైర్యంగా నమిలి మింగేస్తే సరి.
పొట్టలోకి వెళ్లి చల్లగా కాపాడుతుంది.
సమ్మర్ గార్డ్ ఫ్యామిలీలో ఇదీ ఒకటి.
పొట్టను కాపాడే కాయ... పొట్లకాయ.
వేడి నుంచి రక్షించే... కూరగాయ.

పొట్లకాయ పెసరపప్పు



కావలసినవి: పొట్లకాయ ముక్కలు– 2 కప్పులు; పెసరపప్పు – అర కప్పు ; కొబ్బరి తురుము – అర కప్పు ; ఆవాలు – టీ స్పూన్ ; మినప్పప్పు – 2 టీ స్పూన్‌లు ; ఎండుమిర్చి – 2 ; కరివేపాకు – 2 రెమ్మలు ; ఇంగువ– పావు టీ స్పూన్ ; నూనె లేదా నెయ్యి – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; చక్కెర – టీ స్పూన్.

తయారీ: ● బంగాళాదుంపను శుభ్రం చేసి నిలువుగా కోసి గింజలను తొలగించిన తర్వాత ముక్కలు చేయాలి. పెసరపప్పు కడిగి పక్కన పెట్టాలి ● పాత్రలో రెండు కప్పుల నీటిని పోసి మరిగేటప్పుడు పొట్లకాయ ముక్కలు, పెసరపప్పు వేసి ఉడికించాలి. పప్పు ఒక మోస్తరుగా ఉడికిన తర్వాత ఉప్పు కలిపి పొట్లకాయ ముక్కలు మెత్తబడే వరకు ఉడికించాలి. ముక్కలు ఉడకడానికి నీరు సరిపోకపోతే మరికొంత నీటిని చిలకరించి ఉడికించాలి ● బాణలిలో నెయ్యి వేడి చేసి ఆవాలు వేయాలి. అవి వేగిన తర్వాత మినప్పప్పు, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేయాలి. మినప్పప్పు వేగిన తర్వాత చక్కెర, ఉడికించి సిద్ధంగా ఉంచిన పొట్లకాయ– పెసరపప్పును వేసి కలపాలి. తేమ ఆవిరి అయ్యే వరకు కలియబెడుతూ వేయించి చివరగా కొబ్బరి తురుము వేసి కలపాలి. కొబ్బరి రుచి కూరగాయ ముక్కలకు పట్టడం కోసం ఓ నిమిషం పాటు గరిటెతో కలియబెడుతూ వేయించి స్టవ్ ఆపేయాలి. వేడి తగ్గే కొద్దీ కూర రుచి ఇనుమడిస్తుంది. ఇది సాంబార్, రసం అన్నంలోకి సైడ్ డిష్‌గా రుచిగా ఉంటుంది.

పొట్లకాయ పొరిచ్చ కొళంబు



కావలసినవి: కందిపప్పు – అరకప్పు; పొట్లకాయ ముక్కలు – 3 కప్పులు ; సాంబారు పొడి – టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నిమ్మకాయ రసం – ఒక టేబుల్ స్పూన్. **పొడి కోసం:** ధనియాలు – 2 టీ స్పూన్‌లు; పచ్చి శనగపప్పు – 2 టీ స్పూన్‌లు ; ఎండుమిర్చి – 2; మినపప్పు– టీ స్పూన్ ; ఎండు కొబ్బరి తురుము – పావు కప్పు ; ఇంగువ – చిటికెడు ; నూనె – టీ స్పూన్. **పోపు కోసం:** నూనె – టీ స్పూన్ ;ఆవాలు – టీ స్పూన్ ; మినప్పప్పు – టీ స్పూన్ ; కరివేపాకు– 2 రెమ్మలు. **తయారీ:** ● కందిపప్పును శుభ్రంగా కడిగి ప్రెషర్ కుకర్‌లో వేసి తగినంత నీటిని పోసి ఉడికించి పక్కన ఉంచాలి ● పొడి కోసం తీసుకున్న దినుసులను వేయించి పొడి చేసి పెట్టుకోవాలి ● పొట్లకాయను శుభ్రంగా కడిగి తరిగి గింజలు తొలగించి ముక్కలను సిద్ధం చేసుకోవాలి ● ఒక పాత్రలో ఉప్పు, సాంబారు, పొట్లకాయ ముక్కలు వేయాలి. ముక్కలు మునిగేటట్లు నీటిని పోసి మెత్తగా ఉడికించాలి ● ఉడికిన కందిపప్పు చల్లారిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇందులో ఉడికించిన పొట్లకాయ ముక్కలను, మసాలా పొడి వేసి నీరు పోసి కలిపి ఉడికించాలి. పప్పు, కూరగాయ ముక్కలు, మసాలా పొడి అన్నింటి రుచి కలిసే వరకు ఉడికించి, నిమ్మరసం కలిపి దించేయాలి. రుచి చూసి అవసరమైతే ఉప్పు, నిమ్మరసం మరికొంత చేర్చుకోవచ్చు ● పోపు కోసం మందపాటి పాత్ర తీసుకోవాలి. పాత్రలో నూనె వేడి చేసి ఆవాలు వేసి చిటపటలాడిన తర్వాత మినప్పప్పు వేయించి కరివేపాకు వేసి ముందుగా ఉడికించి సిద్ధంగా ఉంచిన కందిపప్పు కూరగాయ ముక్కల మిశ్రమాన్ని పోసి కలిపి దించేయాలి. ఘుమఘుమలాడే పొట్లకాయ పొరిచ్చ కొళంబు రెడీ. ఇది అన్నంలోకి బాగుంటుంది.

పొట్లకాయ పచ్చడి



కావలసినవి: పొట్లకాయ ముక్కలు – కప్పు; ఎండుమిర్చి –3 ; మినప్పప్పు – టేబుల్ స్పూన్ ; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్ ; వేరు శనగపప్పు లేదా నువ్వులు లేదా కొబ్బరి తురుము – పావు కప్పు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నెయ్యి లేదా నూనె – టేబుల్ స్పూన్; చింతపండు– అంగుళం ముక్క ; బెల్లం పొడి– టీ స్పూన్ (ఇష్టమైతేనే).
పోపు కోసం: నూనె– టేబుల్ స్పూన్ ; ఆవాలు– టీ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్ ; ఎండుమిర్చి– ఒకటి; ఇంగువ– చిటికెడు ; కరివేపాకు– 2 రెమ్మలు.
తయారీ: ● మందపాటి బాణలిలో నెయ్యి లేదా నూనె వేడి చేసి మినప్పప్పు, పచ్చి శనగపప్పు, నువ్వులు, ఎండుమిర్చిని దోరగా వేయించి మరొక ప్లేట్‌లోకి తీసుకుని పక్కన పెట్టాలి. అదే బాణలిలో పొట్లకాయ ముక్కలను వేసి పచ్చిదనం తగ్గేవరకు వేడి చేసి ఆపేయాలి ● చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి, అందులోనే చింతపండు, బెల్లం, ఉప్పు కలిపి మరో రౌండ్ తిప్పాలి. ఇప్పుడు పొట్లకాయ ముక్కలు కూడా వేసి గ్రైండ్ చేసి మరొక పాత్రలోకి తీసుకోవాలి ●ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు వేసి వేగిన తర్వాత మినప్పప్పు, ఎండుమిర్చి, ఇంగువ, కరివేపాకు వేసి దోరగా వేయించి పచ్చడిలో వేసి కలపాలి. ఇది అన్నంలోకి ఇడ్లీ, దోసెల్లోకి కూడా రుచిగా ఉంటుంది.

పొట్లకాయ వేపుడుకూర



కావలసినవి: పొట్లకాయ ముక్కలు – పావుకేజీ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; జీలకర్ర– టీ స్పూన్ ; పసుపు– పావు టీ స్పూన్ ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; ఇంగువ– చిటికెడు ; కారం – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నెయ్యి– టేబుల్ స్పూన్ ; నీరు– పావు కప్పు ; వేరుశనగ పప్పుల పొడి లేదా శనగపిండి– టేబుల్ స్పూన్.

తయారీ: ● బాణలిలో నెయ్యి వేడి చేసి జీలకర్ర వేసి చిటపటలాడిన తర్వాత ధనియాలపొడి, కారం పొడి, పసుపు, ఇంగువ వేసి కలపాలి. పచ్చిదనం పోయిన తర్వాత ఇందులో ఉప్పు వేసి, కొద్దిగా నీటిని పోసి కలపాలి. మసాలా పొడులన్నీ సమంగా కలుస్తాయి. ఇప్పుడు స్టవ్ ఆపేసి బాణలిలో పొట్లకాయ ముక్కలు వేసి మసాలా సమంగా పట్టేటట్లు కలపాలి. ముక్కలకు మసాలా సమంగా పట్టిన తర్వాత స్టవ్ వెలిగించి ముక్కల్లో నీటిని పోసి కలిపి మంట తగ్గించి మూత పెట్టాలి. రెండు నిమిషాలకోసారి మూత తీసి గరిటెతో ముక్కలను కలిపి మళ్లీ మూత పెడుతుండాలి. పది నిమిషాలకు ముక్కలు మెత్తగా మగ్గిపోతాయి. ముక్కలు ఉడకలేదనిపిస్తే కొద్దిగా నీటిని చిలకరించి మళ్లీ మూత పెట్టి ఉడికించాలి. చివరగా వేరుశనగపప్పు పొడి లేదా శనగపిండి చల్లి బాగా కలిపి దించేయాలి. ఇది అన్నంలోకి, చపాతీల్లోకి రుచిగా ఉంటుంది.

యువర్స్

● గేమింగ్

సోల్ ఎనర్జీ



సర్జెంట్ స్టూడియోస్ వారి 'టేల్స్ ఆఫ్ కెన్‌జెర' ఈ నెల 23న విడుదల కాబోతోంది. ఈ గేమ్‌లో ప్రధాన పాత్ర జావ్. డబుల్ జంప్, వాల్ జంప్, గాల్లో గంతులు వేయడంలో దిట్ట. మూడు ఆత్మలను బంధించి మృత్యుదేవత కలుంగకు అర్పిస్తుంది. సన్ మాస్క్, మూన్ మాస్క్ అనేవి జావ్ ప్రధాన ఆయుధాలు. శత్రువుల ఆటకట్టించడంలో ఈ రెండు ఆయుధాలకు తమదైన ప్రత్యేకత ఉంది. శత్రువులను జయించినప్పుడు వారి నుంచి 'ఉలోగి' అనే సోల్ ఎనర్జీని కలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. 'టేల్స్ ఆఫ్ కెన్‌జెర' అనేది 2.5డీ ప్లాట్‌ఫామ్ అడ్వెంచర్ గేమ్. ప్లేయర్స్ క్రమంగా కొత్త కొత్త స్కిల్స్‌ను సొంతం చేసుకుంటారు.

ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, నిన్‌టెండో స్విచ్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
మోడ్: సింగిల్ ప్లేయర్

● టెక్.. టాక్

షావోమి వాచ్ 2




డిస్‌ప్లే: 1.43 అంగుళాలు
రిజల్యూషన్: 466×466 పిక్సెల్స్ ● లైట్ వెయిట్ ● 150 స్పోర్ట్స్ మోడ్స్ ● బ్యాటరీ: 495 ఎంఏహెచ్ ● స్లీప్ ట్రాకింగ్

పోకో ఎక్స్ 6 నియో 5జీ



డిస్‌ప్లే: 6.67 అంగుళాలు ఓఎస్: ఆండ్రాయిడ్ 13
ర్యామ్: 8జీబి, 12జీబి స్టోరేజ్: 128జీబి, 256జీబి
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
బరువు: 175.00 గ్రా.

● ఇంగ్లీష్ ఇడియమ్స్



మోర్ దేన్ మీట్స్ ది ఐ

'అనుకున్నంత సులభం కాదు' అనుకున్నప్పుడు, ఊహించిన దానికి పూర్తి భిన్నంగా ఉండడం...మొదలైన సందర్భాలలో వాడే మాట... మోర్ దేన్ మీట్స్ ది ఐ.
ఉదా: ఐ హ్యాడ్ డన్ సమ్ రిసెర్చ్. బట్ దేర్ ఈజ్ మోర్ టు ది సబ్జెక్ట్ దెన్ మీట్స్ ది ఐ

టర్న్ ది క్లాక్ బ్యాక్

పూర్వస్థితికి తీసుకురావడం, గతంలోకి వెళ్లడం, వోల్డ్–ఫ్యాషన్ ఐడియాలు...మొదలైన సందర్భాలలో వాడే మాట...టర్న్ ది క్లాక్ బ్యాక్.
ఉదా: ది కోర్ట్స్ డెసిషన్ ఇన్ దిస్ కేస్ విల్ టర్న్ ది క్లాక్ బ్యాక్

● సక్సెస్ స్టోరీ


దిప్రజ్ జాదవ్

దిగ్విజయ దిప్రజ్

'అనుకోలేదని ఆగవు కొన్ని' అంటాడు కవి.
డిజిటల్ కంటెంట్ క్రియేటర్ కావాలని దిప్రజ్ జాదవ్ ఎప్పుడూ అనుకోలేదు. డిజిటల్ కంటెంట్ క్రియేషన్ అంటే ఏమిటో కూడా తెలియదు. సరదాగా చేసిన ఒక వీడియో అతడి స్థాయిని ఎక్కడికో తీసుకెళ్లింది. ప్రముఖ డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌గా డిజిటల్ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చింది...

ఒక వైరల్ వీడియోతో మహారాష్ట్రలోని షిర్పూర్ అనే చిన్న పట్టణానికి చెందిన దిప్రజ్ జాదవ్ జీవితం ఊహించని మలుపు తిరిగింది. మరాఠీ సినిమా 'లై బారి'లోని ఒక డైలాగ్ మీమ్ మాషప్ చేశాడు జాదవ్. బాలీవుడ్ హీరో రితేష్ దేశ్‌ముఖ్ దృష్టిని కూడా ఆ వీడియో ఆకట్టుకుంది. వైరల్ అయింది.

'ఫేస్‌బుక్‌లో నేను పేజీ స్టార్ట్ చేసినప్పుడు కంటెంట్ క్రియేషన్ అనేది పెద్ద విషయం కాదు. దానికి అంత ప్రాముఖ్యత కూడా లేదు. అలాంటి సమయంలోనే కొత్త కొత్త వీడియోలు చేసేవాడిని' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు దిప్రజ్ జాదవ్.

జాదవ్‌కు సినిమాలు అంటే చాలా ఇష్టం. అందులోని పాపులర్ సీన్‌లకు తనదైన స్టైల్ జోడించి అనుకరించే వాడు. పుణెలో యానిమేషన్ కోర్సు చేస్తున్నప్పుడు వీడియో ఎడిటింగ్‌పై ఇష్టం పెరిగింది.

విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను పర్‌ఫెక్ట్‌గా మిక్స్ చేయడంలో గట్టి పట్టు సంపాదించాడు. ఆ విద్య అతడికి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో ఎంతోమంది ఫాలోవర్స్‌ను తెచ్చిపెట్టింది.

సెకండ్ టర్నింగ్ పాయింట్ విషయానికి వస్తే,..,..

రామానంద్‌సాగర్ 'రామాయణం'లోని రాముడు, రావణుడికి మధ్య జరిగిన యుద్ధానికి సంబంధించిన వీడియోకు ర్యాపర్ డివైన్ పాడిన 'సీన్ క్యా హై' పాటను జోడించాడు. ఇది చూసి మ్యూజిక్ ప్రొడ్యూసర్ న్యూక్లియ(ఉద్యాన్ సాగర్) జాదవ్‌ను సంప్రదించి సబ్ సినిమా సిరీస్‌లో భాగంగా ఇలాంటి ఫిల్మీ మాషప్స్ మరిన్ని కావాలని, వాటిని మ్యూజిక్ ప్రోగ్రాంలలో ఉపయోగించుకుంటానని చెప్పాడు.

జాదవ్ క్రియేటివిటీకి న్యూక్లియ బాగా ఇంప్రెస్ అయ్యాడు. 'ఊహకు అందనిది ఆలోచించే సామర్థ్యమే అరుదైన సృజనాత్మకత. ఇలాంటి అరుదైన సృజనకారులలో జాదవ్ ఒకరు. రెండు పరస్పర విరుద్ధ అంశాలను మిళితం చేసి అందరినీ ఆకట్టుకుంటాడు' అంటాడు న్యూక్లియ.

చిత్రపరిశ్రమలో పనిచేయాలనేది జాదవ్ కోరిక. బాలీవుడ్‌లోని కొన్ని సినిమాలు, బాట్లా హౌజ్, రాకెట్ బాయ్స్‌లాంటి వెబ్‌సిరీస్‌లకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసే అవకాశం వచ్చింది.

'నేను చేస్తున్న పని గురించి నా తల్లిదండ్రులకు అవగాహన లేదు. ఏదైన స్థిరమైన ఉద్యోగం చేయాలని కోరుకునేవారు. అయితే నాకు వచ్చిన గుర్తింపు చూసిన తరువాత వారి ఆలోచన మారింది. నాపై నమ్మకం పెరిగింది' అంటాడు దిప్రజ్ జాదవ్.

28 సంవత్సరాల జాదవ్ 'ఫోర్బ్స్ 30 అండర్ 30–2024' జాబితాలో చోటు సాధించాడు.

కొత్త ద్వారాలు

'పదిమందిలో ఒకరు' అని కాకుండా పది మందికి భిన్నంగా ఆలోచించినప్పుడే మంచి ఫలితం సాధించగలం. ఒక టాపిక్ గురించి మనకు ఇష్టం ఏర్పడినప్పుడు దానికి సంబంధించి అన్ని కోణాల గురించి తెలుసుకోవాలి. అప్పుడే ఆ టాపిక్‌పై పట్టు వస్తుంది. కొత్తగా ఆలోచించడానికి ద్వారాలు తెరుచుకుంటాయి.
– దిప్రజ్ యాదవ్, డిజిటల్ కంటెంట్ క్రియేటర్

● ఆర్ట్ అండ్ కల్చర్

సమ్మోహనం



పదకొండు సంవత్సరాల వయసులోనే బాస్ గిటారిస్ట్‌గా మంచి పేరు తెచ్చుకుంది మోహిని డే. మోహిని మూడు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు తండ్రి సుజయ్ డే బాస్ గిటార్ చేతికి అందించాడు. అలా మూడు సంవత్సరాల వయసు నుంచే బాస్ గిటార్‌తో మోహిని ఫ్రెండ్‌షిప్ మొదలైంది.

జాజ్ ఫ్యూజన్ గిటారిస్ట్‌గా సంగీత ప్రయాణాన్ని మొదలుపెట్టిన సుజయ్ ఆ తరువాత జాజ్‌కు దూరమై కుటుంబ పోషణ కోసం కోల్‌కత్తా నుంచి ముంబైకి వచ్చాడు. సెషన్స్ ఆర్టిస్ట్‌గా మారాడు.

మోహిని విషయానికి వస్తే తండ్రి సుజయ్ తొలి మ్యూజిక్ టీచర్. తండ్రి సహకారంతో చిన్న వయసులోనే పేరున్న పెద్ద కళాకారులతో కలిసి సంగీత కచేరీలు చేసింది మోహిని.

పదమూడు సంవత్సరాల వయసులో ప్రసిద్ధ పృథ్వీ థియేటర్ నుంచి మోహినికి ఆహ్వానం అందింది.

'మ్యూజిక్ ప్రాక్టిస్ చేస్తున్న నా దగ్గరకు నాన్న వచ్చి రంజిత్ అంకుల్ నుంచి కాల్ వచ్చింది, బ్యాగ్ సర్దుకో అని చెప్పారు. పృథ్వీ థియేటర్‌కు వెళ్లిన తరువాత అక్కడ జాకీర్ హుస్సేన్‌ను, ఫిల్మ్‌స్టార్స్‌ను చూశాను. రంజిత్ అంకుల్ నన్ను జాకీర్ అంకుల్‌కు పరిచయం చేశారు. ఆ తరువాత స్టేజీ మీద బాస్ గిటార్ ప్లే చేశాను. మంచి స్పందన వచ్చింది' అంటూ తన మ్యూజికల్ మెమోరీలోకి వెళుతుంది మోహిని.

తండ్రి సుజయ్ బాస్ గిటారిస్ట్. ఎంత బిజీగా ఉన్నా కూతురికి సంగీత పాఠాలు నేర్పడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చేవాడు.

విక్టర్ వుటెన్ నుంచి మార్కస్ మిల్లర్ వరకు ఎంతో మంది గిటారిస్ట్‌ల ప్రభావం మోహినిపై ఉంది.

ఒకే స్టైల్‌కి పరిమితం కాకుండా రకరకాల స్టైల్స్‌ను ప్లే చేయడంలో ప్రావీణ్యం సంపాదించింది.

'రకరకాల స్టైల్స్‌ను ప్రాక్టిస్ చేస్తున్న క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. ఆ సవాళ్లను అధిగమించగలిగినప్పుడు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం దొరుకుతుంది. స్కూల్, కాలేజి రోజుల్లో నా ఆలోచనలు స్నేహితులకు వింతగా అనిపించేవి. నా ఆలోచనలు, ఐడియాలు ఎప్పుడు నా వయసు వారి కంటే చాలా భిన్నంగా ఉండేవి' అంటుంది మోహిని.

'ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటి?' అనే ప్రశ్నకు మోహిని ఇచ్చే జవాబు ఇది....'సొంతంగా మ్యూజిక్ స్కూల్ స్టార్ట్ చేయాలనేది నా కల. జంతుసంరక్షణకు సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొనాలనుకుంటున్నాను. వోన్ మ్యూజిక్ షోతో ప్రేక్షకులకు నచ్చే మ్యూజిక్ అందించాలనుకుంటున్నాను'

తల్లిదండ్రులే నా సంగీత పాఠశాల

తల్లిదండ్రులే నాకు వరం. వారు నాకు సంగీత పాఠశాలలాంటి వారు. ప్రశంస ఎవరికైనా సరే ఉత్సాహాన్ని ఇస్తుంది. నాకు ఎన్నో ప్రశంసలు వచ్చినప్పటికీ అహం ప్రదర్శించలేదు. ఇది కూడా నా తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్నదే. బాస్ గిటార్‌తో జీవనోపాధికి ఇబ్బంది అని, ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం కష్టం అనుకునే సమయంలో యువతకు బాస్ గిటార్‌పై ఆసక్తి పెరిగేలా చేశాను.
– మోహిని డే



అవును...ఇది నిజమే!

● 'పోలిస్' ఫుల్‌ఫామ్.... పబ్లిక్ ఆఫీసర్ ఫర్ లీగల్ ఇన్వెస్టిగేషన్స్ అండ్ క్రిమినల్ ఎమర్జెన్సీస్ ● కళ్లు మూసుకున్నప్పుడు మనకు కనిపించే రంగును 'ఐగన్‌గ్రావ్' అంటారు. ఇది నలుపురంగుకు భిన్నమైనది. ● థాయ్‌లాండ్ జాతీయ గ్రంథం రామకియన్. దీని అర్థం రామ మహిమ. ● ఆస్కార్ గెలుచుకున్న తొలి నాన్ హ్యూమన్ మిక్కీ మౌస్ యానిమేటెడ్ మిక్కీ మౌస్. ● ఏప్రిల్ 18,1930లో బీబీసి రేడియో 'నో న్యూస్ టుడే' అని ప్రకటించి న్యూస్‌కు బదులుగా పియానో మ్యూజిక్‌ను ప్రసారం చేసింది.

సినిమా


● గోపీచంద్

నా పేరు రాసి ఉంది!

గోపీచంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'విశ్వం' అనే టైటిల్ ఖరారు చేశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో ఈ చిత్రాన్ని దోనేపూడి చక్రపాణి సమర్పణలో టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. రంజాన్ సందర్భంగా ఈ మూవీ టైటిల్‌ని ప్రకటించి, ఫస్ట్ స్ట్రైక్ వీడియోను విడుదల చేశారు. వీడియో చివరలో 'దానే దానే పే లిఖా ఖానే వాలే కా నామ్, ఇస్‌పే లిఖా మేరే నామ్' (గింజ గింజ మీద తినేవాళ్ల పేరు రాసి ఉంటుంది.. దీని మీద నా పేరు రాసి ఉంది) అంటూ గోపీచంద్ చెప్పే డైలాగ్ ఉంది. ''హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'విశ్వం' రూపొందుతోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది 32వ సినిమా. తనని ఒక విభిన్నమైన పాత్రలో చూపించనున్నారు శ్రీను వైట్ల. కెమెరామేన్ కేవీ గుహన్ నైపుణ్యం ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. సినిమా సాంకేతికంగా ఎంత రిచ్‌గా ఉందో చేతన్ భరద్వాజ్ సంగీతం తెలియజేస్తుంది. ఈ చిత్రం హీరోయిన్, ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు మేకర్స్.


● రామ్‌చరణ్

రామ్ చరణ్‌కి గౌరవ డాక్టరేట్

ప్రముఖ హీరో రామ్ చరణ్‌కు చెన్నై వేల్స్ విశ్వ విద్యాలయం నిర్వాహకులు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించారు. రాజమౌళి దర్శకత్వం వహించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో అంతర్జాతీయ స్థాయిలో క్రేజ్ సొంతం చేసుకున్నారు హీరోలు రామ్‌చరణ్, ఎన్టీఆర్. నటుడిగానే కాకుండా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు రామ్‌చరణ్. ఆయన సినీ, సామాజిక సేవలను గుర్తిస్తూ వేల్స్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. రేపు (శనివారం) చెన్నైలో ఈ అవార్డు ప్రదానోత్సవం జరగనుందని ఆ విశ్వ విద్యాలయం అధినేత ఐసరి గణేశ్ తెలిపారు. ఇక ప్రస్తుతం 'గేమ్ చేంజర్' సినిమాతో బిజీగా ఉన్నారు రామ్‌చరణ్.

బాలీవుడ్ వార్‌లో...


● ఎన్టీఆర్

బాలీవుడ్ వార్‌లో పాల్గొనేందుకు ముంబై వెళ్లారు ఎన్టీఆర్. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'వార్ 2'. 2019లో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ లీడ్ రోల్స్‌లో నటించి, సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన హిట్ ఫిల్మ్ 'వార్'కు 'వార్ 2' చిత్రం సీక్వెల్. మలి భాగానికి 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే 'వార్ 2' సినిమా చిత్రీకరణ మొదలైంది. 'వైఆర్ఎఫ్' (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'వార్ 2' సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ నేడు ముంబైలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ పాల్గొనగా ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణను ప్లాన్ చేశారని సమాచారం. ప్రస్తుతం ఎన్టీఆర్ ముంబైలో ఉన్న ఫొటోలు వైరల్‌గా మారాయి. పది రోజులు 'వార్ 2' చిత్రీకరణలో పాల్గొంటారట ఎన్టీఆర్. ఈ షెడ్యూల్ పూర్తి కాగానే, హైదరాబాద్‌లో 'దేవర' చిత్రీకరణలో పాల్గొంటారని తెలిసింది. కొరటాల శివ దర్శకత్వంలో రెండు భాగాలుగా రూపొందుతున్న 'దేవర' తొలి భాగం అక్టోబరు 10న విడుదల కానుంది. ఇక 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్‌తో కూడా ఎన్టీఆర్ ఓ సినిమా అంగీకరించిన సంగతి తెలిసిందే.

ఓ భక్తురాలి కథ

మంచు లక్ష్మి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ కుమార్ మేగోటి దర్శకత్వంలో రావుల వెంకటేశ్వర రావు సమర్పణలో ఎమ్.ఎస్.కె నిర్మించారు. తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి మాధవ్ సైబా, సంజీవ్ మేగోటి, బి. సుల్తాన్ వలి, ఓపెన్ బనానా, లుబెక్ లీ మార్విన్ సంగీతం అందించారు. కాగా 'ఆదిపర్వం' ఆడియో ఆవిష్కరణ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలో సంగీత దర్శకులు ఆర్.పి. పట్నాయక్, ఎమ్.ఎమ్. శ్రీలేఖ, రఘు కుంచె, ఘంటాడి కృష్ణ ముఖ్య అతిథులుగా, నిర్మాత చీర్ల శ్రీనివాస యాదవ్, డ్యాన్స్ మాస్టర్ సన్ రేస్, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ వి. ఉదయ శంకర్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ''1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామా చిత్రం 'ఆదిపర్వం'. ఓ అమ్మవారి కథ.. అమ్మవారిని నమ్ముకున్న భక్తురాలి కథ. ఆ భక్తురాలిని దుష్ట శక్తుల నుండి కాపాడే ఓ క్షేత్రపాలకుడి కథ ఇది'' అన్నారు మేకర్స్.


● మంచు లక్ష్మి

దర్శకరత్న పేరుతో అవార్డులు



● ప్రసన్నకుమార్, బీఎస్ఎన్ సూర్యనారాయణ, భరద్వాజ, నరసింహారావు

– తమ్మారెడ్డి భరద్వాజ

''దర్శకరత్న దాసరి నారాయణరావుగారి 77వ జయంతి వేడుకలను మే 5న నిర్వహించనున్నాం. గురువుగారికి నివాళులు అర్పిస్తూ... అభినవ దర్శక రత్న, అభినయ రత్న, నిర్మాణ రత్న, పంపిణీ రత్న, ప్రదర్శనా రత్న, కథా రత్న, సంభాషణా రత్న, గీతా రత్న, పాత్రికేయ రత్న, 'సేవా రత్న' వంటి పురస్కారాలు ప్రదానం చేయనున్నాం. చిన్న, మీడియమ్ బడ్జెట్ సినిమాలకూ అవార్డులు ఇవ్వనున్నాం'' అని దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. తెలుగు సినీ రంగంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచినవారికి దర్శకరత్న దాసరి నారాయణరావు 77వ జయంతి సందర్భంగా 'దర్శకరత్న డి.ఎన్.ఆర్. ఫిల్మ్ అవార్డ్స్' పేరిట అవార్డులు ఇవ్వనున్నారు. మే 5న హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ఈ వేడుక జరగనుంది. ఈ అవార్డుల జ్యూరీ కమిటీ అధ్యక్షుడిగా తమ్మారెడ్డి భరద్వాజ, కార్యదర్శులుగా దర్శకుడు రేలంగి నరసింహారావు, నిర్మాత సి. కల్యాణ్, సభ్యులుగా నిహార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఫౌండర్, దాసరికి ఆడిటర్‌గా వ్యవహరించిన బీఎస్ఎన్ సూర్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు ప్రభు, ధీరజ అప్పాజీ ఉన్నారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో రేలంగి నరసింహారావు మాట్లాడుతూ– ''ఈ అవార్డుల ఎంపిక అత్యంత పారదర్శకంగా, ప్రామాణికంగా ఉంటుంది'' అన్నారు. ''ఇకపై ప్రతి ఏటా దాసరిగారి జయంతి, అవార్డుల వేడుక నిర్వహిస్తాం'' అన్నారు బీఎస్ఎన్ సూర్యనారాయణ.

సల్మాన్ ఖాన్ సికందర్


● సల్మాన్ ఖాన్

సల్మాన్ ఖాన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'సికందర్' టైటిల్ ఖరారైంది. గురువారం (ఏప్రిల్ 11) ఈద్ సందర్భంగా 'సికందర్' టైటిల్‌ను అధికారికంగా ప్రకటించి, టైటిల్ లోగోను కూడా విడుదల చేశారు మేకర్స్. సాజిద్ నడియాద్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఈద్‌కు రిలీజ్ కానుంది. ''ఈ ఈద్‌కు 'బడే మియా చోటే మియా', 'మైదాన్' సినిమాలను థియేటర్స్‌లో చూడండి. వచ్చే ఈద్‌కు 'సికందర్' వస్తాడు'' అంటూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు సల్మాన్ ఖాన్.

ఆస్కార్ డేట్ ఫిక్స్



తొంభైఆరవ ఆస్కార్ అవార్డుల వేడుక పూర్తయి నెల రోజులు మాత్రమే అవుతోంది (మార్చి 10న 96వ ఆస్కార్ అవార్డుల వేడుక జరిగింది). కానీ ఆస్కార్ అకాడమీ మాత్రం అప్పుడే 97వ ఆస్కార్ అవార్డుల వేడుకను గురించిన వివరాలను అధికారికంగా ప్రకటించింది. 2025 మార్చి 2న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ అట్మాస్ థియేటర్‌లో 97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరపనున్నట్లు ఆస్కార్ నిర్వాహకులు వెల్లడించారు. అలాగే వచ్చే ఏడాది జనవరి 17న ఆస్కార్ ఫైనల్ నామినేషన్స్ వివరాలను ప్రకటించనున్నట్లుగా కూడా తెలిపారు. ఇక ఈ ఏడాది నవంబరు 17న ఆస్కార్ గవర్నర్స్ అవార్డుల విజేతల ప్రకటన ఉంటుందని, డిసెంబరు 17న ఆస్కార్ షార్ట్‌లిస్ట్ జాబితాను వెల్లడిస్తారని, ఫిబ్రవరి 8తో ఫైనల్ ఓటింగ్ గడువు ముగుస్తుందని సమాచారం.

ఎక్కడి నుండి మొదలుపెడదాం


● దుల్కర్ సల్మాన్

'మిడిల్ క్లాస్ మెంటాలిటీ సర్.. మేమింతే', 'కష్టమొస్తే ఖర్చులు తగ్గించుకుని రూపాయి రూపాయి దాచుకుంటాం.. పంతం వస్తే ఒక్క రూపాయి కూడా మిగల్చకుండా ఖర్చు పెట్టేస్తాం సర్', 'ఎక్కడి నుండి మొదలుపెడదాం' అంటూ హీరో దుల్కర్ సల్మాన్ చెప్పిన డైలాగులు 'లక్కీ భాస్కర్' సినిమా టీజర్‌లో ఉన్నాయి. 'మహానటి', 'సీతారామం' వంటి చిత్రాలతో తెలుగులోనూ అభిమానులను సంపాదించుకున్న దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. గురువారం రంజాన్‌ను పురస్కరించుకుని ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు నిర్మాతలు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

జనతా బార్ సందేశం


● రాయ్ లక్ష్మి

రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'జనతా బార్'. రోచిశ్రీ మూవీస్ పతాకంపై అశ్వథ్ నారాయణ సమర్పణలో రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం మేలో రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. రాయ్ లక్ష్మి మాట్లాడుతూ– ''బార్ గర్ల్‌గా ప్రారంభమయ్యే నా పాత్ర సమాజంలోని మహిళలు గొప్పగా చెప్పుకునే స్థాయికి ఎలా ఎదిగింది? అన్నదే ఈ చిత్రం కథాంశం. ఈ సినిమాలో మంచి సందేశం కూడా ఉంది'' అని అన్నారు. ''కుస్తీ పోటీల నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ సినిమాతో సమాజంలో స్త్రీల ప్రాధాన్యతను మరోసారి చాటి చెప్పే ప్రయత్నం చేశాం'' అన్నారు రమణ మొగిలి.

సాక్షి బిజినెస్

శుక్రవారం
12-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
354	111
75,038	22,754

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్డాక్	16,336	▲ 167
డోజోన్స్	38,428	▼ 33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,924	▼ 37
డాక్స్	17,949	▼ 148
షాంఘై	3,034	▲ 7
నికాయ్	39,445	▼ 121

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.82	83.84
£	బ్రిటన్ పౌండ్		104.37	106.92
€	యూరో		89.25	91.63
¥	జపాన్ ఎన్ (100)		54.31	55.52
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.26	56.18
S$	సింగపూర్ డాలర్		59.55	64.25
SAR	సౌదీ రియాల్		21.29	22.84
UAE D	యూఏఈ దిర్హామ్		21.76	23.54
¥	చైనా యువాన్		10.38	12.45

యూఏఈలో 'ద టేస్ట్ కంపెనీ'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రెడీ టు ఈట్ సంస్థ 'ద టేస్ట్ కంపెనీ' యూఏఈలో ఎంట్రీ ఇచ్చింది. భారత్‌లో తొలిసారిగా రెడీ టు ఈట్ నాన్ వెజ్ ఉత్పత్తులను పరిచయం చేసిన ఈ కంపెనీ యూకే, యూఎస్ఏ, సింగపూర్‌లో త్వరలో అడుగుపెట్టనుంది. 18 రకాల అల్పాహారం, వెజ్, నాన్-వెజ్ మీల్ ఉత్పత్తులను తయారు చేస్తున్నట్టు ద టేస్ట్ కంపెనీ కో–ఫౌండర్, సీఈవో అనిల్ కుమార్ తెలిపారు. భారత్‌కు చెందిన ఆరు విమానయాన సంస్థలు కంపెనీ ఉత్పత్తులను ఆఫర్ చేస్తున్నాయి. అడ్వాన్స్‌డ్ డీహైడ్రేషన్, ఫ్రీజ్ డ్రైయింగ్ టెక్నాలజీ ప్లాంటును రూ.34 కోట్లతో హైదరాబాద్‌లో సంస్థ ఏర్పాటు చేసింది. నెలకు 30 లక్షల బాక్స్‌లను తయారు చేయగలదు. 2021లో ప్రారంభమైన సంస్థ 20 లక్షలకుపైగా బాక్స్‌లను విక్రయించింది. ప్రస్తుతం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఈ–కామర్స్ వేదికలతోపాటు కంపెనీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయిస్తోంది.

క్రిటికల్ రివర్ బోర్డులోకి పరిశ్రమ దిగ్గజాలు

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే టెక్నాలజీ కన్సల్టింగ్ సంస్థ క్రిటికల్‌రివర్‌లో పలువురు పరిశ్రమ దిగ్గజాలు కీలక హోదాల్లో చేరారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా ఫణీష్ మూర్తి, స్వతంత్ర డైరెక్టరుగా రాజు రెడ్డి చేరినట్లు సంస్థ తెలిపింది. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా నారాయణ మూర్తి, గ్లోబల్ హెడ్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ డిజిటల్ సొల్యూషన్స్‌గా సునీల్ శర్మ నియమితులయ్యారు. వారి అపార అనుభవం సంస్థ వృద్ధికి గణనీయంగా తోడ్పడగలదని వ్యవస్థాపకులు అంజి మారం ఆశాభావం వ్యక్తం చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-4-2024 ఫామ్ ధర...

విశాఖ	408-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	393-00
విజయవాడ	393-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	380-00
వరంగల్	382-00
రిటైల్ ధర	4.40



కార్పొరేట్ ఫలితాల సీజన్

నేటి నుంచి ప్రారంభం
- టీసీఎస్ రిజల్ట్స్‌తో షురూ
- వచ్చే వారం ఇన్ఫీ, విప్రో, టెక్‌ఎం
- క్యూ4, గైడెన్స్‌పై అంచనాలు వీక్!

న్యూఢిల్లీ: ఐటీ సేవల నంబర్‌వన్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) చివరి త్రైమాసిక(జనవరి–మార్చి) ఫలితాల సీజన్‌కు శ్రీకారం చుడుతోంది. నేడు (శుక్రవారం) క్యూ4తోపాటు.. మార్చితో ముగిసిన గత పూర్తిఏడాది(2023–24)కి సైతం పనితీరు వెల్లడించనుంది. అయితే క్యూ4సహా.. గతేడాదికి ఐటీ కంపెనీలు నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించే అవకాశమున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వెరసి సాఫ్ట్‌వేర్ రంగ కంపెనీల క్యూ4, పూర్తి ఏడాది పనితీరు వెల్లడికానుండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2024–25) ఆదాయ అంచనాలు(గైడెన్స్) సైతం ప్రకటించనున్నాయి. అయితే పలు కంపెనీలు నిరుత్సాహకర ఫలితాలనే ప్రకటించనున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఇందుకు బలహీన ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ఐటీ వ్యయాలు తగ్గడం తదితర అంశాలు ప్రభావం చూపనున్నట్లు పేర్కొంటున్నాయి. ఆర్థిక అనిశ్చితుల కారణంగా టెక్నాలజీ సేవలకు డిమాండ్ మందగించడం, ఐటీపై క్లయింట్ల వ్యయాలు తగ్గడం ఈ ఏడాది అంచనాలను సైతం దెబ్బతీసే వీలున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వెరసి ఐటీ కంపెనీలు అప్రమత్తతతో కూడిన గైడెన్స్‌ను ప్రకటించనున్నట్లు తెలియజేశాయి.

గ్లోబల్ దిగ్గజాలు సైతం

గ్లోబల్ దిగ్గజాలు యాక్సెంచర్, కాగ్నిజెంట్ టెక్నాలజీ, క్యాప్‌జెమిని సైతం ఈ క్యాలెండర్ ఏడాది(2024) ఓమాదిరి పనితీరును ఊహిస్తున్నాయి. ఫలితంగా తొలి అర్ధభాగం(జనవరి–జూన్)లో అంతంతమాత్ర వృద్ధిని అంచనా వేశాయి. అయితే ద్వితీయార్ధం(జూలై–డిసెంబర్)లో రికవరీకి వీలున్నట్లు అభిప్రాయపడ్డాయి. కాగా.. దేశీ ఐటీ దిగ్గజాలలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రక్షణాత్మక బిజినెస్ మిక్స్ ద్వారా లబ్ధి పొందే వీలున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ పేర్కొంది. ఇక డిజిటల్, బిజినెస్ ట్రాన్స్‌ఫార్మేషన్ విభాగాల కారణంగా టీసీఎస్, ఇన్ఫోసిస్ కీలక పురోగతిని సాధించవచ్చని అభిప్రాయపడింది.

బ్రోకింగ్ వర్గాల అంచనాలు

నేడు(12న) ఐటీ సేవల నంబర్‌వన్ కంపెనీ టీసీఎస్ క్యూ4సహా.. 2023–24 ఫలితాలను విడుదల చేయనుంది. ఈ బాటలో సాఫ్ట్‌వేర్ దిగ్గజాలు ఇన్ఫోసిస్ 18న, విప్రో 19న, టెక్ మహీంద్రా 25న, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 26న క్యూ4, గతేడాదికి పనితీరును వెల్లడించనున్నాయి. దేశీ ఐటీ కంపెనీలు క్యూ4లో అంతంతమాత్ర ఫలితాలను సాధించనున్నట్లు బ్రోకింగ్ సంస్థ ఎమ్‌కే ఇటీవల అంచనా వేసింది. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్–మార్చి)లో మాత్రమే రికవరీ ఆశలనుపెట్టుకోవచ్చునంటూ పేర్కొంది. అయితే క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో సాధించిన నిరాశామయ పనితీరుతో పోలిస్తే క్యూ4లో త్రైమాసికవారీగా కాస్తమెరుగైన ఫలితాలు సాధించవచ్చని బ్రోకింగ్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ అభిప్రాయపడింది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల రీత్యా ఐటీ సర్వీసులకు డిమాండ్ మందగించినట్లు పేర్కొంది. వెరసి కరోనా మహమ్మారి తలెత్తిన 2019–20ను మినహాయిస్తే వార్షికంగా 2008–09 తదుపరి బలహీన ఫలితాలు విడుదలయ్యే వీలున్నట్లు తెలియజేసింది. వ్యయాలు తగ్గడం ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది. ఐచ్చిక వ్యయాలు తగ్గడంతో ఐటీ పరిశ్రమలో ప్రస్తావించదగ్గ మార్పులకు అవకాశంతక్కువేనని అభిప్రాయపడింది. కాగా.. యూఎస్ ఫెడ్ సానుకూల దృక్పథం, పూర్తి చేయవలసిన భారీ ఆర్డర్లు వంటి అంశాలు ఈ ఏడాది(2024–25)లో ప్రోత్సాహక ఫలితాలకు దారిచూపవచ్చని అంచనా వేసింది. క్యూ4లో డీల్స్ ద్వారా సాధించే మొత్తం కాంట్రాక్టుల విలువ(టీసీవీ) సానుకూలంగానే కనిపిస్తున్నప్పటికీ ఆదాయంపై స్థూల ఆర్థిక పరిస్థితుల కారణంగా ఒత్తిడి కనిపించవచ్చని వివరించింది. ఐటీ సేవలకు ప్రధానమైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ)తోపాటు, రిటైల్, హైటెక్, కమ్యూనికేషన్స్ విభాగాలతోపాటు.. ప్రాంతాలవారీగా కూడా బలహీనతలు కనిపిస్తున్నట్లు ఐటీ విశ్లేషకులు పేర్కొన్నారు.

పెట్టుబడులు సిప్ చేస్తున్నారు

- రూ. 2 లక్షల కోట్లకు సిప్‌లు
- 2022–23తో పోలిస్తే 28 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ఆర్థిక పరిస్థితులపై సానుకూల అంచనాల నేపథ్యంలో క్రమానుగత పెట్టుబడులు (సిప్) 2023–2024లో రూ. 2 లక్షల కోట్ల రికార్డ్ స్థాయికి చేరాయి. 2022–2023తో పోలిస్తే ఇది 28% అధికం. ఫండ్స్ సంస్థల సమాఖ్య యాంఫీ గణాంకాల ప్రకారం 2016–17లో రూ. 43,921 కోట్లుగా ఉన్న సిప్ పెట్టుబడులు 2022–23 నాటికి రూ. 1.56 లక్షల కోట్లకు చేరాయి. ఇవి 2020–21లో రూ. 96,080 కోట్లుగా, 2021–22లో రూ. 1.24 లక్షల కోట్లుగా ఉన్నాయి. మరోవైపు, గతేడాది మార్చి నెలలో సిప్‌ల రూపంలో రూ. 14,276 కోట్లు రాగా ఈ ఏడాది మార్చిలో 35 శాతం వృద్ధి చెంది ఆల్–టైమ్ గరిష్ట స్థాయి రూ. 19,270 కోట్లు వచ్చాయి. ఫిబ్రవరి, మార్చిలో వరుసగా రెండు నెలల పాటు సిప్ పెట్టుబడులు రూ. 19,000 కోట్ల మార్కును దాటాయి.

భారత్ వృద్ధి అంచనా పెంచిన ఏడీబీ



6.7 శాతం నుంచి 7 శాతానికి అప్

న్యూఢిల్లీ: భారత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) వృద్ధి అంచనాలను ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) 30 బేసిస్ పాయింట్లు పెంచింది. తొలి అంచనాలు (2023 డిసెంబర్ అంచనాలు) 6.7 శాతంకాగా, దీనిని 7 శాతానికి పెంచుతున్నట్లు వివరించింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగ పెట్టుబడుల పెరుగుదల, వినియోగ డిమాండ్ పటిష్టత తాజా అంచనాలకు కారణమని ఏప్రిల్ ఎడిషన్ అవుట్‌లుక్‌లో ఏడీబీ పేర్కొంది. ఆసియా పసిఫిక్ ప్రాంతానికి ప్రధాన ''గ్రోత్ ఇంజిన్''గా భారత్ ఉంటుందని అవుట్‌లుక్‌లో విశ్లేషించింది. ఇక 2025–26లో వృద్ధి 7.2 శాతంగా ఉంటుందన్నది ఏడీబీ తాజా అంచనా. అయితే ప్రస్తుత ఆర్థిక సవాళ్ల పట్ల అప్రమత్తత అవసరమని హెచ్చరించింది. 2024–25 విషయానికి వస్తే, ఆర్‌బీఐ కూడా దేశాభివృద్ధి రేటు 7 శాతంగా ఉంటుందని పేర్కొనడం గమనార్హం.

ఎడిల్‌వీజ్ ఆల్ట్ చేతికి ఇన్‌ఫ్రా ఆస్తులు



ఎల్‌అండ్‌టీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్స్ కొనుగోలు

ముంబై: ప్రత్యామ్నాయ పెట్టుబడుల ఫండ్ ఎడిల్‌వీజ్ ఆల్టర్నేటివ్స్ మౌలిక సదుపాయ ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ప్రయివేట్ రంగ దిగ్గజం ఎల్‌అండ్‌టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్(ఎల్‌టీఐడీపీఎల్) కొనుగోలును పూర్తిచేసినట్లు తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ(జేవీ) ఎల్‌టీఐడీపీఎల్‌ను సొంతం చేసుకునే బాటలో రూ. 6,000 కోట్ల విలువైన డీల్‌ను పూర్తి చేసినట్లు ఎడిల్‌వీజ్ ఆల్ట్ తాజాగా వెల్లడించింది. ఎల్‌టీఐడీపీఎల్ వివిధ రహదారులు, విద్యుత్ ప్రసార లైన్లతో కూడిన ఆస్తులను కలిగి ఉన్నట్లు పేర్కొంది. జేవీలో ఎల్‌అండ్‌టీ వాటా 51 శాతంకాగా.. కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ మిగిలిన 49 శాతం వాటాను కలిగి ఉంది. జేవీ కొనుగోలును తొలుత 2022 డిసెంబర్‌లో ఎడిల్‌వీజ్ ఆల్ట్ ప్రకటించింది. దీనిలో భాగంగా తాజా పరిణామం చోటుచేసుకుంది.

భారతి హెక్సాకామ్ లిస్టింగ్ నేడు



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్‌లో భాగమైన భారతి హెక్సాకామ్ షేర్లు శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి. దీని ఇష్యూ ధర షేరు ఒక్కింటికి రూ. 570. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇదే తొలి పబ్లిక్ ఇష్యూ కానుంది. ఏప్రిల్ 5తో ముగిసిన ఈ ఇష్యూకి 29.88 రెట్లు బిడ్లు దాఖలయ్యాయి. రూ. 4,275 కోట్ల సమీకరణ ఈ ఆఫర్ లక్ష్యం.

ప్రియం కానున్న టెలికం చార్జీలు!



న్యూఢిల్లీ: ఇంటర్నెట్, ఫోన్ కాల్ చార్జీలు పెరగనున్నాయి. సాధారణ ఎన్నికల తర్వాత కొత్త ధరలను అమలు చేసేందుకు టెలికం కంపెనీలు సన్నద్ధం అవుతున్నట్టు సమాచారం. ఇదే జరిగితే టెలికం టారిఫ్‌లు 15–17 శాతం పెరిగే అవకాశం ఉంది. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 మధ్య ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఐపీవో సన్నాహాలు



రూ. 10,000 కోట్ల సమీకరణ!

ముంబై: పీఎస్‌యూ దిగ్గజం ఎన్‌టీపీసీ అనుబంధ కంపెనీ.. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల ఎంపికను చేపట్టినట్లు తెలుస్తోంది. ఐపీవో ద్వారా పునరుత్పాదక రంగ కంపెనీ రూ. 10,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. తద్వారా 2022లో బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్‌ఐసీ తదుపరి అతిపెద్ద పబ్లిక్ ఇష్యూకి తెరతీయనుంది. నిధులను సోలార్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా తదితర భవిష్యత్ ప్రాజెక్టులు, విస్తరణ ప్రణాళికలకు పెట్టుబడులుగా వెచ్చించనుంది. ఐపీవో కోసం ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్‌ను షార్ట్‌లిస్ట్ చేసింది.

సాక్షి స్పోర్ట్స్



పోరాడి ఓడిన సుమిత్

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో భాగంగా గురువారం ప్రపంచ ఏడో ర్యాంకర్ హోల్గర్ రూనే (డెన్మార్క్)తో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగాల్ 3-6, 6-3, 2-6తో పోరాడి ఓడిపోయాడు. 2 గంటల 11 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 93వ ర్యాంకర్ సుమిత్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. సుమిత్‌కు 42,935 యూరోల (రూ. 38 లక్షల 38 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ప్రదర్శనతో సుమిత్ ఈనెల 15న విడుదల చేసే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 13 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 80వ ర్యాంక్‌కు చేరుకోనున్నాడు. అంతేకాకుండా మేలో జరిగే ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో నేరుగా మెయిన్ 'డ్రా'లో చోటును ఖరారు చేసుకున్నాడు. 2019లో ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ మెయిన్ 'డ్రా'లో ఆడనున్న భారత ప్లేయర్‌గా సుమిత్ గుర్తింపు పొందుతాడు.

ప్రజ్ఞానంద, విదిత్ విజయం



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఆరో రౌండ్ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతీ విజయాలు అందుకోగా... దొమ్మరాజు గుకేశ్ 'డ్రా' నమోదు చేశాడు. నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)తో జరిగిన గేమ్‌లో తమిళనాడు కుర్రాడు ప్రజ్ఞానంద 45 ఎత్తుల్లో... అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌లో మహారాష్ట్రకు చెందిన విదిత్ 40 ఎత్తుల్లో గెలుపొందారు. హికారు నకమురా (అమెరికా)తో జరిగిన గేమ్‌ను గుకేశ్ 40 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఆరో రౌండ్ తర్వాత గుకేశ్ నాలుగు పాయింట్లతో నిపోమ్‌నిషితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. మహిళల విభాగం ఆరో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి ఓటమి పాలయ్యారు. హంపి 48 ఎత్తుల్లో లెటింగ్జీ (చైనా) చేతిలో... వైశాలి 29 ఎత్తుల్లో కాటరీనా లాగ్నో (రష్యా) చేతిలో ఓడిపోయారు.

భారత రెజ్లర్లకు మూడు పతకాలు



బిష్కెక్ (కిర్గిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లు మూడు పతకాలు సాధించారు. ఉదిత్ (57 కేజీలు) రజతం నెగ్గగా... అభిమన్యు (70 కేజీలు), విక్కీ (97 కేజీలు) కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఫైనల్లో ఉదిత్ 4–5తో కెంటో యుమియా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. బౌట్ చివరి సెకన్లలో ఉదిత్ ప్రత్యర్థికి ఒక పాయింట్ కోల్పోయాడు. 2020 నుంచి 2023 వరకు ఈ విభాగంలో భారత్‌కు స్వర్ణ పతకాలు లభించాయి. రవి కుమార్ దహియా వరుసగా మూడేళ్లు (2020, 2021, 2022)... గత ఏడాది అమన్ ఈ విభాగంలో పసిడి పతకాలు నెగ్గారు. మరోవైపు కాంస్య పతకాల బౌట్‌లలో అభిమన్యు 6–5తో కుల్దాషెవ్ (ఉజ్బెకిస్తాన్)పై, విక్కీ 10–1తో అరోనోవ్ (కిర్గిస్తాన్)పై గెలుపొందారు.

స్పెయిన్‌లో శిక్షణకు జ్యోతి యర్రాజీ



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల రజత పతక విజేత, ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ స్పెయిన్‌లో 45 రోజుల ప్రత్యేక శిక్షణ తీసుకోనుంది. జ్యోతికి సంబంధించి విమాన ప్రయాణాలు, వసతి, శిక్షణ ఇతరత్రా ఖర్చులన్నీ మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఓసీ) భరిస్తుందని కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్ సహా, ఈ సీజన్‌లో అత్యున్నత ప్రదర్శన కనబరిచేందుకు ఎంఓసీ పథకంలో ఆమెతో పాటు పలువురు అథ్లెట్లకు ఆర్థిక చేయూత ఇవ్వనున్నారు. వైజాగ్‌కు చెందిన 24 ఏళ్ల జ్యోతి గత ఆసియా క్రీడల్లో 100 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకం గెలిచింది. మరో తెలుగుతేజం, స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలకు కూడా మరింత మెరుగైన శిక్షణ కోసం ఆర్థిక సాయం అందించే ప్రతిపాదనకు ఎంఓసీ ఆమోదం తెలిపింది.

అమెరికన్ ఫుట్‌బాల్ దిగ్గజం ఓజే సింప్సన్ కన్నుమూత



లాస్ వేగస్: వివాదాస్పద అమెరికన్ ఫుట్‌బాల్ దిగ్గజ క్రీడాకారుడు, హాలీవుడ్ నటుడు ఓజే సింప్సన్ కన్ను మూశాడు. 76 ఏళ్ల సింప్సన్ కొన్నాళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. 1969 నుంచి 1979 వరకు అమెరికాలోని విఖ్యాత నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ (ఎన్ఎఫ్ఎల్)లో బఫెలో బిల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో 49ఈఆర్ఎస్ జట్లకు సింప్సన్ ప్రాతినిధ్యం వహించాడు. 1994 జూన్‌లో తన మాజీ భార్య నికోల్ బ్రౌన్, ఆమె స్నేహితుడు రొనాల్డ్ గోల్డ్‌మన్‌ల జంట హత్య కేసులో ప్రమేయం ఉందంటూ సింప్సన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో 11 నెలల విచారణ తర్వాత సింప్సన్ నిర్దోషిగా బయటపడ్డాడు. అయితే 2007లో సింప్సన్ లాస్ వేగస్‌లోని ఓ క్యాసినోలో మారణాయుధాలతో ప్రవేశించి దోపిడికి పాల్పడ్డారు. విచారణ అనంతరం 2008లో సింప్సన్‌కు 33 ఏళ్ల జైలు శిక్ష విధించారు. తొమ్మిదేళ్ల జైలు శిక్ష అనుభవించాక 2017లో సింప్సన్ పెరోల్‌పై విడుదలయ్యాడు.

ముంబై ఫటాఫట్...

- 197 పరుగుల లక్ష్యాన్ని 15.3 ఓవర్లలోనే ఛేదించిన హార్దిక్ బృందం
- ఇషాన్, సూర్యకుమార్‌ల విధ్వంసం
- 5 వికెట్లతో హడలెత్తించిన బుమ్రా
- బెంగళూరు జట్టుకు ఐదో పరాజయం



బుమ్రా


ఇషాన్
సూర్యకుమార్

ముంబై: ముంబై ఇండియన్స్ ముందున్న కొండంత లక్ష్యాన్ని ఇద్దరే ఇద్దరి విధ్వంసం మంచు ముక్కలా కరిగించేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 69; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (19 బంతుల్లో 52; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) సిక్సర్ల సునామీతో ముంబై 197 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.3 ఓవర్లలోనే ఛేదించింది. దాంతో హార్దిక్ పాండ్యా నాయకత్వంలోని ముంబై ఇండియన్స్ 7 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)పై ఘనవిజయం సాధించింది. అంతకుముందు తొలుత ఆర్‌సీబీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. డుప్లెసిస్ (40 బంతుల్లో 61; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా, రజత్ పటిదార్ (26 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), దినేశ్ కార్తీక్ (23 బంతుల్లో 53 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిపించారు. ముంబై బౌలర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బుమ్రా 21 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు.

కోహ్లి విఫలం

సూపర్ ఫామ్‌లో ఉన్న కోహ్లి (3) విఫలమవగా, విల్ జాక్స్ (8) నిరాశపరిచాడు. ఈ దశలో బెంగళూరును కెప్టెన్ డుప్లెసిస్ అండతో పటిదార్ ధాటిగా నడిపించాడు. 12వ ఓవర్లో కోయెట్జీ బౌలింగ్‌లో రెండు వరుస సిక్స్‌లు బాదిన పటిదార్ 25 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకొని తర్వాతి బంతికే వెనుదిరిగాడు. మ్యాక్స్‌వెల్ (0) ఈ సీజన్‌లో మూడోసారి డకౌటయ్యాడు. అడపాదడపా షాట్లతో డుప్లెసిస్ 33 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. అయితే బుమ్రా వరుస ఓవర్లలో రెండేసి వికెట్లను పడగొట్టాడు. డుప్లెసిస్, హిట్టర్ లామ్రోర్ (0)లతో పాటు, సౌరవ్ (9), వైశాక్ (0)లను బుమ్రా అవుట్ చేసినా... దినేశ్ కార్తీక్ ధనాధన్ ఆటతో బెంగళూరు మంచి స్కోరు చేసింది.

ఇషాన్, సూర్యల తుఫాన్‌తో...

భారీ లక్ష్య ఛేదనలో ముంబై బ్యాటర్లు మెరుపు షాట్లతో హోరెత్తించారు. ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దీంతో ముంబై పవర్‌ప్లేలోనే 72/0 స్కోరు చేసింది. ఇషాన్ 23 బంతుల్లో అర్ధ సెంచరీని సాధించగా, రోహిత్ నింపాదిగా ఆడాడు. కేవలం 8.3 ఓవర్లలోనే జట్టు స్కోరు 100 చేరింది. అదే ఓవర్లో ఇషాన్ దూకుడు ముగిసింది. అనంతరం సూర్యకుమార్ విధ్వంసం సృష్టించి 17 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. రోహిత్, సూర్యలు అవుటయ్యాక హార్దిక్ పాండ్యా (6 బంతుల్లో 21 నాటౌట్; 3 సిక్స్‌లు), తిలక్ వర్మ (10 బంతుల్లో 16 నాటౌట్; 3 ఫోర్లు) ధాటిగా ఆడి ముంబైను విజయతీరాలకు చేర్చారు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) ఇషాన్ (బి) బుమ్రా 3; డుప్లెసిస్ (సి) డేవిడ్ (బి) బుమ్రా 61; జాక్స్ (సి) డేవిడ్ (బి) మధ్వాల్ 8; పటిదార్ (సి) ఇషాన్ (బి) కోయెట్జీ 50; మ్యాక్స్‌వెల్ (ఎల్బీడబ్ల్యూ) గోపాల్ 0; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 53; లామ్రోర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 0; సౌరవ్ (సి) ఆకాశ్ (బి) బుమ్రా 9; వైశాక్ (సి) నబి (బి) బుమ్రా 0; ఆకాశ్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 196. **వికెట్ల పతనం:** 1-14, 2-23, 3-105, 4-108, 5-153, 6-153, 7-170, 8-170. **బౌలింగ్:** నబీ 1-0-7-0, కోయెట్జీ 4-0-42-1, బుమ్రా 4-0-21-5, ఆకాశ్ 4-0-57-1, శ్రేయస్ గోపాల్ 4-0-32-1, షెఫర్డ్ 2-0-22-0, హార్దిక్ 1-0-13-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) కోహ్లి (బి) ఆకాశ్‌దీప్ 69; రోహిత్ (సి) టాప్లీ (బి) జాక్స్ 38; సూర్యకుమార్ (సి) మహిపాల్ (బి) వైశాక్ 52; హార్దిక్ (నాటౌట్) 21; తిలక్ వర్మ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (15.3 ఓవర్లలో 3 వికెట్లకు) 199. వికెట్ల పతనం**: 1-101, 2-139, 3-176. **బౌలింగ్:** టాప్లీ 3-0-34-0, సిరాజ్ 3-0-37-0, ఆకాశ్‌దీప్ 3.3-0-55-1, మ్యాక్స్‌వెల్ 1-0-17-0, వైశాక్ 3-0-32-1, 2-0-24-1.

ఐపీఎల్‌లో నేడు

లక్నో × ఢిల్లీ
వేదిక: లక్నో
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	5	4	1	8	0.871
కోల్‌కతా	4	3	1	6	1.528
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	5	3	2	6	0.666
హైదరాబాద్	5	3	2	6	0.344
గుజరాత్	6	3	3	6	-0.637
ముంబై	5	2	3	4	-0.073
పంజాబ్	5	2	3	4	-0.196
బెంగళూరు	6	1	5	2	-1.124
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ముగిసిన భారత్ పోరు

ప్రీక్వార్టర్స్‌లో ఓడిన సింధు, ప్రణయ్, అశ్విని–తనీషా జోడీ



నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు... పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్... మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో ద్వయం ప్రీక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. ఆరో సీడ్ హాన్ యువె (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో సింధు 18–21, 21–13, 17–21తో ఓటమి చవిచూసింది. ఏడో సీడ్ ప్రణయ్ 18–21, 11–21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలయ్యాడు. అశ్విని–తనీషా జోడీ 17–21, 12–21తో మూడో సీడ్ నామి మత్సుయామ–చిహారు షిదా (జపాన్) జంట చేతిలో ఓడింది. ప్రీక్వార్టర్ ఫైనల్లో అశ్విని–తనీషా ఓటమి పాలైనా పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఈనెల 30న విడుదలయ్యే ర్యాంకింగ్స్‌లో టాప్–16లో ఉన్న డబుల్స్ జోడీలకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారవుతాయి. అశ్విని–తనీషా ద్వయం 20వ ర్యాంక్‌లో ఉన్నప్పటికీ... ఒక దేశం నుంచి గరిష్ఠంగా రెండు జోడీలకు మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ ర్యాంకింగ్స్‌లో అశ్విని ద్వయం 12వ స్థానంలో ఉండటం... ఇదే చివరి అర్హత టోర్నీ కానుండటంతో భారత జోడీ ర్యాంకింగ్స్‌లో ఎలాంటి మార్పు ఉండదు.

మూడు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని భారత్ గెలుపు



చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టు రెండో విజయం సాధించింది. చైనీస్ తైపీతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1తో నెగ్గింది. తొలి మ్యాచ్‌లో రుతుజా భోస్లే 6–3, 6–2తో హావో చింగ్ చాన్‌ను ఓడించింది. రెండో మ్యాచ్‌లో అంకిత రైనా 6–2, 4–6, 4–6తో ఎన్ షువో లియాంగ్ చేతిలో ఓటమి పాలైంది. నిర్ణాయక మూడో మ్యాచ్‌లో అంకిత–ప్రార్థన జోడీ 4–6, 6–1, 15–13తో హావో చింగ్ చాన్–ఎన్ షువో లియాంగ్ జంటపై గెలిచి భారత్‌కు విజయాన్ని అందించింది. టైబ్రేక్‌లో అంకిత జోడీ మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకోవడం విశేషం.




మండుటెండలో మత్తడి దూకుతున్న చెరువు

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఎన్జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన కందికుంట చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగుపోస్తోంది. మూసీనదిలోని వరదనీటిని శాలిగౌరారం ప్రాజెక్టులోకి రాచకాల్వ ద్వారా మళ్లించేందుకు ఇటీవల ఆయకట్టు రైతులు శ్రమదానం చేశారు. పల్లివాడ ఆనకట్ట వద్ద ఉన్న హెడ్‌రెగ్యులేటరీ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు రాచకాల్వలోకి నీటిని మళ్లించడంతో మూసీనదిలోని వరదనీరు శాలిగౌరారం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో రాచకాల్వకు అనుసంధానంగా ఉన్న ఆయా చెరువులు గురువారం పూర్తిస్థాయిలో నిండి అలుగులు పోస్తున్నాయి.

..: శాలిగౌరారం :..

అప్రమత్తతే అతి ముఖ్యం

- అగ్ని ప్రమాదాల నియంత్రణకు అవగాహన తప్పనిసరి
- మార్గదర్శకాలు విడుదల చేసిన అగ్నిమాపక శాఖ
- ఈ ఏడాదిలో ఇప్పటికే 2,550 ఫైర్ కాల్స్ రిసీవ్ చేసుకున్నట్లు వెల్లడి
- 14 నుంచి 20 వరకు అగ్నిమాపక సేవల వారోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: ఎండాకాలం నేపథ్యంలో అగ్నిప్రమాదాలకు అవకాశాలు పెరిగాయి. అప్రమత్తతతో ఉంటేనే అగ్ని ప్రమాదాలను నియంత్రించడంతోపాటు ప్రమాదాలు జరిగినా తక్కువ నష్టంతో బయటపడొచ్చు. ఇందుకు ప్రజల్లో అవగాహన అతి ముఖ్యమని అగ్నిమాపకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక సేవల వారోత్సవాలు చేయనున్నట్టు ఫైర్ డీజీ వై.నాగిరెడ్డి ఇప్పటికే ప్రకటించారు. రద్దీ ఎక్కువగా ఉండే బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, నివాససముదాయాలు, మల్టీప్లెక్స్, మాల్స్‌లో వీటిని నిర్వహిస్తారు. ఎండల తీవ్రత పెరగడంతో అగ్నిప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ తెలంగాణ అగ్నిమాపకశాఖ కొన్ని మార్గదర్శకాలు వెల్లడించింది.



ఈ విషయాల్లో జాగ్రత్త

- వేసవి తీవ్రత పెరగడంతో ఫ్యాన్లు, ఏసీలు, ఇతర విద్యుత్ ఉపకరణాల వాడకం పెరుగుతుంది. దీనివల్ల ఓవర్‌లోడ్‌తో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంటుంది. విద్యుత్ వైరింగ్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఇంట్లో మంటల వ్యాప్తికి ప్రధాన అంశాల్లో వంటింట్లో మంటలు అంటుకోవడం కూడా.. అందువల్ల వంటగదిలో మంటలు అంటుకునే వస్తువులు లేకుండా చూసుకోవాలి. వీలైనంత గాలివెలుతురు ఉండేలా చూసుకోవాలి.
- అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవనాల్లో ఉండే వారు తప్పకుండా ఫైర్ ఆడిటింగ్ నిర్వహించాలి. అగ్నిమాపక నియంత్రణ పరికరాలు, మంటలార్పేందుకు నీటి పైప్‌లైన్ వ్యవస్థ, ఫైర్ అలార్మ్‌లు పనిచేస్తున్నాయా..ఇలా అన్నింటినీ ఒకసారి సరిచూసుకోవాలి.
- కారు ప్రయాణంలోనూ అగ్ని ప్రమాదాల నుంచి రక్షణకు పోర్టబుల్ ఫైర్ ఎక్స్టింగ్విషర్ (మంటలు ఆర్పేది) పెట్టుకోవాలి.
- ఇళ్లలో ఎలక్ట్రికల్ వస్తువులు వాడకపోతే వాటిని వెంటనే స్విచ్ఆఫ్ చేయడం అలవాటు చేసుకోవాలి.
- కార్యాలయాల్లో ఫైర్ స్ప్రింక్లర్ వ్యవస్థ, ఫైర్ అలార్మ్‌లు, ఎమర్జెన్సీ లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలి.

ఇప్పటి వరకు 2,550 ఫైర్ కాల్స్


రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి మార్చి చివరి వరకు అగ్నిప్రమాదాలకు సంబంధించి అన్ని రకాల ఫిర్యాదులు కలిపి 2,550 ఫైర్ కాల్స్ వచ్చినట్టు అగ్నిమాపకశాఖ అధికారులు వెల్లడించారు. గతేడాదిలో 8151 ఫైర్ కాల్స్ వచ్చినట్టు తెలిపారు. ఇందులో 141 తీవ్రమైన ప్రమాదాలు, 175 మధ్యతరహా అగ్ని ప్రమాదాలు ఉన్నట్టు తెలిపారు.

నైపుణ్య శిక్షణలో ఏపీతో బ్రిటన్ ప్రభుత్వం భాగస్వామ్యం

సాక్షి, అమరావతి: ఏపీ యువత బ్రిటన్‌లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా అవసరమైన నైపుణ్య శిక్షణను అందించడానికి యూకే ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో బ్రిటన్‌లో ఉన్న ఉపాధి అవకాశాలు, అందుకు అవసరమైన నైపుణ్య శిక్షణా అవకాశాలపై తెలుగు రాష్ట్రాల బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ఏపీ ప్రభుత్వంతో గురువారం చర్చలు జరిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద హెల్త్‌కేర్ రంగంలో నైపుణ్య శిక్షణను ఇవ్వనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ రాజబాబు చెప్పారు.

ఈవీ రూ.10 లక్షల లోపయితే ఓకే

- ఎలక్ట్రిక్ కార్లపై 55 శాతం మంది అభిప్రాయం ఇదే
- లోకల్ సర్కిల్స్ సర్వేలో ఆసక్తికరమైన అంశాలు



సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) కొనుగోలు చేసేవారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. పెరుగుతున్న వాయు కాలుష్యం..మండుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులు వీటి వైపు మొగ్గుచూపుతున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం భారత ఎలక్ట్రిక్ వాహన మార్కెట్ 2023లో రూ.16,675 కోట్లు ఉండగా..2025 నాటికి రూ. 62,532 కోట్లకు చేరే అవకాశముంది. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం పలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అయితే పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ కార్ల కొనుగోళ్ల విషయంలో వాహనదారులు భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నట్టు లోకల్ సర్కిల్స్ అనే సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిర్వహించిన ఈ సర్వేలో పాల్గొన్న వారి అభిప్రాయాల్లో మెజారిటీ వ్యక్తులు రూ.8 నుంచి రూ.10 లక్షలలోపు ధర ఉంటే ఎలక్ట్రిక్ కారు కొనుగోలు సులువు అవుతుందనే అభిప్రాయపడ్డారు.



పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో తాము ఎలక్ట్రిక్ కారు కొనాలని భావిస్తున్నట్టు 44 శాతం మంది చెప్పారు.

పెట్రోల్, డీజిల్ ధరల నుంచి ఉపశమనం పొందేందుకు 31% మంది ఎలక్ట్రిక్ వాహనాలకు మారేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

2023లో మనదేశంలో 72,321 ఎలక్ట్రిక్ కార్లు రిజిస్టర్ అయ్యాయి. లోకల్ సర్కిల్స్ సర్వేలో పాల్గొన్న వారిలో 5 శాతం మంది ఎలక్ట్రిక్ కారు కొనేందుకు ఆసక్తి చూపారు. ఈ లెక్క ప్రకారం 2024లో ఎలక్ట్రిక్ కార్ల డిమాండ్ 2,00,000కు చేరే అవకాశముంది.

ఎలక్ట్రిక్ కార్ల కొనుగోలుకు సంబంధించి దేశవ్యాప్తంగా 319 జిల్లాల్లో లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన ఈ సర్వేలో 40 వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది.

తెలంగాణలో ద్విచక్ర, త్రిచక్ర వాహనాలపైనే ప్రస్తుతం రిజిస్ట్రేషన్ జీవితకాలపు ఫీజు రాయితీ ఉండగా, ఏపీలో కార్లు, జీపులపై కూడా రిజిస్ట్రేషన్ ఫీజు పూర్తిగా రాయితీ ఇస్తున్నట్టు అధికారవర్గాల సమాచారం.

ఎలక్ట్రిక్ కారు కొనాలనుకోవడానికి కారణం?


పర్యావరణ హితంగా ఉండాలని..	పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను తట్టుకునేందుకు	తక్కువ ధరలు	ఇతర కారణాలు	చెప్పలేం
44%	31%	15%	5%	5%

ఎలక్ట్రిక్ కారు కొనకపోవడానికి కారణాలు ?

సాధారణ కార్లతో పోలిస్తే అధిక ధర	21 శాతం
మా ప్రాంతంలో సరిపడా చార్జింగ్ స్టేషన్లు లేకపోవడం	21 శాతం
ఎలక్ట్రిక్ కార్ల గురించి అవగాహన లేదు	12 శాతం
ఈ సమయంలో కారు కొనాలనుకోవడం లేదు	26 శాతం
నా బడ్జెట్‌కు తగిన మోడల్స్ ఈవీలో లేవు	7 శాతం
ఇతర కారణాలు, కొనేంత డబ్బు లేదు	8 శాతం
ఇది నాకు వర్తించదు	5 శాతం

టుడేస్ గ్రాఫిక్

ప్రపంచంలో సైబర్ క్రైం అత్యధికంగా జరుగుతున్న టాప్-10 దేశాలు



ఆధారం: ఆక్స్‌ఫర్డ్, న్యూ సౌత్ వేల్స్ వర్సిటీలకు చెందిన పరిశోధకులు రూపొందించిన సైబర్ క్రైం ఇండెక్స్

సారు రారు.. సదువు సాగదు..




ఆదిలాబాద్ జిల్లా బేల మండలం గణేశ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధి రాయ్‌పూర్ తండాలో గిరిజన విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా మారుతోంది. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి వరకు ఉండగా.. 18 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి ఉపాధ్యాయుడు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఇన్ సర్వీస్ బీఈడీకి వెళ్లాడు. ఆయన స్థానంలో మండల ఐఈఆర్‌పీ (ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)ను నియమించారు. ఆయన మండల కార్యాలయంలో పనిలేని రోజుల్లో పాఠశాలకు ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్తుంటారు. రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేకపోవడంతో చదువు అటకెక్కింది. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం కూడా ఇవ్వలేదు. కొందరు విద్యార్థులు మాత్రం పాఠశాలకు వచ్చి ఇలా వరండాలో కూర్చుని వెళ్తుంటారు. విద్యార్థులు ఇలా ఏడాదిగా చదువుకు దూరమవుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

..: బేల/సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్ :..

ఆంగ్లంతోపాటు తెలుగులోనూ పేపర్ ఇవ్వండి

ఆర్ట్ టీచర్ పోస్టులకు మళ్లీ పరీక్ష నిర్వహించండి.. టీఆర్ఈఐఆర్‌బీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా ఆర్ట్ టీచర్ పోస్టులకు తెలుగు, ఆంగ్లమాధ్యంలో పరీక్ష నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్‌కు భిన్నంగా కేవలం ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్ష నిర్వహించడంతో అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లగా, ఈ పరీక్షను ఆంగ్లంతోపాటు తెలుగులోనూ పేపర్ ఇవ్వాలని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టీఆర్ఈఐఆర్‌బీ)ని హైకోర్టు ఆదేశించింది. 2023, ఏప్రిల్ 5న నోటిఫికేషన్‌లో పేర్కొన అంశాలను పాటించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలైన పలు పిటిషన్లను అనుమతించింది. ఆర్ట్ టీచర్ పోస్టుల భర్తీ కోసం గత ఏప్రిల్‌లో టీఆర్ఈఐఆర్‌బీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆగస్టు 1న ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. నోటిఫికేషన్‌లో రెండు భాషల్లో (ఆంగ్లం, తెలుగు)లో పరీక్ష ఉంటుందని పేర్కొనగా, పరీక్ష మాత్రం ఆంగ్లంలోనే సాగింది. దీన్ని సవాల్ చేస్తూ జోగుళాంబ గద్వాల్ జిల్లా రాజోలి మండలం తాండ్రపాడుకు చెందిన జి.వినోద్‌తోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆగస్టు 1న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి తిరిగి రెండు భాషల్లో నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ వాదనలు వినిపిస్తూ.. 'నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా రెండు భాషల్లో పరీక్ష నిర్వహించడంలో టీఆర్ఈఐఆర్‌బీ విఫలం అయ్యింది. ఇది రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘనే అవుతుంది. తెలుగు మీడియం అభ్యర్థులు కూడా వేలల్లో పరీక్షకు హాజరయ్యారు. పరీక్షను తెలుగులోనూ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రెసిడెన్షియల్ సొసైటీల పరిధిలోని ఇన్‌స్టిట్యూషన్‌లలో ఆంగ్ల మాధ్యమాన్ని బోధిస్తున్న విషయాన్ని స్టాండింగ్ కౌన్సిల్ రమేశ్ ప్రస్తావించారు. పోటీతత్వ విద్యా వాతావరణాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో ఇంగ్లిష్‌లో మాత్రమే పరీక్షను నిర్వహించడం సరిపోతుందని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తిరిగి పరీక్ష నిర్వహించాలని టీఆర్ఈఐఆర్‌బీని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు.



అలిపిరి కాలినడక మార్గంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్‌లు గురువారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. జస్టిస్ సంజయ్ కరోల్ అలిపిరి మార్గంలో కాలినడకన గురువారం రాత్రి తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు.



ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీటీ రవికుమార్

జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 రిజిస్ట్రేషన్ తేదీల మార్పు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రిజిస్ట్రేషన్ తేదీలను మద్రాస్ ఐఐటీ మార్చింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 21 నుంచి 30 వరకు 'అడ్వాన్స్‌డ్' కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే, ఐఐటీ మద్రాస్ కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 27 నుంచి మే 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించింది. పరీక్ష తేదీలో ఎలాంటి మార్పు లేదని, తొలుత ప్రకటించిన ప్రకారం మే 26న పరీక్ష జరుగుతుందని పేర్కొంది. తాజాగా మార్చిన తేదీల ప్రకారం మే 10 సాయంత్రం 5 గంటల వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తు ఫీజు చెల్లించవచ్చు. మే 17 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు (అడ్మిట్ కార్డులు) డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్ష అనంతరం అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు మే 31 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రాథమిక ఆన్సర్ 'కీ' జూన్ 2న విడుదల చేస్తారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది కీ, ఫలితాలను జూన్ 9న ఉదయం 10 గంటలకు ప్రకటిస్తారు. ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రిజిస్ట్రేషన్ జూన్ 9, 10 తేదీ సాయంత్రం వరకు చేసుకోవచ్చు.

అసలే హాలోవీన్ బొమ్మ.. ఆపై రెండో పెళ్లి..




25 ఏళ్ల అమ్మాయి.. పేరు ఫెలిసిటీ కాడ్లెక్..

అమెరికాకు చెందిన ఆమె ఈ మధ్యే పెళ్లి చేసుకుంది.. ఎవరిని?.. ఓ ఆరడుగుల హాలోవీన్ బొమ్మ రాబర్ట్‌ను.. అంటే దెయ్యాలు, భూతాల్లాంటి బొమ్మ అనుకోవచ్చులెండి. కానీ ఆ రాబర్ట్‌కి అప్పటికే పెళ్లయింది. అదీ హాలోవీన్ బొమ్మే.. పేరు కెల్లీ రోసీ. ఈ బొమ్మల జంటకు పది బొమ్మ పిల్లలూ ఉన్నాయి. వీరంతా జాంబీలు. అంటే ఒకరినొకరు కొరుక్కుంటూ అంతా దెయ్యాల్లా మారిపోతారే.. అదే హాలీవుడ్ జాంబీ సినిమాల్లో చూపిస్తారు కదా.. అలాగన్న మాట.

..ఫెలిసిటీ కాడ్లెక్ రాబర్ట్‌తో ఎనిమిదేళ్లుగా లివిన్ రిలేషన్‌లో ఉందట. ఆ అనుబంధం ముదిరిపోయి.. ఈ మధ్యే పెళ్లి చేసుకుంది. ఇక వారితోనే కలిసి ఉంటుందట. తమది స్పిరిచ్యువల్ బంధమట.

చిత్రమేంటంటే.. ఈ బొమ్మలన్నీ తాను కొని తెచ్చి ఇంట్లో పెట్టుకున్నవే. పైగా ఈ ఫ్యామిలీలోకి మరో జాంబీ బొమ్మ పిల్లాడిని ఎక్స్‌పెక్ట్ చేస్తోందట. ఫెలిసిటీ దానికి పీటర్ అని ఇప్పటికే పేరు కూడా ఫిక్స్ చేసేసింది. ఈ జాంబీ బొమ్మలు, పెళ్లి ఫొటోలు తాజాగా నెట్‌లో వైరల్‌గా మారాయి.

..పిచ్చికి పరాకాష్ఠ అంటే ఇదేనేమో!!

జలం.. జీవం కరువు



ఒకప్పుడు అడవిలోని జంతువులన్నీ దాహం తీర్చుకోవడానికి ఇక్కడికే వచ్చేవి.. జలమే కాదు.. జీవమూ తొణికిసలాడేది. కరువొచ్చింది.. జలంతోపాటు జీవమూ మాయమైంది. ఆ పరిస్థితికి అద్దం పట్టేలా ఉన్న ఈ దృశ్యం మొజాంబిక్‌లోని గొరాంగోస నేషనల్ పార్కులోనిది. ఈ చిత్రాన్ని పియోత్ర్ నస్కర్‌స్కీ అనే ఫొటోగ్రాఫర్ తీశారు. వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీలో ఈ చిత్రం జ్యూరీ ప్రశంసలను అందుకుంది.

నగదు అక్రమ రవాణాపైనా సిట్ నజర్!

ఉప ఎన్నికలు, సాధారణ ఎన్నికల సమయంలో తరలింపు • కీలక పాత్ర పోషించిన ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు

మరో కేసు నమోదుకు సన్నాహాలు చేస్తున్న పోలీసులు • ట్యాపింగ్ కేసు దర్యాప్తు పారదర్శకంగా జరుగుతోంది: సిటీ కొత్వాల్

సాక్షి, హైదరాబాద్: గత ఎన్నికల సందర్భంగా పోలీసు వాహనాల్లో నగదును అక్రమంగా తరలించిన విషయం ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు సందర్భంగా వెలుగుచూడటంతో హైదరాబాద్ పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. దీనికి సంబంధించి మరో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. ఈ కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా కొందరు ప్రజాప్రతినిధులు నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు నేతృత్వంలో సాగిన ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ఇప్పటికే సిట్ అధికారులు పలు కీలక ఆధారాలు సేకరించారు. ఈ నేపథ్యంలోనే ఉప ఎన్నికలు, సాధారణ ఎన్నికల సమయంలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు ఆదేశాలు, సూచనల మేరకు పోలీసు బృందాలు ప్రతిపక్షాలకు చెందినవిగా అనుమానిస్తూ భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నాయి. విపక్షాల నగదుకు సంబంధించిన సమాచారం వారికి ట్యాపింగ్ ద్వారానే తెలిసినట్లు వెల్లడైంది. మరోపక్క ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు ఆదేశాల మేరకు పోలీసులే తమ వాహనాల్లో కొందరు అభ్యర్థులకు సంబంధించిన నగదును తరలించినట్లు సిట్ అధికారులు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. దీనిపై ఆరా తీసిన పోలీసులు ఆ నగదు మూలం, చేరిన ప్రాంతం తదితరాలు గుర్తించారు. ఎలక్షన్ సమయంలో తనిఖీలు ముమ్మరంగా ఉంటాయి. దీంతో ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావులు ఏర్పాటు చేసిన బృందాలు కొన్ని బడా సంస్థలతో పాటు వ్యాపారవేత్తలకు చెందిన నగదును పోలీసు వాహనాల్లో రవాణా చేసినట్లు అధికారులు తేల్చారు. టాస్క్‌ఫోర్స్, ఎస్ఐబీ వాహనాల్లో రవాణా అయిన ఈ నగదు కొందరు నేతలకు చేరినట్లు అనుమానిస్తున్నారు. సిట్ అధికారులు ఇప్పటికే ఆయా నగదు, అక్రమ రవాణా వాహనాల్లో ప్రయాణించిన ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు డ్రైవర్లను ప్రశ్నించి వాంగ్మూలాలు నమోదు చేశారు.



ప్రభాకర్‌రావు



రాధాకిషన్‌రావు

2018 నుంచి.. గత ఏడాది డిసెంబర్ వరకు..

2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, 2020లో జరిగిన దుబ్బాక, 2021 అక్టోబర్‌లో జరిగిన హుజూరాబాద్, 2022 అక్టోబర్ రెండో వారంలో జరిగిన మునుగోడు ఉప ఎన్నికలతో పాటు గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో ఈ నగదు అక్రమ రవాణా ఎక్కువగా జరిగినట్లు తేల్చారు. పోలీసు కస్టడీ నేపథ్యంలో సిట్ అధికారులు రాధా కిషన్‌రావును ఈ నగదు అక్రమ రవాణా పైనా ప్రశ్నించారు. అయితే ఆయన నుంచి సరైన సమాధానం రాలేదని తెలిసింది. ఇప్పటికే ఈ నగదు అక్రమ రవాణాపై కీలక సమాచారం సేకరించిన అధికారులు రాధాకిషన్‌రావు సహా మరికొందరిపై మరో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. గురువారం నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మీరాలం ఈద్గా వద్ద మీడియాతో మాట్లాడుతూ, ట్యాపింగ్ కేసు దర్యాప్తు పూర్తి పారదర్శకంగా జరుగుతోందని అన్నారు. సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. రాజకీయ నాయకులకు నోటీసులు ఇచ్చే అంశం పైనా త్వరలో వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

శ్రీరామ నవమికి ఆన్‌లైన్‌లో గదుల బుకింగ్ సౌకర్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈ నెల 17,18 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం వేడుకలకు ఆన్‌లైన్ ద్వారా పట్టణంలో గదులు బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. గదులు కావాల్సినవారు https://book.bhadrachalamonline. com/ book& hotel లింక్ ద్వారా బుక్ చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.